రెండు మహానగరాలు
రూ॥250/-
పేజీలు:245

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

### నేడు వరుణ యాగం

నాగార్జునసాగర్‌లోని విజయ్ విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జరగనున్న పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. 108 మంది రుత్వికులతో, 11 హోమగుండాలతో వరుణ యాగం జరగనుంది. కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురవాలనే సంకల్పంతో ప్రభుత్వం యాగం చేయనుంది. మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో సిఎం బయలుదేరి యాగం వద్దకు సిఎం చేరుకోనున్నారు.

సంపుటి 09, సంచిక: 251 | సోమవారం | 10-08-2026 | ఖమ్మం    Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar    పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## ఎప్పటికైనా సమాధానం చెప్పక తప్పదు

- హోం మంత్రి అమిత్ షా మౌనంపై రాహుల్‌గాంధీ వ్యాఖ్య
- క్షమాపణ చెప్పడానికి బదులుగా, మోదీజీ క్షమను ప్రసాదించడంలో బిజీగా ఉన్నారని ఎద్దేవా


(ఫైల్ ఫోటో)

**న్యూఢిల్లీ :** 'పార్లమెంట్ మార్చ్' సందర్భంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల అమానుష చర్యపై హోం మంత్రి అమిత్ షా మౌనాన్ని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోమారు ప్రశ్నించారు. ఈ నేరానికి సంబంధించి ఎప్పటికైనా మంత్రి సమాధానం చెప్పక తప్పదని స్పష్టం చేశారు. శనివారం ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన 'ఛాత్రో కి గూంజ్' (విద్యార్థుల గళం) కార్యక్రమంలో ఒక విద్యార్థి తనకు ఇక ఏ మార్గమూ మిగలలేదని చెప్పారని తరువాయి 8లో

## ఎఫ్‌సిఆర్‌ఎ బిల్లును వ్యతిరేకిస్తాం

ప్రశ్నలు ఎదుర్కోవాల్సి వస్తుందన్న భయంతోనే మోదీ, షాలు సభలకు రావడం లేదు : కెసి వేణుగోపాల్ 07

# బోనమెత్తిన భాగ్యనగరం



### కనుల పండువగా లాల్ దర్వాజా బోనాలు

ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, బోనం సమర్పించిన మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి
పోటెత్తిన భక్తులు : ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు




ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ

భాగ్యనగరం బోనమెత్తింది. అమ్మవారి నినాదనాలతో హైదరాబాద్ నగరం మార్మోగింది. ఏ వీధిలో చూసినా, అమ్మవారి ఆలయాల్లో వీక్షించినా భక్తి పారవశ్యంతో బోనమెత్తుకుంటూ వెలుతున్న భక్తులే కనిపించారు. వీధుల పొడవునా డెకరేషన్లు కనిపించాయి. ఏర్పాటు చేసిన మైకుల్లో తెల్లవారుజాము నుంచే అమ్మవారి పాటలు, పూజలతో నగరం అంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పాతబస్తీ లాల్‌దర్వాజ మహంకాళీ అమ్మవారి బోనాలకు మంత్రులు, ప్రముఖులు, పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడిపోయింది. భక్తులకు అమ్మవారి దర్శనం చేసుకోవాడానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వం తరపున అమ్మవారికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పట్టు వస్త్రాలు సమర్పించగా, మంత్రి పొంగులేటి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు మంత్రులకు వేద మంత్రాల మధ్య సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలు మాట్లాడుతూ తెలంగాణలో బోనాలకు ప్రత్యేకత ఉందన్నారు. అందుకే ప్రభుత్వం ప్రత్యేకంగా బోనాల నిర్వహణకు రూ. 20కోట్లు మంజూరు చేసిందన్నారు. అందుకే బోనాలను వైభవోపేతంగా నిర్వహించుకుంటున్నామన్నారు. భవిష్యత్తులో కూడా బోనాల జాతరను మరింత వైభవంగా, మెరుగ్గా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ ప్రాంత, సింహవాహిణీ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు తెలంగాణపై ఉండాలని ఆకాంక్షించారు. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెల్లాలని వారు కోరారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. అన్ని దేవాలయాల్లో బోనాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని తరువాయి 8లో

## ప్రపంచ శాంతికి సామ్రాజ్యవాదంతో ముప్పు

కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల అంతర్జాతీయ సదస్సులో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రగతిశీల శక్తులకు క్యూబా స్ఫూర్తి



**హవానా:** అంతర్జాతీయ సంఘీభావానికి, కమ్యూనిస్టువర్కర్ల పార్టీల మధ్య సహకారాన్ని బలపర్చుకోవడానికి భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) కట్టుబడి ఉందని పార్టీ కార్యదర్శి కె.రామకృష్ణ ఉద్ఘాటించారు. ప్రపంచ శాంతి సంరక్షణకు పిలుపునిచ్చారు. సామ్యవాదాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు సిపిఐ నిబద్ధతతో పనిచేస్తున్నట్లు తెలిపారు. న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్యం, మానవ హక్కులే ఆధారంగా ప్రపంచ నిర్మాణానికి పునరంకితమైనట్లు వెల్లడించారు. ప్రపంచం తీవ్ర రాజకీయ, ఆర్థిక, సైనిక అస్థిర పరిస్థితులను ఎదుర్కొంటోందని... అమెరికా, దాని మిత్రదేశాల ఆధిపత్యం, సైనిక చర్యలు, ఏకపక్ష ఆంక్షలు, వాణిజ్య యుద్ధాలు, ఆయుధీకరణ వంటివి ప్రపంచ శాంతికి ముప్పుగా మారాయని రామకృష్ణ ఆందోళన వ్యక్తంచేశారు. నాటో విస్తరణ, సైనిక కూటములు బలోపేతం కావడం, ఆయుధ పోటీ కారణంగా మానవాభివద్ధికి వినియోగించాల్సిన వనరులు యుద్ధ సన్నాహాలకు మళ్లుతున్నాయని రామకృష్ణ తెలిపారు. క్యూబాపై అమెరికా ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీలు మరింత సమన్వయంతో పనిచేయాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. క్యూబాలో జరిగిన కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల 24వ అంతర్జాతీయ సదస్సుకు సిపిఐ ప్రతినిధిగా కె.రామకృష్ణ హాజరయ్యారు. సౌహార్ద సందేశమిస్తూ ప్రగతిశీల శక్తులకు క్యూబా స్ఫూర్తి అంటూ శ్లాఘించారు. క్యూబా కమ్యూనిస్టు పార్టీకి విప్లవాభినందనలు తెలిపారు. క్యూబా విప్లవం ప్రపంచ కమ్యూనిస్టు, ప్రగతిశీల శక్తులకు నిరంతరం స్ఫూర్తిని ఇస్తున్నదని రామకష్ణ అన్నారు.ఆరు దశాబ్దాలకుపైగా అమెరికా సామ్రాజ్యవాద ఒత్తిళ్లు, ఆంక్షలు ఎదుర్కొంటూ సోషలిజాన్ని, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుతున్న క్యూబా ప్రజల ధైర్యం, త్యాగాలు అభినందనీయమన్నారు. క్యూబా విప్లవయోధుడు ఫిడెల్ కాస్ట్రోకు నివాళులర్పించారు. కాస్ట్రో శతజయంతి నేపథ్యంలో జరుగుతున్న ఈ సదస్సుకు చారిత్రక ప్రాధాన్యత ఉన్నదన్నారు. ఫిడెల్ కాస్ట్రో క్యూబా నాయకుడు మాత్రమే కాదని, ప్రపంచ ప్రగతిశీలవాదులకు దిక్సూచి అని, గొప్ప అంతర్జాతీయవాది అని కొనియాడారు. ఆయనను మార్క్సిస్టులెనినిస్టు, సామ్రాజ్యవాద వ్యతిరేక విప్లవ నాయకుడిగా వర్ణించారు. విద్య, వైద్యం, సాంకేతిక రంగం, బయో టెక్నాలజీ, సామాజిక న్యాయం వంటి రంగాల్లో క్యూబా సాధించిన విజయాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాయని రామకృష్ణ అన్నారు. ఆర్థిక దిగ్బంధనం వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ క్యూబా తన ప్రజలకు ఉచిత వైద్యం, సార్వత్రిక విద్య, తరువాయి 8లో

## అడవితో అనుబంధం.. అభివృద్ధిలో అగ్రస్థానం

- గిరిజన బిడ్డలకు ప్రపంచస్థాయి అవకాశాలు కల్పించడమే లక్ష్యం
- గిరిజన సంక్షేమానికి రూ.18,745.16 కోట్లు
- అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



ప్రజాపక్షం/హైదరాబాద్

అడవితో అనుబంధాన్ని, తమ మూలాలను కాపాడుకుంటూనే గిరిజన సమాజం అభివృద్ధిలో అగ్రస్థానానికి చేరుకోవాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆకాంక్షించారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, మహిళా సాధికారతతో పాటు వారి భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గిరిజన బిడ్డలు దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో రాణించేలా అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో ఆదివారం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 2026 27 ఆర్థిక సంవత్సరానికి ఎస్‌టి ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.18,745.16 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఈ నిధులను గిరిజన ప్రాంతాల్లో విద్య, రహదారులు, తాగునీరు, విద్యుత్, సాగుభూమి అభివృద్ధి, మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి తరువాయి 8లో

డిండిలో...



పరకాలలో..


## ధరల పెంపుతో సామాన్యుడు బతకలేని స్థితి

- ప్రజలపై ప్రధాని మోదీకి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదు : సిపిఐ పాదయాత్రలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి ఆగ్రహం
- ప్రజాసమస్యలపై ఉద్యమిస్తాం : తక్కళ్లపల్లి
- కనీస మద్దతు ధర లభించేలా చట్టబద్ధత కల్పించాలి : పశ్యపద్మ

బాన్సువాడలో..



ప్రజాపక్షం/డిండి/పరకాల/బాన్సువాడ

కేంద్రంలోని బిజెపి పాలనకు వ్యతిరేకంగా సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త పాదయాత్రలు నాలుగవ రోజు ఆదివారం కూడా కొనసాగియాయి. యాత్రలకు అడుగడుగునా పెద్ద ఎత్తున స్పందన లభిస్తోంది. పాదయాత్రలు వివిధ జిల్లాలు, గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల గుండా సాతుండగా, అట్టడుగు వర్గాల ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై, కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును సిపిఐ శ్రేణులు ప్రజలకు వివరిస్తున్నారు. ప్రతి గ్రామంలో ఉన్న ప్రజా సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తూ మార్పు రావాలి.. మోదీ ప్రభుత్వం దిగాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1వ తేదీన చలో ఢిల్లీకి పిలుపునిస్తున్నారు. ఆదివారం నాటి పాదయాత్రలో నల్లగొండ జిల్లా డిండిలో సిపిఐ జాతీయ కార్యదరి పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ సీనియర్ నాయకుడు చాడ వెంకట్ రెడ్డి కరీంనగర్ జిల్లాలో, హనుకొండ జిల్లా పరకాల, వరంగల్ జిల్లాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పాల్గొనగా, ఖమ్మం జిల్లా మధిరలో బాగం హేమంతరావు, నాగకర్‌కర్నూల్ జిల్లా కొల్లపూర్ నియోజకవర్గంలో బాలనర్సింహ్మా, కామారెడ్డి జిల్లాలో పశ్య పద్మ, యాద్రాద్రి జిల్లా చౌటుప్పల్ మండలంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తరువాయి 12లో

## జార్ఖండ్ ప్రభుత్వం–విద్యార్థుల చర్చలు విఫలం

సిబిఐ విచారణకు మంత్రి తిరస్కృతి

నేడు చలో అసెంబ్లీకి విద్యార్థుల పిలుపు


జెపిఎస్‌సిలో ముగ్గురు సభ్యుల రాజీనామా



**రాంచీ :** జార్ఖండ్ ప్రభుత్వ ప్రతినిధులు–నిరసన ప్రదర్శకుల తరపు విద్యార్థి నాయకులకు మధ్య ఆదివారం రాంచీ స్టేట్ గెస్ట్‌హౌస్‌లో జరిగిన ఆరో విడత చర్చల్లో కొంత పురోగతి కనిపించినప్పటికీ ఉద్యోగ నియామకాలకు సంబంధించిన అన్ని పరీక్షల నిర్వహణలో అవకతవకలపై సిబిఐ విచారణ జరిపేందుకు ప్రభుత్వం తిరస్కరించింది. దీంతో తాజా చర్చలు విఫలమయ్యాయి. జార్ఖండ్ అసెంబ్లీ వరకూ సోమవారం తలపెట్టిన పాదయాత్రను యథాతథంగా కొనసాగిస్తామని నిరసన ప్రదర్శకుల తరపున విద్యార్థి నాయకులు ప్రకటించారు. ప్రముఖ తరువాయి 8లో

## ఆరు షరతులు ఒప్పుకుంటేనే నౌకల రాకపోకలు

- ఇకపై ఎప్పుడూ అమెరికా బెదిరించకూడదు
- యుద్ధ నష్టపరిహారం, దిగ్బంధనం–ఆంక్షల ఎత్తివేత కీలకం
- అమెరికాకు ఇరాన్ సెక్యూరిటీ కౌన్సిల్ చీఫ్ జోల్ఘాదర్ స్పష్టీకరణ
- హోర్ముజ్ తెరిచేందుకు ఇరాన్ సంచలనాత్మక డిమాండ్లు



**టెహ్రాన్:** ఇంటా బయటా సమస్యలతో డీలా పడుతున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను లొంగదీసేందుకు ఇరాన్ సంచలనాత్మక డిమాండ్లను తెరమీదకు తీసుకువచ్చింది.హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి వీలుగా అమెరికా పాటించాల్సిన అత్యంత కఠినమైన, ట్రంప్‌కు అసాధ్యమైన కొత్త డిమాండ్లను ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ విడుదల చేసిందని సిబిఎస్ న్యూస్ తెలియజేసింది. తాము విధించిన ఆరు షరతులను అమెరికా అంగీకరించేవరకూ హోర్ముజ్ జలసంధి వాణిజ్య నౌకల రాకపోకలకు తెరచుకోదని ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రధానాధిపతి మహ్మద్ బాఘెర్ జోల్ఘాదర్ హెచ్చరిక జారీ చేశారు. అమెరికా తన ప్రవర్తనను సరిదిద్దుకునేవరకూ జలసంధిని తెరచే ప్రసక్తే లేదని చెప్పారు. ఇరాన్ చేస్తున్న డిమాండ్లలో ఓడరేవులపై దిగ్బంధనం ఎత్తివేత, స్వేచ్ఛగా చమురు ఎగుమతులు, వాణిజ్య కార్యకలాపాల నిర్వహణ, ఇతర ఆర్థిక ఆంక్షలను ఎత్తివేయడం, అన్నింటికంటే ముఖ్యంగా యుద్ధ దాడుల తరువాయి 8లో

## పెద్ది కుటుంబానికి కెసిఆర్ పరామర్శ

తెలంగాణ ఉద్యమాన్ని సుదర్శన్‌రెడ్డి ముందుండి నడిపించారని గుర్తుచేసుకున్న మాజీ సిఎం

రూ.2.25కోట్ల ఆర్థిక సాయం చెక్కు అందజేత



ప్రజాపక్షం/నల్లబెల్లి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని ముందిండి నడిపించిన ఘనత నర్సంపేట మాజీ ఎంఎల్‌ఎ పెద్ది సుదర్శన్‌రెడ్డికే దక్కుతుందని మాజీ సిఎం, బిఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని దివంగత మాజీ ఎంఎల్‌ఎ ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి స్వగృహంలో ఆదివారం జరిగిన దశదిన కార్యక్రమంలో పాల్గొని పెద్ది భార్య స్వప్న, తల్లి అమృతమ్మను పరమర్శించి ఆయన చిత్ర పటానికి తరువాయి 8లో


# సృజనాత్మకతకు సంకెళ్లా? సరికొత్త రెక్కలా?

ఆధునిక సాంకేతిక ప్రపంచంలో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్/ఎఐ) ప్రతి రంగాన్నీ వేగంగా మార్చేస్తోంది. ముఖ్యం గా, అక్షరాలతో అనుబంధం ఉన్న రచనా రంగంలో ఎఐ ప్రవేశం ఒక పెద్ద విప్లవాన్ని సృష్టించింది. ఒకప్పుడు కేవలం మానవ మేధస్సుకు, భావోద్వేగాలకు మాత్రమే పరిమితమైన సృజనాత్మక రచన, నేడు కేవలం కొన్ని క్లిక్‌లతో, క్షణాల వ్యవధిలో ఎఐ టూల్స్ ద్వారా సాధ్యమవుతోంది. ఈ క్రమంలో ఎఐ విస్తరణ మానవ సృజనాత్మకతను, ఆలోచనా శక్తిని నాశనం చేస్తుందా? అనే చర్చ ప్రపంచవ్యాప్తంగా మొదలైంది. 'ది న్యూ యార్కర్'లో ప్రచురితమైన 'వాట్ హ్యాపెన్స్ ఆఫ్టర్ ఎఐ డిస్ట్రాయ్స్ రైటింగ్స్?' (రచనలను ఎఐ ధ్వంసం చేసిన తర్వాత ఏం జరుగుతుంది?) వ్యాసం ఈ చర్చను మరింత విస్తృతం చేస్తున్నది. కొంతమంది ఈ మార్పులను సాహిత్యానికి, సృజనకు గొడ్డలిపెట్టులా అభివర్ణిస్తుండగా, మరికొందరు కొత్తకొత్త ప్రయోగాలకు, సాహితీ ప్రక్రియలకు నాందిగా పేర్కొంటున్నారు. అయితే, ఎఐ రాకతో రచన ప్రక్రియ మారుతుందనేది నిజమే అయినప్పటికీ, అది మానవ మేధస్సును పూర్తిగా తుడిచిపెట్టాల్సిన అవసరం లేదు. ఇది రచయితలకు సరికొత్త సాధనాలను అందిస్తూనే, మరోవైపు లోతైన ఆలోచనా విధానానికి సవాళ్లు విసురుతోంది. ఈ నేపథ్యంలో ఎఐ వల్ల కలిగే నష్టాలు, అది అందించే సరికొత్త అవకాశాలు మరియు భవిష్యత్తులో రచయితల పాత్ర ఎలా మారబోతోందో లోతుగా పరిశీలించాల్సి ఉంది. ఎఐ టూల్స్ చాలా సులభంగా, వేగంగా కంటెంట్‌ను జనరేట్ చేయగల వు. కానీ, ఈ విపరీతమైన సౌలభ్యం వెనుక కొన్ని తీవ్రమైన నష్టాలు దాగి ఉన్నాయి. ప్రతి రచయితకూ ఒక విలక్షణమైన శైలి, ప్రత్యేకమైన భావజాలం ఉంటాయి. దాన్నే మనం రచయిత యొక్క సొంత గొంతుక అంటాం. అయితే, కంటెంట్ రాయడానికి ఎఐ పై ఎక్కువగా ఆధారపడటం వల్ల అందరి రచనలూ ఒకేలా తయారయ్యే ప్రమాదం ఉంది. ఎఐ టూల్స్ ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న డేటాను విశ్లేషించి, ఒక సగటు శైలిలో సమాధానాలను ఇస్తాయి. దీనివల్ల రచనల్లో ఉండే సహజమైన భావోద్వేగాలు, జీవం లోపిస్తాయి. వేర్వేరు వ్యక్తులు రాసినప్పటికీ, ఆ వ్యాసాలన్నీ ఒకే మూసలో ఉన్నట్లు అనిపిస్తాయి. సాహిత్యంలో వైవిధ్యం తగ్గిపోయి, ఒక విధమైన యాంత్రికత చోటుచేసుకుంటుంది. రచన అనేది కేవలం పదాలను పేర్చడం కాదు, అది ఒక లోతైన మానసిక వ్యాయామం. ఒక కథనో, వ్యాసాన్నో రాసేటప్పుడు మెదడు ఆలోచిస్తుంది. విశ్లేషిస్తుంది. విమర్శనాత్మక కోణంలో విషయాల ను పరిశీలిస్తుంది. కానీ, కష్టమైన ఆలోచనలన్నింటినీ ఎఐకి అప్పగించేయడం వల్ల రచయితల స్వంత ఆలోచనా సామర్థ్యం మొద్దుబారిపోయే ప్రమాదం ఉంది.



మెదడుకు పని పెట్టకపోతే కొత్త ఆలోచనలు పుట్టవువిషయాలను లోతుగా విశ్లేషించే సామర్థ్యం తగ్గిపోతుంది. రచయితలు తమ సొంత నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశాన్ని కోల్పోతారు. ఎఐ అందుబాటులోకి వచ్చిన తర్వాత చాలామంది రచయితల్లో ఒక రకమైన సోమరితనం పెరుగుతోంది. సాధారణంగా ఒక వ్యాసం రాసేటప్పుడు లోతైన ప్రణాళిక, పరిశోధన అవసరమవుతాయి. కానీ ఇప్పుడు రచయిత లు కష్టపడి ఆలోచించడం మానేసి, ఎఐ ఇచ్చే మొదటి ఐడియా లేదా మొదటి డ్రాఫ్ట్‌ను అలాగే అంగీకరించేస్తున్నారు. కంటెంట్‌లో నిజానిజాలను సరి చూసే ఓపిక నశిస్తోంది. 'త్వరగా పని అయిపోవాలి' అనే ధోరణి పెరుగుతున్నది. నాణ్యత కంటే పరిమాణానికే ప్రాధాన్యత నివ్వడం అలవాటుగా మారుతున్నది.

నాణేనికి రెండో వైపు ఉన్నట్లు, ఎఐ కేవలం ముప్పు మాత్రమే కాదు. దాన్ని సరిగ్గా ఉపయోగించుకుంటే, అది రచయితల సృజనాత్మకతను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లగలదు. రచయితలు ఎదుర్కొనే అతిపెద్ద సమస్యలలో రైటర్స్ బ్లాక్ ఒకటి. ఖాళీ పేజీని చూస్తూ గంటల తరబడి కూర్చున్నా ఒక్క ఆలోచన కూడా రానప్పుడు ఎఐ ఒక అద్భుతమైన తోడుగా మారుతుంది. ఒకే నిమిషంలో వందల కొద్దీ ప్లాట్లు, శీర్షికలు లేదా థీమ్‌లను ఎఐ సూచించగలదు. శూన్యం నుండి ప్రారంభించే బదులు, ఎఐ ఇచ్చిన ఐడియాల నుండి రచయితలు తమకు నచ్చిన కోణా న్ని ఎంచుకుని, దానిపై మరింత లోతుగా పని చేయవచ్చు. ఇది ఆలోచన ల ప్రక్రియను వేగవంతం చేస్తుంది. రచనలో సృజనాత్మక భాగాలు ఎంత ఉంటాయో, అలాగే విసుగు పుట్టించే సాంకేతిక పనులు కూడా అంతే స్థాయిలో ఉంటాయి. ఉదాహరణకు వ్యాకరణ దోషాలను సరిదిద్దడం, విరామ చిహ్నాలు సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోవడం, ఒకే వాక్యాన్ని వేర్వేరు శైలుల్లో తిరిగి రాయడం వంటి పనులను చెప్పవచ్చు. ఇలాంటి పనులన్నింటినీ ఎఐకి అప్పగించడం ద్వారా రచయితలకు చాలా సమయం ఆదా అవుతుంది. ఆ మిగిలిన విలువైన సమయాన్ని వారు తమ కథనంలోని ప్రధాన భావాలు, పాత్రల సృష్టి, భావోద్వేగాల వంటి పెద్ద ఐడియాస్‌పై కేంద్రీకరించవచ్చు. ఎఐ రాకతో రచయిత పాత్ర కేవలం అక్షరాలు రాసేవాడి నుండి దర్శకుడి లేదా ఎడిటర్ స్థాయికి మారుతోంది. ఇది ఒక సరికొత్త కళా ప్రక్రియకు దారితీస్తోంది. రచయిత ఇప్పుడు ఎఐని ఒక అసిస్టెంట్‌లా వాడుకుంటూ, అది ఇచ్చే ముడి సమాచారాన్ని తనదైన శైలిలో మలుచుకోగలుగుతున్నాడు. విభిన్న శైలులను కలపడం, ఒక ప్రత్యేకమైన కోణాన్ని జోడించడం ద్వారా ఒక సరికొత్త తుది రూపాన్ని ఆవిష్కరిస్తాడు. ఇది మానవ హృదయ స్పందనను, యంత్రాల వేగాన్ని కలిపి చేసే ఒక అద్భుతమైన సృజనాత్మక ప్రయోగం. ఎఐ యుగంలో రచయితల ప్రాముఖ్యత తగ్గిపోతుందనేది కేవలం ఒక అపోహ మాత్రమే. నిజానికి, రచయిత బాధ్యత మరింత పెరిగింది. వారి పాత్రలో గుణాత్మకమైన మార్పు వచ్చింది. సాంప్రదాయ రచయిత సమాచారాన్ని సేకరించడం, రాయడంపైనే ఎక్కువ సమయం పెట్టేవాడు. అదే సమయంలో, నేటి రచయిత ఎఐ ఇచ్చిన సమాచారాన్ని విశ్లేషించడం, ఎడిట్ చేయడం, కంటెంట్‌కు సంబంధించిన నాణ్యతను, నిజాయితీని కాపాడే సంరక్షకుడిగా మారడం అవసరం. ఆలోచనల రూపకల్పన, దిశానిర్దేశం చేయడంపైనే నేటి రచయితలు ఎక్కువ దృష్టి పెట్టాలి. భవిష్యత్తులో కేవలం రాయడం తెలిసిన వారి కంటే, ఎఐ ని ఉపయోగించుకుంటూనే అందులో మానవీయ కోణాన్ని ఎలా నింపాలో తెలిసిన రచయితలకే ఎక్కువ డిమాండ్ ఉంటుంది. ఎఐ ఒక అద్భుతమైన పెయింటింగ్ బ్రష్ లాంటిది, కానీ దాంతో ఎలాంటి చిత్రం గీయాలో నిర్ణయించేది మాత్రం మానవ మేధస్సే. స్థూలంగా చెప్పాలంటే, మాస్ రైటింగ్‌లో ఎఐ ప్రవేశం అనేది ఆపలేని ఒక అనివార్య పరిణామం. అది మన ఆలోచనా శక్తిని నశింపజేస్తుందా లేదా మన సృజనాత్మకతను పెంచుతుందా అనేది పూర్తిగా మనం దాన్ని ఎలా ఉపయోగిస్తున్నామనే దానిపైనే ఆధారపడి ఉంటుంది. రచయితలు ఎఐ కి పూర్తిగా దాసోహం కాకుండా, దాన్ని ఒక శక్తివంతమైన సాధనంగా మాత్రమే చూడాలి. లోతైన పరిశోధన, సొంత ఆలోచన, విమర్శనాత్మక విశ్లేషణ వంటి మానవ మేధో లక్షణాలను కాపాడుకుంటూనే, వేగం, కొత్త ఆలోచనల కోసం ఎఐని వాడుకోవాలి. యంత్రాన్ని మన ఆలోచనలపై ఆధిపత్యం చలాయించనివ్వకుండా, మన ఆలోచనలకు అది ఒక సహాయకారిగా ఉండేలా చూసుకున్నప్పుడే సాహిత్యం సజీవంగా ఉంటుంది, సృజనాత్మకత సరికొత్త పుంతలు తొక్కుతుంది.



— బిఎల్

## మానేరు తీరపు సాహిత్య చైతన్యం గూడూరి సీతారాం



తెలంగాణ సాహిత్య క్షేత్రంలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న తొలితరం కథా రచయితలలో గూడూరి సీతారాం అగ్రగణ్యులు. 1950ల కాలంలో గ్రాంధిక భాషా ప్రాభవం, శైలి బలంగా ఉన్న రోజుల్లోనే, ఆయన సామాన్యుల వాడుక భాషకు, ముఖ్యంగా తెలంగాణ మాండలికానికి కథల్లో పట్టం కట్టారు. ప్రస్తుత రాజన్న సిరిసిల్ల జిల్లా హనుమాజీపేటలో 18 జులై 1936లో జన్మించిన సీతారాం, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డికి బాల్య మిత్రుడు. కేవలం కథకుడిగానే కాకుండా మానేరు రచయితల సంఘ స్థాపకుడిగా, సాహిత్య ఉద్యమకారుడిగా తెలంగాణ అస్తిత్వాన్ని, గ్రామీణ జీవితాన్ని తన రచనల ద్వారా ప్రపంచానికి చాటిచెప్పారు.

గూడూరి సీతారాం కథల ప్రధాన బలం వాటిలోని సజీవమైన భాష. నిత్య జీవితంలో పల్లె ప్రజలు మాట్లాడుకునే నిఖార్సైన తెలంగాణ యాసను, నుడికారాలను ఆయన కథావస్తువుగా మార్చుకున్నారు. అప్పటివరకు సాహిత్యానికి దూరం అనుకున్న భాషతోనే అద్భుతమైన భావవ్యక్తీకరణ చేయవచ్చని నిరూపించారు. 1953 నుండి 1965 మధ్య కాలంలో ఆయన సుమారు 80కథల వరకు రాశారు. ఆయన రాసిన 'లచ్చి', 'నారిగాని బతుకు', 'రంగడు', 'రాజమ్మ రాజరికం', 'మారాజు' వంటి కథలు గ్రామీణ సమాజంలోని వర్గ వైరుధ్యాలను, అమాయకత్వాన్ని, పీడిత ప్రజల వేదనలను కళ్ళకు కట్టినట్లు చూపుతాయి. ఆయన రాసిన కథల్లో 1957 నాటి 'లచ్చి' కథ ఎంతో ప్రసిద్ధి చెందింది. గ్రామాల్లో జీవనోపాధి కరువై, బతుకు దెరువు కోసం పల్లె ప్రజలు పట్టణాలకు వలస వెళ్ళడం అనివార్యమౌతున్న సామాజిక నేపథ్యాన్ని ఈ కథ అద్భుతంగా ఆవిష్కరిస్తుంది. పల్లెల్లోని వ్యవసాయ సంక్షోభం, దొరల భూ స్వామ్య వ్యవస్థలో నలిగిపోయిన సామాన్యుల జీవితాలను ఆయన నిశితంగా పరిశీలించి విశ్లేషించారు. సీతారాం గారి కథలు నాటి తెలంగాణ సామాజిక, ఆర్థిక చరిత్రను నిక్షిప్తం చేసిన సజీవ పత్రాలు.

సీతారాం కథల్లో కేవలం కన్నీళ్లే కాకుండా, వ్యవస్థపై తిరుగుబాటు, ఆత్మగౌరవ పోరాటాలు కూడా కనిపిస్తాయి. 'రాజమ్మ రాజరికం' వంటి కథల ద్వారా నాటి సామాజికాధికార ముఖచిత్రాన్ని ఎండగట్టారు. సమాజంలో వెనుకబడిన, బహుజన వర్గాల ప్రజల కష్టాలను వారి కోణంలోంచే చూస్తూ కథలు రాయడం ఆయన ప్రత్యేకత. ఆయన పాత్రలు చాలా సహజంగా ఉంటూ, తమ హక్కుల కోసం లేదా కనీస బతుకు దెరువు కోసం పోరాడే శ్రమజీవులుగా దర్శనమిస్తాయి. ఈ మానవీయ కోణ మే ఆయన కథలను సార్వజనీనం చేసింది.

గూడూరి సీతారాం గారిని కేవలం ఒక కథకుడి గా మాత్రమే చూస్తే వారి వ్యక్తిత్వంలోని ఒక ప్రధాన కోణాన్ని వదిలేసినట్లవుతుంది. నాటి కరీంనగర్ జిల్లాలో సాహిత్య చైతన్యాన్ని రగిలించడానికి ఆయన 'మానేరు రచయితల సంఘం' (మారసం) స్థాపనలో కీలక పాత్ర పోషించి, ఒక ఉద్యమకర్తగా నిలిచారు. అప్పటికే ప్రాంతీయ వివక్షకు గురవుతున్న తెలంగాణ సాహిత్య ఉనికిని చాటడానికి, నూతన తరం రచయితలను ప్రోత్సహించడానికి ఈ వేదికను ఒక ఆయుధంగా మలిచారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డి లాంటి మహామహులతో కలిసి సాహిత్య చర్చ లు జరుపుతూనే, గ్రామీణ ప్రాంతాల్లోని అజ్ఞాత కవులను, రచయితలను వెలుగులోకి తెచ్చేందుకు ఆయన చేసిన సంస్థాగత కృషి తెలంగాణ సాహిత్య చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. 'నా చుట్టూ ఉన్న సంఘటనలు, నేను అనుభవించిన పల్లె బతుకు, పీడిత నేపథ్యమే నన్ను రచయితను చేశాయి' అని ఆయన స్వయంగా పేర్కొనడం, ఆయన రచనల వెనుక ఉన్న నిబద్ధతను తెలియజేస్తుంది.

ఆయన రాసిన వ్యాసాల సంకలనం 'కానుగు చెట్టు', అలాగే 'గూడూరి సీతారాం కథలు' పుస్తకాలు నేటి తరం పరిశోధకులకు, పాఠకులకు తెలంగాణ అస్తిత్వ చేతనను అందిస్తున్నాయి. మరుగున పడిపోతున్న ఎందరో తెలంగాణ రచయితలను ప్రోత్సహించి, వారి రచనలను వెలుగులోకి తేవడానికి ఆయన నిరంతరం తపించారు. ఆడంబరాలకు దూరంగా ఉంటూ తెలుగు కథా సాహిత్యానికి ఆయన చేసిన సేవలు అనన్యసామాన్యం. తెలంగాణ కథా శిల్పంలో గూడూరి సీతారాం గారు చెరిపేయలేని ఒక మహోన్నత శిఖరం.

ఏవి. సుధాకర్, 9000674747

## వివిధ సిద్ధాంతాల సమాహారమే 'ప్యారడైమ్'




గ్రీకు భాషలోని 'పరడైగ్మా' నుంచి వచ్చిన 'ప్యారడైమ్' అనే పదానికి నమూనా, ఆదర్శ రూపం లేదా ఆలోచనా చట్రం అనే అర్థాలున్నాయి. ఒక సమాజం ప్రపంచాన్ని ఎలా అర్థం చేసుకుంటుంది? జ్ఞానాన్ని ఎలా నిర్మించుకుంటుంది? సమస్యలను ఎలా విశ్లేషిస్తుంది? వాటికి ఎలా పరిష్కారాలు అన్వేషిస్తుంది? అనే విషయాలను నిర్దేశించే విశ్వాసాలు, విలువలు, సిద్ధాంతాలు, పద్ధతుల సమాహారమే ప్యారడైమ్. ఇది ఒక సిద్ధాంతంత విధానం.. ఒక కాలంలో సమాజం ఆలోచించే విధానాన్ని నిర్దేశించే మేధో చట్రం. ఈ భావనకు శాస్త్రీయ ప్రాముఖ్యతను అమెరికన్ తత్వవేత్త థామస్ ఎస్. కూన్ తన 1962లో వెలువడిన 'ది స్ట్రక్చర్ ఆఫ్ సైంటిఫిక్ రెవల్యూషన్' ద్వారా విస్తృతంగా వివరించాడు. ఆయన అభిప్రాయం ప్రకారం శాస్త్ర విజ్ఞానం నిరంతర రేఖలా అభివృద్ధి చెందదు. ఒక నిర్దిష్ట ప్యారడైమ్ ఆధారంగా పరిశోధనలు సాగుతాయి. కాలక్రమంలో ఆ ప్యారడైమ్‌తో వివరించలేని సమస్యలు, అసాధారణతలు పెరిగినప్పుడు సంక్షోభం ఏర్పడుతుంది. ఆ తర్వాత కొత్త వివరణలు, కొత్త దృక్పథాలు ఆవిర్భవించి పాత ప్యారడైమ్ స్థానంలో కొత్త ప్యారడైమ్ నిలుస్తుంది. ఈ మౌలిక మార్పునే 'ప్యారడైమ్ షిఫ్ట్' అంటారు. భాషాశాస్త్రంలో ప్యారడైమ్ అంటే ఒకే వ్యాకరణ వర్గానికి చెందిన పదరూపాల సమాహారం. ఉదాహరణకు 'రాయు, రాయుట, రాసిన, రాసేసిన అనే రూపాలు ఒకే ప్యారడైమ్‌లోకి వస్తాయి. ఫెర్డినాండ్ డి. సాస్యూర్ దృష్టిలో ప్యారడైమాటిక్ సంబంధాలు అంటే ఒక పదం స్థానంలో అదే వ్యాకరణ పాత్రను నిర్వహించే మరో పదాన్ని ఎంచుకునే అవకాశం.

ఉదాహరణకు 'ది బాయ్ రన్స్' (అబ్బాయి పరుగెడతాడు) అనే వాక్యంలో 'బాయ్' స్థానంలో 'గర్ల్', 'పిల్లవాడు', 'విద్యార్థి' వంటి పదాలను ఉపయోగించవచ్చు. సాహిత్య విమర్శలో ప్యారడైమ్ అనే భావన మరింత విస్తృత అర్థాన్ని సంతరించుకుంది. నియోక్లాసిసిజం నుంచి రొమాంటిసిజానికి, రియలిజం నుంచి మాడర్నిజానికి, స్ట్రక్చరలిజం నుంచి పోస్ట్‌స్ట్రక్చరలిజానికి జరిగిన మార్పులు అన్నీ ప్యారడైమ్ మార్పులుగానే భావిస్తారు. అలాగే స్త్రీవాదం, మార్క్సిజం, పోస్ట్‌కలోనియలిజం, క్వీర్ సిద్ధాంతం, ఎకోక్రిటిసిజం వంటి ఆధునిక విమర్శా దృక్పథాలు సాహిత్యాన్ని కొత్త కోణాల్లో అర్థం చేసుకునే అవకాశాలను విస్తరించాయి. ప్యారడైమ్ భావన జ్ఞానం ఎలా రూపుదిద్దుకుంటుందో, కాలానుగుణంగా ఎలా మారుతుందో అర్థం చేసుకోవడానికి కీలకమైన సాధనం. మేధోపరమైన, సాంస్కృతిక, సామాజిక పరిణామాలను విశ్లేషించడంలో ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఒక కాలంలో సహజంగా కనిపించిన ఆలోచనలను మరో కాలంలో కొత్త కోణంలో పునర్మూల్యాంకనం చేయడానికి ప్యారడైమ్ దోహదపడుతుంది. అందువల్ల ప్యారడైమ్ అనేది ప్రపంచాన్ని చూసే దృష్టిని మాత్రమే కాదు, ఆ ప్రపంచాన్ని అర్థం చేసుకునే విధానాన్నీ నిరంతరం మారుస్తూ ఉండే చైతన్యవంతమైన మేధో చట్రంగా భావిస్తారు.

## చదవాల్సిన పుస్తకం

### మనిషి సంఘర్షణకు నిలువుటద్దం




ప్రపంచ సాహిత్యంలో ప్రేమకథలు ఎన్నో ఉన్నాయి. యుద్ధం నేపథ్యంలో సాగిన కథలు కూడా అనేకం. కానీ యుద్ధం, నియంతృత్వ పాలన, గ్రామీణ జీవితం, వ్యక్తిగత స్వేచ్ఛ, కళాత్మక అనుభూతి, ఆత్మాన్వేషణ వంటి అంశాలన్నింటినీ ఒక చిన్న నవలికలో చేర్చడం అనుకున్నంత సులభం కాదు. అందులోనూ గాఢతతో మేళవించ డం మరింత కష్టం. కిర్గిజ్ రచయిత చింగీజ్ ఐత్‌మాతొవ్ రచించిన 'జమీల్యా' అలాంటి అపూర్వ కృతి. ప్రేమకథగా కనిపించినా, వాస్తవానికి అది యుద్ధకాలంలో మనిషి మనసు, సామాజిక బంధనలు, సంస్కృతి, స్వేచ్ఛలపై సాగిన లోతైన అన్వేషణ. సోవియట్ యూనియన్ అధీనంలోని, మధ్య ఆసియా ప్రాంతాల్లో 1940ల కాలాన్ని నేపథ్యంగా చేసుకుని ఈ కథ సాగుతుంది. రెండో ప్రపంచ యుద్ధం కారణంగా గ్రామాల్లోని యువకులందరూ సైన్యంలో చేరడంతో, వ్యవసాయ పనుల బాధ్యత మహిళలు, వృద్ధులు, పిల్లలపై పడుతుంది. సోవియట్ సామూహిక వ్యవసాయ విధానం గ్రామజీవితాన్ని నియంత్రిస్తున్నప్పటికీ, ప్రజలు తమ సంప్రదాయాలను, మతాచారాలను పూర్తిగా వదులుకోరు. ముఖ్యంగా కజాఖ్, కిర్గిజ్ సంస్కృతుల ఆనవాళ్లు గ్రామజీవితంలో సజీవంగా కనిపిస్తాయి. ఈ నేపథ్యం కథకు చారిత్రక ప్రాముఖ్యతను అందిస్తుంది. ఈ కథను ఒక బాలుడు చెప్తాడు. జమీల్యాతో అతనికి రక్తసంబంధం లేకపోయినా, అక్కలాగే భావిస్తుంటాడు. పెద్దయ్యాక తాను వేసిన ఒక చిత్రా న్ని చూసి తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కథను ప్రారంభిస్తాడు. ఈ విధానం వల్ల పాఠకుడు కేవలం సంఘటనలను మాత్రమే కాకుండా, ఒక బాలుడి మనసులో జరిగిన మార్పులను కూడా అనుభవిస్తాడు. జమీల్యా గ్రామంలోని ఇతర మహిళల్లా మౌనంగా, సంప్రదాయాలకు కట్టుబడి ఉండే వ్యక్తి కాదు. ఆమెలో ధైర్యం, స్వతంత్ర ఆలోచన, ఆత్మవిశ్వాసం ఎక్కువ. యుద్ధానికి వెళ్లిన భర్త లేని సమయంలో కూడా ఆమె తన బాధ్యతలను నిర్వర్తిస్తుంది. అయితే ఆమె జీవితంలోకి యుద్ధంలో గాయపడి తిరిగి వచ్చిన సైనికుడు దనియార్ ప్రవేశించడంతో కథ కొత్త మలుపు తిరుగుతుంది. ముగ్గురూ కలిసి ధాన్యాన్ని తరలించే పనిలో పాల్గొంటారు. దనియార్ యుద్ధం వల్ల శారీరకంగా గాయపడిన తరాన్ని సూచిస్తాడు. జమీలా కుటుంబ బాధ్యతలు, సామాజిక అంచనాలు, వ్యక్తిగత కోరికల మధ్య నలిగే మహిళల భావోద్వేగ వేదనకు ప్రతీకగా నిలుస్తుంది. కథకుడైన బాలుడు చిన్ననాటి అమాయకత్వం నుంచి జీవిత వాస్తవాలను అర్థం చేసుకుంటూ మానసికంగా ఎదుగుతాడు. ఈ ముగ్గురి జీవితాల ద్వారా యుద్ధం మనుషుల శరీరాలనే కాదు, వారి మనసుల ను, సంబంధాలను కూడా ఎలా మార్చేస్తుందో రచయిత చూపిస్తాడు. ప్రకృతి వర్ణనలు ఈ నవలికకు ప్రత్యేక ఆకర్షణ. విశాలమైన కజాఖ్ మైదానాలు, పొలాలు, ఆకాశం, గాలి అన్నీ పాత్రల మనస్థితిని ప్రతిబింబించేలా కనిపిస్తాయి. ప్రకృతి ఇక్కడ కేవలం నేపథ్యం కాదు.. కథలోని మరో పాత్రగా మారుతుంది. కళ కూడా ఈ రచనలో కీలక పాత్ర పోషిస్తుంది. కథ ఒక చిత్రంతో ప్రారంభమవుతుంది. చిత్రకళ ద్వారా కథకుడు తన గతాన్ని తిరిగి చూస్తాడు. మరోవైపు సంగీతం కథలో అత్యంత భావోద్వేగభరితమైన ఘట్టంగా నిలుస్తుంది. దనియార్ పాడే పాటకు పదాల కంటే భావోద్వేగమే ఎక్కువ ప్రాధాన్యం. ఆ గానం కిర్గిజ్, కజాఖ్ సంస్కృతుల ఆత్మను ప్రతిబింబిస్తుంది. భాషను దాటి సంగీతం మనుషుల హృదయాలను ఎలా తాకుతుందో ఐత్‌మాతొవ్ అద్భుతంగా చిత్రించాడు. కథకుడి ఎదుగుదల కూడా ఈ నవలికలో ప్రధాన అంశం. యుద్ధం అతనికి బాల్యాన్ని ఆస్వాదించే అవకాశాన్ని ఇవ్వదు. కుటుంబ బాధ్యతలు చిన్న వయసులోనే అతడిపై పడతాయి. అయినప్పటికీ జమీలా, దనియార్‌లను గమనిస్తూ తనకు కళపై ఉన్న ఆసక్తిని గుర్తిస్తాడు. మనిషి తన నిజమైన అభిరుచులను అనుసరించాలంటే సమాజం విధించిన పాత్రలను ప్రశ్నించే ధైర్యం అవసరమని అతడు గ్రహిస్తాడు. ఐత్‌మాతొవ్ స్వయంగా సోవియట్ పాలనలో పెరిగిన రచయిత. బహుళ జాతుల కుటుంబంలో జన్మించిన ఆయన రష్యన్, కిర్గిజ్ భాషల్లో రచనలు చేశారు. అందువల్ల 'జమీల్యా'ను కేవలం కల్పిత ప్రేమకథగా చూడడానికి వీల్లేదు. అది ఒక చారిత్రక కాలం లో సాధారణ ప్రజల జీవితాలను ప్రతిబింబించిన మానవీయ సాక్ష్యం. సోవియట్ సామూహిక వ్యవసాయం లేదా రాజకీయ నిర్బంధాన్ని మాత్రమే చూపించే రచనగా 'జమీల్యా'ను చూడలేం. ప్రేమ, స్వేచ్ఛ, సంస్కృతి, బాధ్యత, కళ, వ్యక్తిత్వం వంటి శాశ్వత మానవ విలువలను ఆవిష్కరించిన సాహిత్యకృతిగా ఇది నిలుస్తుంది. కేవలం యాభై పేజీల పరిమాణంలోనే వేల పేజీల నవలలు సాధించలేని భావోద్వేగ గాఢతను ఈ నవలిక అందిస్తుంది. అందుకే 'జమీల్యా' ప్రపంచ సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిన అత్యుత్తమ నవలికలలో ఒకటిగా గుర్తింపు పొందింది.

**పుస్తకం పేరు**

**జమీల్యా**

రచయిత: చింగీజ్ ఐత్‌మాతొవ్ అనువాదం: ఉప్పల లక్ష్మణరావు

వెల: రూ.40

సోల్ డిస్ట్రిబ్యూటర్లు:

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

## పద్య, గేయ రచనల్లో సవ్యసాచి..



వింజమూరి శివరామారావు (1908–82) తెలుగు కవి. శివరామారావు పిఠాపురం తాలూకా చంద్రపాళెంలో 1908లో జన్మించారు. అభ్యుదయ కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి వీరి మేనమామ. శివ రామారావు కలం పేరు ' గౌతమి '. శివ రామారావు ఆకాశవాణిలో రెండు దశాబ్దాలు (1949–68) స్క్రిప్ట్ రైటరుగా విజయవాడ కేంద్రంలో పనిచేశారు. ఆకాశవాణిలో చేరడానికి ముందు పత్రికలలో పనిచేశారు. 'జ్వాల' పత్రికలోను, నవోదయ పత్రికలోను సహాయ సంపాదకులుగా వ్యవహరించారు. పద్యాలను, గేయాలను సమప్రతిభతో వ్రాయగల నేర్పరి. ఆకాశవాణికి ఎన్నో లలిత గీతాలను, రూపకాలను వ్రాసి ప్రసారం చేశారు. 600 రేడియో నాటికలు వ్రాశారు. ఈయన అనువాద రచనలో కూడా సమర్థులు. అటు పద్య రచనలో, ఇటు గద్య రచనలో సమ ప్రతిభతో రాణించిన సవ్యసాచి. అమరుకం, మొపాసా కథలు, గోర్కీ కథలు వీరి అనువాద సామర్థ్యాన్ని చాటిచెబుతాయి. కల్పవల్లి ఈయన ఖండ కావ్య సంపుటి. విజయపతాక, కళారాధన, రజకలక్ష్మి, కళోపాసన, కృష్ణదేవరాయలు, విశ్వామిత్ర నాటకాలుగా ప్రసిద్ధాలు. 1982లో వింజమురి శివరామారావు విజయవాడలో కాలధర్మం చెందారు. ఆంధ్ర విశ్వకళా పరిషత్ వింజమూరిని కళాప్రపూర్ణ బిరుదంతో సత్కరించింది.

## ఈ వారం కవితలు

### అశ్రు నయనాలు

కుటిలకామ నీచకత్వపు దారుల్లో
హృదయవేదన రగిలే స్థితి గతుల్లో
నేటి భారతావని మొదటి పేజీలో
మానభంగ పర్వంగా రాయాల్సిన
దుస్థితి నేటి కలానికి పట్టిన దుర్గతి

ఆడబిడ్డల స్వేచ్ఛాభంగంలో
ఇరుక్కున్న సమాజంలో
సగమైనాం
ఎర్రటి కోర్కెల కళ్ళ కోరలకు బలై
అసువులు బాస్తున్న ఆడపడుచులు
అర్ధరాత్రి నిర్భయంగా తిరిగే కల
మెలుకువరాగానే చెదిరిపోయినట్టు
నేటి భారతంలో స్వేచ్ఛ చచ్చిపోయింది
ఓర చూపులు చురకత్తులై



మగువల మానాల్ని ఖండిస్తుంటే
చూసి చదువుకునే దౌర్భాగ్యమైంది
ఆడపిల్లల మనాభిమానాలు
అరణ్య రోదనలై ప్రతిధ్వనిస్తుంటే
భరతమాత కన్నీరు పెట్టుకుంటోంది

రక్షణ కరువైన కలికాలపు వలలో
ఆడ కూతురు చిక్కి ఛిద్రమైపోతుంటే
చూపులు సారించే పనిలో వున్నాం
రక్తాశృవులతోఅమరత్వాన్ని
ముద్దాడి
లోకాన్ని వదిలెళ్ళిన ఆడబిడ్డలెందరో

శోకపు సంద్రంలో మునిగిపోతూ
అశ్రునయనాలతో కృంగిపోతూ
వల పన్నే పన్నాగాల ఎత్తులతో
కరుకు ముళ్ళుల పాశానికి
బలైపోతూ
రెప్పలు మూతలేసే స్థితి
దాపురించింది
కర్కశత్వపు కాఠిన్యానికి సంకెళ్ళేసి
మానభంగ పర్వాన్ని
తిప్పి రాయాలి

**నరెద్దుల రాజారెడ్డి**
9666016636

### జీవిత పుస్తకం

జీవితమో నిండు పుస్తకం
కాలంతో పాటు పేజీలు దొర్లుతాయి
ఒక పేజీలో సంతోష అక్షరాలు
మరు పేజీలో బాధల భావనలు
ఏ పేజీని వదిలించుకోలేవు
ఒక దాని వెంట మరోటి వస్తూనే..
పలు రకాల అనుభూతుల్ని..
వద్దన్నా వడ్డించి వెళతాయి
ఆనందముందని త్వరగా తిప్పేయకు
కష్టాలున్నాయని పేజీల్ని
వదిలేయకు !

పుస్తకంలో పేజీలున్నట్లే..
జీవితంలో సంవత్సరాలున్నాయి



పేజీల్లో పేరాలున్నట్లే..
ఏడాదిలో మాసాలున్నాయి
పేరాల్లో వాక్యాలున్నట్లే..
మాసాల్లో వారాలున్నాయి
వాక్యాల్లో పదాలున్నట్లే..
వారాల్లో రోజులున్నాయి
పదాల్లో అక్షరాలున్నట్లే..
రోజుల్లో గంటలు, నిమిషాలున్నాయి
ఇష్టమైన కష్టమైనా..
అన్నింటిని దాటాల్సిందే
అన్నీ అనుభవించాల్సిందే !
ఎవరి పుస్తకం వారిదే
ఎవరి జీవితం వారిదే
ఏ రెండు పుస్తకాలు ఒకేలా ఉండవు
మన పుస్తకం మంచి కథను నేర్పాలి
ప్రతి పుస్తకానికి ఆఖరి పేజీ ఉంది
ప్రతి జీవితానికి చివరి
గడియ ఉంది
మన బతుకు పుస్తకం..
చనిపోయిన తర్వాత కూడా..
పదిమంది చదువుకునేలా ఉండాలి
మన జీవితం పరులకు
దారి దీపం కావాలి
మరణించినా కూడా సజీవంగా
ఉండాలి !

**మధుపాళీ**
9949700037

### కొంగ జపం

వాన కురవలేదు
కప్పల పెళ్లి చేస్తుంద్రు
ముత్యాలమ్మ కి మొక్కుతుంద్రు
ప్రజల మౌఢ్యం
పదకొండు గుండాల్లో
ప్రజాధనాన్ని పోసి
మబ్బును మభ్యపెట్టే యాగానికి
పూనుకున్నాడు ఏలిక
విత్తనం లోపం
పట్టించుకోని ప్రభువు యాగం
పేరిట కోట్లు కుమ్మరించు
పూడిక తీయరు
నీరు నిల్వలో కోత
ఏల ఏలిక?! కానరాకనా!
మాయదారి మందులతో
నేల సారం పోయే
పూడిక మట్టి పొలాల్లోకి
చేర్చరాదే ఆ ధనంతో

పెట్టుబడికి చెట్టు కొండ గుట్ట
అర్పించాక
వానెట్లు కురియు
అమాత్యులంతా ఆదరాబాదరాగా
యజ్ఞ యాగాల్లో పాల్గొంటే
వాన జల్లు పడుతుందా
నల్లని ఆవులు నల్లని ధోవతులు
నల్లని మబ్బులని
ఏమార్చుతాయానే నమ్మికలో
జనాన్ని ఏమార్చే ప్రజాస్వామ్యమా
జోహార్లు!

**గిరి ప్రసాద్ చెలమల్లు**
9493388201

# రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి

### క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ప్రజల హక్కుల కోసం పోరాడాలి
### టిపిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, ప్రజల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ శ్రేణులు అంకితభావంతో పనిచేయాలని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ గౌడ్ పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమ 84వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం గాంధీభవన్‌లో టిపిసిసి, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహేష్ గౌడ్‌తో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వాకాటి శ్రీహరి, మహమ్మద్ అజారుద్దీన్, ఎంపి అనిల్ యాదవ్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి మహాత్మాగాంధీ, స్వాతంత్ర్య సమర యోధులకు నివాళులర్పించారు. 1942 ఆగస్టు 8న మహాత్మాగాంధీ ఇచ్చిన 'చేయి లేదా చావు' (డూ ఆర్ డై) పిలుపు దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో చారిత్రాత్మక మలుపుగా నిలిచిందని మహేష్ గౌడ్ అన్నారు. బ్రిటిష్ పాలకుల అణచివేతను ఎదుర్కొంటూ వేలాది మంది స్వాతంత్ర్య సమర యోధులు జైళ్లకు వెళ్లారని, లాఠీ దెబ్బలు తిన్నారని, అనేక మంది దేశం కోసం ప్రాణ త్యాగం చేశారని గుర్తుచేశారు. నాడు బ్రిటిష్ పాలన నుంచి విముక్తి కోసం పోరాడితే, నేడు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ప్రజల హక్కులను కాపాడేందుకు పోరాడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఓటు హక్కు, భావప్రకటన స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, మత స్వేచ్ఛ వంటి రాజ్యాంగ హక్కులను పరిరక్షించడంతో పాటు ప్రజాస్వామ్య సంస్థలను బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల మధ్య నిరంతరం పనిచేయాలని సూచించారు.

**శాంతి మార్గంలోనే ముందుకు..** మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ మాట్లాడుతూ 'డూ ఆర్ డై' నినాదంతో మహాత్మాగాంధీ బ్రిటిష్ పాలకులపై గొప్ప ఉద్యమాన్ని ప్రారంభించారని తెలిపారు. గాంధీ, స్వాతంత్ర్య సమరయోధులు, గాంధేయవాదులు చూపిన మార్గంలో కాంగ్రెస్ నాయకులు ముందుకు సాగుతున్నారని చెప్పారు. గాంధీ స్ఫూర్తితో శాంతియుత పాలన అందిస్తామని, శాంతి మార్గంలో ఏదైనా సాధించవచ్చని అన్నారు.

**ఆకట్టుకున్న గాంధీ ప్రదర్శనలు..** గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సుమారు 1,500 గాంధీ విగ్రహాలు, 150 చరకాలను ప్రదర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో గాంధీజీ పాటించిన నియమాలు, ఆయన ధైర్యసాహసాలు, నడిపిన వివిధ ఉద్యమాలను వివరించే దృశ్యమాలికను ఏర్పాటు చేశారు. భారీ చరక ప్రదర్శనను నాయకులు, సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. క్విట్ ఇండియా ఉద్యమంపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన పాఠశాల విద్యార్థులకు మహేష్‌గౌడ్, మంత్రుల చేతుల మీదుగా సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్లు అందజేశారు. కార్యక్రమంలో గాంధారి ప్రభాకర్, నీరుడు దయాకర్, యానాల ప్రభాకర్, ఎం.వి.గోనారెడ్డి, మెరుగు మధు, నాగేశ్వరరావు, పావని, ఎం.వాణి, హరిదీప్, సాంబశివరావు, ఎలె బిక్షపతి, మిర్యాల వెంకటేశం, వడ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

---

**కొమరం భీమ్ ఆశయాలతో ఆదివాసీ హక్కులు**

# ఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం

### కొమరం భీమ్ విగ్రహావిష్కరణలో మంత్రి సీతక్క
### ఇందిరమ్మ స్ఫూర్తితో మహిళలు ఉక్కు మహిళల్లా ఎదగాలని పిలుపు

**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** కొమరం భీమ్ ఆశయాలతో ఆదివాసీ హక్కుల పరిరక్షణ, ఆత్మగౌరవాన్ని కాపాడుకుందామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివారం అశ్వారావుపేటలో ఆదివాసీ జెఎసి ఆధ్వర్యంలో కొమరం భీమ్ విగ్రహాన్ని మంత్రి సీతక్క, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు ఆత్మగౌరవం స్వేచ్ఛ కోసం కొమరం భీమ్ చేసిన పోరాటాలు చిరస్మరణీయమన్నారు. ఆదివాసీ సాంప్రదాయ నృత్యాలు, కొమ్ము డ్యాన్సులతో మంత్రికి ఘనస్వాగతం పలికారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడంతో పాటు భూమి అడవి, విద్య, ఉపాధి, ఇళ్లు వంటి ప్రాథమిక హక్కులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఏజెన్సీప్రజల సమస్యలను అధికారులు గౌరవంగా విని పరిష్కరించాలని సూచించారు. నియోజకవర్గంలో ఇప్పటికే సుమారు రూ.1200 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించామని, మరిన్ని పనులకు సహకరిస్తామని చెప్పారు. ఆదివాసీ యువత విద్యా నైపుణ్యాభివృద్ధి ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. భాష, సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాలన్నారు. అనంతరం గిరిజన వికాస కేంద్రం వద్ద చేపట్టనున్న రూ.25లక్షల విలువైన కాంపౌండ్ వాల్ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం చీపురుగూడెంలో రూ.10లక్షలతో నిర్మించిన మహిళా సంఘం భవనాన్ని ప్రారంభించారు. నాచారంలో రూ.1 కోటి అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి నాగుపల్లి, కొత్తూరులో అంగన్వాడీ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరమ్మ స్ఫూర్తితో మహిళలు ఉక్కు మహిళల్లా మారాలన్నారు. మహిళా సంఘాలకు రూ.10 లక్షల వడ్డీ లేనిరుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. స్వయం ఉపాధి కార్యక్రమాలు చిన్నపాటి పరిశ్రమలు చేపట్టి అభివృద్ధి చెందాలన్నారు. పుట్టగొడుగుల ఉత్పత్తిపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఒ విద్యాచందన, జెడ్పి సిఇఒ నాగలక్ష్మి , మాజీ ఎంఎల్‌ఎ మెచ్చ నాగేశ్వరరావు ఆదివాసీ జెఎసి నాయకులు, వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులు కొండరెడ్డి నాయకపోడు తదితర గిరిజన వర్గాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆదివాసీప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



### ఆదివాసీ సంస్కృతి యావత్ మానవాళికి మార్గదర్శకం
### ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రకృతిని దైవంగా భావిస్తూ, అడవిని తల్లిగా కొలుస్తూ తమ సంస్కృతి, సంప్రదాయాలను తరతరాలుగా కాపాడుకుంటున్న ఆదివాసీ సోదర, సోదరీమణులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ నాగరికతకు మూలం, ప్రకృతితో మమేకమైన జీవన విధానం ఆదివాసీ సంస్కృతిలో కనిపిస్తుందని సిఎం పేర్కొన్నారు. తరతరాలుగా ప్రకృతి పరిరక్షణను తమ జీవన విధానంగా మలుచుకున్న ఆదివాసీ సమాజాల జ్ఞానం, సంస్కృతి, సంప్రదాయాలు, సమిష్టి జీవన విధానం, సాంస్కృతిక పరిరక్షణ యావత్ మానవాళికి మార్గదర్శకమని అన్నారు. ఆదివాసీల హక్కులు, అస్తిత్వం, సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వారి సంక్షేమం, అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం సమాజం మొత్తం ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు.



---



రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను ఆదివారం కలిసి, వినతిపత్రం సమర్పిస్తున్న తెలంగాణ బేస్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్వేత, సీనియర్ క్రీడాకారులు ఖాదర్, సృజన్. తెలంగాణలో బేస్‌బాల్ క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యలో 2 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ఆ వినతిపత్రంలో వారు కోరారు. అదేవిధంగా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొనే నైపుణ్యం, ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి, రిజర్వేషన్ల ద్వారా వారిని ప్రోత్సహించాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు.

---

# హిట్ అండ్ రన్.. మెడికో ప్రియాంక మృతి

### రాజమండ్రిలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయాలు..
### సికింద్రాబాద్ కిమ్స్‌లో చికిత్స పొందుతూ కన్నుమూత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజమహేంద్రవరంలో జరిగిన హిట్ అండ్ రన్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మెడికో ప్రియాంక చికిత్స పొందుతూ మృతి చెందారు. ప్రమాదం తర్వాత ఆమెను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కొంతకాలంగా అక్కడ చికిత్స పొందుతున్న ప్రియాంక పరిస్థితి విషమించడంతో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. రాజమహేంద్రవరం పరిధిలో ప్రియాంక ప్రయాణిస్తున్న సమయంలో కారు ఢీకొట్టినట్లు సమాచారం. ప్రమాదం అనంతరం వాహనం ఆపకుండా వెళ్లిపోవడంతో ఇది హిట్ అండ్ రన్ ఘటనగా మారింది. తీవ్ర గాయాలతో ఉన్న ప్రియాంకను తొలుత స్థానికంగా చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తూ ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ పరిస్థితి విషమించడంతో ఆమె కన్నుమూశారు.

**వైద్య విద్యార్థిని మృతితో విషాదం..** మెడికో ప్రియాంక మృతి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, సహ విద్యార్థులను తీవ్ర విషాదంలోకి నెట్టింది. చదువులో ముందుండి వైద్య రంగంలో మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని కలలు కన్న ప్రియాంక అనూహ్యంగా రోడ్డు ప్రమాదానికి బలవడంతో కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి.

**హిట్ అండ్ రన్‌పై పోలీసుల దర్యాప్తు :**



ప్రమాదానికి కారణమైన వాహనం, డ్రైవర్‌ను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రమాద స్థలంలోని సిసి కెమెరా దృశ్యాలు, ప్రత్యక్ష సాక్షుల వివరాలను సేకరించి నిందితుడిని గుర్తించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

---

# ఒకప్పుడు నక్సలిజం... నేడు డ్రగ్స్ రవాణా..

### మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసింగ్‌లోనూ మార్పులు
### పెనుసవాళ్లుగా ఆర్థిక నేరాలు, రహదారి భద్రత అంశాలు
### తెలంగాణ రాష్ట్ర డిజిపి సివి ఆనంద్



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** గత మూడు దశాబ్దాలతో పోలిస్తే ప్రస్తుతం పోలీసింగ్ స్వరూపం గణనీయంగా మారిందని డిజిపి తెలిపారు. ఒకప్పుడు వామపక్ష తీవ్రవాదం ప్రధాన భద్రతా సవాలుగా ఉండగా, ప్రస్తుతం సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, ఆర్థిక నేరాలు, రహదారి భద్రత వంటి అంశాలు ప్రధాన సవాళ్లుగా మారాయని అన్నారు. ఈ నూతన సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక విభాగాలు, సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలు, సిసి కెమెరాల ఆధారిత నిఘా, సమగ్ర పోలీసింగ్ ప్లాట్‌ఫామ్‌లతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగిస్తున్నామని తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పనితీరుపై శనివారం నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్), వరంగల్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో డిజిపి పాల్గొని పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత ఐపిఎస్ ఈ వరంగల్ కమిషనరేట్ పరిధిలో పోలీసింగ్ పనితీరు, నేరాల పరిస్థితి, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, మహిళల భద్రత, ఆర్థిక నేరాల ధోరణులు తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డిజిపికి వివరించగా, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, టిస్పార్క్, క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సిఐడి)కు చెందిన ప్రాంతీయ అధికారులు సైబర్ నేరాల తాజా పరిస్థితులు, నూతన సైబర్ ముప్పులు, దర్యాప్తు విధానాలు, నేరాల నియంత్రణ, గుర్తింపు కోసం అమలు చేస్తున్న సాంకేతిక వ్యవస్థలపై డిజిపికి వివరించారు. వరంగల్‌తో తనకున్న అనుబంధాన్ని, తన పోలీసు ప్రస్థానంలోని ముఖ్యమైన ఘట్టాలను తెలంగాణ రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ గుర్తుచేసుకున్నారు. తన ఐపిఎస్ ప్రస్థానం వరంగల్‌లోనే ప్రారంభమైందని, ఇక్కడ జిల్లా శిక్షణ పొందడంతో పాటు వరంగల్ రూరల్ ఎస్పీగా కూడా పనిచేశానని ఆయన తెలిపారు.

అనంతరం వరంగల్ ప్రాంతం ఒకప్పుడు వామపక్ష తీవ్రవాదం ప్రభావంతో తీవ్రంగా అల్లకల్లోలంగా ఉన్న రోజులను డిజిపి సివి.ఆనంద్ గుర్తుచేసుకుంటూ ఆ సమయంలో పోలీసులు నిరంతరం ప్రాణహాని మధ్య విధులు నిర్వర్తించారని తెలిపారు. ల్యాండ్‌మైన్ పేలుళ్లు, ఆకస్మిక దాడులు, పోలీస్ స్టేషన్లు, పోలీసు అధికారులపై దాడులు వంటి తీవ్ర ముప్పులను ఎదుర్కొంటూ పోలీసులు విధులు నిర్వహించారని అన్నారు. విధులకు ఇంటి నుంచి బయలుదేరిన పోలీసులు తిరిగి సురక్షితంగా ఇంటికి చేరుకుంటామో లేదో తెలియని పరిస్థితులు అప్పట్లో ఉండేవని, ఆ రోజులు తనకు ఎప్పటికీ మరువలేనివని డిజిపి పేర్కొన్నారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు చేపట్టిన విస్తృత కూంబింగ్ ఆపరేషన్లను ఆయన గుర్తుచేశారు. తెలంగాణలో 2010 నాటికి వామపక్ష తీవ్రవాదం గణనీయంగా తగ్గుముఖం పట్టిందని తెలిపారు. తీవ్రవాద కార్యకలాపాలను వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చిన వారికి ప్రభుత్వం ఆరోగ్య కార్డులు, సంక్షేమ పథకాలతో పాటు పలు పునరావాస చర్యలు అందిస్తోందన్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న ప్రశాంత వాతావరణం, ప్రజల భద్రత, శాంతిభద్రతలు పోలీసు అమరవీరుల దశాబ్దాల త్యాగాల ఫలితమేనని డిజిపి సివి.ఆనంద్ పేర్కొన్నారు.

**పోలీస్ అమరుల కుటుంబాల కోసం 'టీజీ-వీర్' ప్రత్యేక గ్రీవెన్స్ పోర్టల్‌ను ప్రారంభించిన డిజిపి**

నక్సలిజంపై పోరాటంలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 28 మంది పోలీస్ కుటుంబాలతో డిజిపి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ అమరవీరుల కుటుంబాల సమస్యలను పరిష్కరించేందుకు 'టీజీ' పేరుతో ప్రత్యేక గ్రీవెన్స్ పోర్టల్‌ను డిజిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిజిపి క్యూఆర్ కోడ్‌తో కూడిన కుటుంబ కార్డులను అమరవీరుల కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబ సభ్యులు తమకు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను డిజిపి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ఎక్స్‌గ్రేషియా, ఆర్థిక సహాయం, ఇంటి స్థలాల కేటాయింపు, స్థలాల రిజిస్ట్రేషన్, టైటిల్ సమస్యలు, పెన్షన్, ఇతర సంక్షేమ అంశాలకు సంబంధించిన సమస్యలను వివరించారు.కుటుంబ సభ్యులు తెలిపిన సమస్యలను డిజిపి సావధానంగా విని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అమరవీరుల కుటుంబాలకు అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తూ, వారి సమస్యలను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతను డిజిపి ఆదేశించారు.

**వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన భవన నిర్మాణాన్ని పరిశీలించిన డిజిపి**

నేర సమీక్ష సమావేశానికి వెళ్లే ముందు డిజిపి సీవీ ఆనంద్ నిర్మాణంలో ఉన్న వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యే దశకు చేరుకున్న నేపథ్యంలో, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత ఐపీఎస్ కొనసాగుతున్న పనుల వివరాలను డిజిపికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐజీ ఇంటెలిజెన్స్ కార్తికేయ, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఎస్పీ సింధు శర్మ, అడిషనల్ కలెక్టర్ రవి, అడిషనల్ ఎస్పీ లు వినోద్, శ్యాం బాబు పాల్గొన్నారు.

---

**జర్నలిస్టుల భద్రతకోసం**

# జాతీయ స్థాయిలో ప్రత్యేక చట్టం

### ఐజెయు డిమాండ్!
### అక్టోబర్ 2న జాతీయ కోర్కెల దినం!





**బెంగళూరు :** జర్నలిస్టుల భద్రతకోసం ఒక ప్రత్యేక చట్టాన్ని చేయాలని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. బెంగళూరులో రెండు రోజులపాటు జరిగిన ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ కార్యవర్గ సమావేశం ఆదివారం సాయంత్రం ముగిసింది. సమావేశానికి ఐ.జె.యు. జాతీయ అధ్యక్షుడు బల్విందర్ సింగ్ జమ్మూ అధ్యక్షత వహించారు. ఇటీవల కాలంలో జర్నలిస్టులపై భౌతిక దాడులు, బెదిరింపులు, చట్టపరమైన దాడులు, హింస, పెరిగిపోవడం, వార్తా వనరుల గోప్యతకు అవసరమైన చట్టాలు లేకపోవడం వంటి పరిస్థితుల నేపథ్యంలో భారతదేశంలో జర్నలిస్టుల, మీడియా సంస్థల భద్రతకు ఒక ప్రత్యేక బలమైన చట్టం చేయాల్సిన అవసరం ఉందని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ కార్యవర్గ సమావేశం ఆమోదించిన ఒక తీర్మానంలో డిమాండ్ చేసింది. ఐ.జె.యు. పూర్వాధ్యక్షుడు, తెలంగాణా మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి ఈ తీర్మానాన్ని ప్రవేశపెడుతూ దేశంలో పత్రికా స్వేచ్ఛ నానాటికి దిగజారి పోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం భావప్రకటనా స్వేచ్ఛకు గట్టి హామీ ఇచ్చినప్పటికీ వర్కింగ్ జర్నలిస్టులకు రక్షణ కల్పించే సమగ్ర చట్టం లేకపోవడం వల్లనే బెదిరింపులు, దాడులు పెరిగిపోతున్నాయని, కొన్ని రాష్ట్రాల్లో జర్నలిస్టుల భద్రతకు ఇప్పటికే ప్రత్యేక చట్టాలు వచ్చినప్పటికీ, అవి అవసరానికి తగినవిధంగా లేవని ఆ తీర్మానం పేర్కొన్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమాచార పౌరసంబంధాల బడ్జెట్‌ను, వివిధ శాఖలు జారీచేసే ప్రకటనలను అనుకూల ప్రచారం కోసం ఆయుధాలుగా వినియోగించడాన్ని ఆ తీర్మానం ఖండించింది.

1955, 1958 సంవత్సరాల నాటి రెండు వర్కింగు జర్నలిస్ట్ చట్టాలను రద్దు చేసిన నేపథ్యంలో వర్కింగు జర్నలిస్టులకు వృత్తి భద్రత, వేతనభద్రత , మెరుగైన పనిపరిస్థితులు కల్పించేందుకు వీలుగా ఒక సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని ఐ.జె.యు. మరో తీర్మానంలో డిమాండ్ చేసింది. వివిధ మీడియా సంస్థలలో కొనసాగుతున్న ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయో పరిమితిని 58 నుండి 60 సంవత్సరాలకు పెంచాలని ఐ.జె.యు. సమావేశం ఆమోదించిన మరో తీర్మానంలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఐ.జె.యు. సెక్రెటరీ జనరల్ డి.సోమసుందర్, దేశంలో మీడియా స్థితిగతులపై, గత నాలుగు నెలల్లో యూనియన్ నిర్వహించిన కార్యకలాపాలపై నివేదికను ప్రవేశపెట్టారు. నివేదికపై పదిహేను రాష్ట్రాలకు చెందిన రాష్ట్ర యూనియన్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, దాదాపు ఇరవై మందికి పైగా జాతీయ కార్యవర్గ సభ్యులు, ప్రతినిధులు చర్చలో పాల్గొన్నారు. ఐ.జె.యు. స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎస్. ఎన్.సిన్హా, దేవులపల్లి అమర్, ఎం.ఎ. మాజిద్ , జాతీయ ఉపాధ్యక్షులు అమర్ మోహన్ ప్రసాద్, వై.నరేందర్ రెడ్డి, జాతీయ కార్యదర్శులు డి.ఎస్.ఆర్. సుభాష్, పి.భాస్కర్ రెడ్డి, నరేంద్ర భరద్వాజ్ , కర్ణాటక స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ అధ్యక్షురాలు ఎం.జానకీ మోహన్, ప్రధాన కార్యదర్శి అంజన్ కుమార్ తదితరులు మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ, జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2 వ తేదీన 'జర్నలిస్ట్ డిమాండ్స్ డే'ను దేశవ్యాప్తంగా పాటించాలని ఐ.జె.యు. జాతీయ కార్యవర్గ సమావేశం పిలుపు ఇచ్చింది. నవంబర్ 16వ తేదీన జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వీర్యమైపోయిన ప్రస్తుత పరిస్థితులపై దేశవ్యాప్త చర్చను లేవనెత్తాలని, సమస్యపై అవగాహన పెంచేందుకు ప్రచారాందోళనాకార్యక్రమాన్ని చేపట్టాలని, జర్నలిస్టులను, పౌర సమాజ ప్రముఖులను, ప్రజాప్రతినిధులను, న్యాయ నిపుణులను, విద్యావేత్తలను భాగస్వాములను చేస్తూ రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులు జరపాలని ఐ.జె.యు. జాతీయ కార్యవర్గ సమావేశం పిలుపు ఇచ్చింది. అక్టోబర్ ఆఖరు వారంలో మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సును హైదరాబాద్‌లో నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది.

జాతీయ కార్యవర్గ సమావేశాల ముగింపులో 'కర్ణాటక రాజ్య ప్రశస్తి' పురస్కారాల ప్రధాన కార్యక్రమాన్ని ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. కర్ణాటక స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ సమాజంలోని విభిన్న జీవన రంగాలకు చెందిన ప్రముఖులకు ప్రకటించిన 'రాజ్య ప్రశస్తి' పురస్కారాలను ఐ.జె.యు. జాతీయ నాయకుల చేతులమీదుగా ప్రదానం చేశారు.

---

# విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మాజీ మేనేజర్ రాజేశ్వరరావు మృతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మాజీ మేనేజర్ పి.రాజేశ్వరరావు అనారోగ్యంతో ఆదివారం ఉదయం కన్నుమూశారు. భారత కమ్యూనిస్టు పార్టీ కుటుంబం నుండి వచ్చిన రాజేశ్వరరావు తొలుత విశాలాంధ్ర ప్రెస్, విజయవాడలో పనిచేసేవారు. అనంతరం విశాలాంధ్ర బుక్ హౌస్ అనంతపురం బ్రాంచ్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించారు. అక్కడి నుంచి పదోన్నతిపై విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్‌గా హైదరాబాదులో బాధ్యతలు చేపట్టి సంస్థ అభివృద్ధికి, ప్రముఖ రచయితల , ఉత్తమ సాహిత్యాన్ని తీసుకురావడానికి విశేషంగా కృషి చేశారు. రాజేశ్వరరావుగారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ జనరల్ మేనేజర్‌గా పనిచేసిన కాలంలో సంస్థ ఉద్యోగుల సంక్షేమానికి రాజేశ్వరరావు ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చారు. విశాలాంధ్ర బుక్ హౌస్ ఉద్యోగులకు సిపిఐ శాఖ సహకారంతో ఇళ్ల స్థలాలు ఇప్పించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. సాహిత్యాన్ని కేవలం బుక్ హౌస్‌లకే పరిమితం చేయకుండా ప్రజల్లోకి తీసుకెళ్లాలనే లక్ష్యంతో రాజేశ్వరరావు అనేక వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ కోసం మొబైల్ పుస్తక ప్రదర్శనలతో సాహిత్య పుస్తకాలను, ప్రగతిశీల, కమ్యూనిస్టు భావజాల సాహిత్యాన్ని పల్లెపల్లెకు తీసుకెళ్లడానికి కృషి చేశారు. ఎంతోమంది యువ రచయితలను సాహిత్య లోకానికి పరిచయం చేసి, వారి రచనలను ప్రోత్సహించారు. కొత్త రచయితలను గుర్తించి, వారికి ప్రచురణ అవకాశాలు కల్పించడంలో ఆయన చూపిన చొరవ తెలుగు సాహిత్య రంగంలో ప్రత్యేకంగా నిలిచింది. సంస్థకు వివిధ రకాలుగా సేవలు అందించిన రాజేశ్వరరావు మృతికి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, నవచేతన విజ్ఞాన సమతి జనరల్ మేనేజర్ మధుకర్‌రావు, కార్యదర్శి బిఎస్‌ఆర్ మోహన్ రెడ్డి, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్, ప్రజాపక్షం జనరల్ మేనేజర్ (యాడ్స్) వి. మదన్, నవచేతన పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ పి. నారాయణ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. రాజేశ్వరరావుతో తమకు ఉన్న అనుబంధాన్ని, ఆయన సంస్థకు, సాహిత్య రంగానికి అందించిన సేవలను స్మరించుకున్నారు.



---

# గాంధీభవన్‌లో ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని ఇందిరాభవన్‌లో ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించి, యువజన కాంగ్రెస్ శ్రేణులకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# మెగా హెల్త్ హబ్‌గా వరంగల్ నగరం

### రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

### ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కెఆర్ నాగరాజు

**ప్రజాపక్షం/హనుమకొండ:** వరంగల్ నగరాన్ని రాష్ట్రం లోనే ప్రముఖ హెల్త్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే విద్య, వైద్యం, వాణిజ్యం, పారిశ్రామిక రంగాల్లో వరంగల్‌కు ఉన్న ప్రాధాన్యతను మరింత పెంచేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.హనుమకొండలోని అరేపల్లి వజ్ర గార్డెన్స్‌లో నిర్వహించిన థాన్ కాన్ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వైద్యులు, వైద్య నిపుణులు, ఆరోగ్య రంగ ప్రతినిధులు వరంగల్ వేదికగా సమావేశం కావడం పట్ల ఎమ్మెల్యే నాయిని హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి వైద్యుల సమావేశానికి వరంగల్ నగరం వేదిక కావడం ఎంతో




సంతోషకరమైన విషయమని అన్నారు. ఇలాంటి సమావేశాలు వరంగల్‌లో నిర్వహించడం ద్వారా నగరానికి ఉన్న వైద్య రంగ సామర్థ్యం మరింతగా వెలుగులోకి వస్తుందని తెలిపారు.వరంగల్ నగరం ఇప్పటికే ఉత్తర తెలంగాణకు ప్రధాన వైద్య కేంద్రంగా ఉందని, ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల ప్రజలు వైద్యం కోసం వరంగల్‌కు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య రంగాల్లో మరిన్ని ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి వస్తే వరంగల్‌ను మరింత పెద్ద వైద్య కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశం ఉందన్నారు.రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వరంగల్ వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించడం అభినందనీయమని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు. వరంగల్ నగరంలో వైద్య మౌలిక వసతుల విస్తరణ, ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు, నిపుణులైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.వరంగల్‌ను హెల్త్ హబ్‌గా అభివృద్ధి చేయడానికి స్థానిక ఎమ్మెల్యేగా తన వంతు పూర్తి సహకారం అందిస్తానని నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. వైద్య రంగానికి సంబంధించిన అవసరాలు, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాల కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు.వైద్య రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికత, కొత్త చికిత్సా విధానాలు, పరిశోధనలు, వైద్య సేవల విస్తరణపై వైద్యులు పరస్పరం చర్చించుకోవడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.వరంగల్ నగరాన్ని కేవలం విద్యా, చారిత్రక నగరంగానే కాకుండా ఆధునిక వైద్య సేవలకు ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. ఇందుకోసం ప్రజాప్రతినిధులు, వైద్యులు, అధికారులు, ప్రైవేట్ వైద్య సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్ర స్థాయి వైద్యుల సమావేశాన్ని వరంగల్‌లో విజయవంతంగా నిర్వహించడం ద్వారా నగరానికి వైద్య రంగంలో ఉన్న అవకాశాలు మరోసారి స్పష్టమయ్యాయని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని జాతీయ, రాష్ట్ర స్థాయి వైద్య సదస్సులు వరంగల్‌లో నిర్వహించేలా అవసరమైన సహకారం అందిస్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో వైద్య రంగానికి చెందిన పలువురు ప్రముఖులు, వైద్యులు, ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలోపేతానికి యువత కృషి చేయాలి



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** యువత కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎద్దు హరీష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా హరీష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి బచ్చన్నపేట చౌరస్తా వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ మసూద్, సర్పంచ్ నర్సింగరావు, జిల్లా నాయకులు బాలకిషన్ గౌడ్, సందీప్, నరేష్, భాస్కర్, శ్రీనివాస్, బాలరాజు, మల్లారెడ్డి, మహేందర్ రెడ్డి, మహేశ్వరాచారి, రవీందర్, మల్లయ్య, మహేందర్, బాబు, రామకృష్ణ, సిద్దులు, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

## నీళ్లలోనే కరెంట్ స్తంభాలు



**ప్రజాపక్షం/గోవిందరావుపేట :** మండలంలోని గాంధీనగర్ గ్రామంలో 5.30 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న విద్యుత్ ఆధునీకరణ నాణ్యత లోపాలతో జరుగుతుందని గ్రామస్తులు తెలుపుతున్నారు?ఆదివారం గ్రామంలో జరుగుతున్న నిర్మాణ పనులను గ్రామస్తులు వివరించారు. సైడ్ డ్రైన్ కాలువలో మురుగు నీరు ప్రవహిస్తున్నప్పటికీ ఆ నీటిలోనే విద్యుత్ స్తంభాలను వేయడం వల్ల అవి పటిష్టంగా ఉంటాయా లేదా అన్న అనుమానం తలెత్తుతుందని అన్నారు. ఇప్పటికైనా సమయం మించి పోలేదని విద్యుత్ పునర్నిర్మాణ పనులను క్వాలిటీగా చేయాలని గ్రామస్తులు కోరారు విద్యుత్ శాఖ అధికారులు పర్యవేక్షణ లోపం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులను నాణ్యతతో జరిగేలా పర్యవేక్షించాలని సూచించారు. లేని యెడల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలతే సాగు

**ప్రజాపక్షం/పాలకుర్తి:** రైతులు వరి పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని పాలకుర్తి ఇన్‌ఛార్జి ఎడిఒ అవర్ష అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం వల్ల రాష్ట్ర స్థాయిలో వర్షపాతం తక్కువగా నమోదు అయిన కారణం చేత జిల్లాలో రైతులు నీటి పారుదల కలిగిన వరి పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని ఆదివారం మండలంలోని తీగారం, బమ్మెర, కోతులబాద్, విస్నూర్, మేకల తండా, కొండాపురం, హర్యాతండా, బిక్య నాయక్ పెద్ద తండా గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు.కంది, పెసర, మినుములు, నువ్వులు, ఆముదాలు సాగు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు కుమారస్వామి, దయ్య, ప్రశాంత్, మల్లారెడ్డి, కిరణ్, వ్యవసాయాధికారి విద్యాకర్ రెడ్డి, అధికారులు వెంకటేష్,రాధిక,మహేష్,లక్ష్మి ప్రవలిక,రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## మంగపేటలో ఆదివాసీల భారీ ర్యాలీ




**ప్రజాపక్షం/మంగపేట :** ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను ఆదివాసి ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం మంగపేట మండలంలో ఘనంగా నిర్వహించారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురష్కరించుకుని మంగపేట మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో ఆయా గ్రామాలకు చెందిన ఆదివాసి నాయకులు ఆయా గ్రామాలలో జెండా ఎగురవేసి ఆదివాసి దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆదివాసి గ్రామ పెద్దలు ఆదివాసి సంఘాలు మహిళా సంఘాలు ఉద్యోగ సంఘాలు ఉపాధ్యాయ సంఘాలు విద్యార్థి సంఘాలు యువజన సంఘాలకు చెందిన నాయకులు ఆదివాసి ప్రజలు మండలంలోని బోరు నర్సాపురంకు చేరుకుని అక్కడ నుండి మండల కేంద్రంలోని కొమరం భీం విగ్రహం వరకు ఆదివాసి సాంప్రదాయ నృత్యాలతో జై ఆదివాసీ జై జై ఆదివాసీ అంటూ నినాదాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. మంగపేటలో అంబేద్కర్ విగ్రహానికి కొమరం భీమ్ విగ్రహానికి ఆదివాసి సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొమరం భీమ్ విగ్రహం వద్ద ఆదివాసి జెండా ఎగురవేశారు. అనంతరం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాలకు చెందిన పలువురు నాయకులు మాట్లాడుతూ ఆదివాసుల హక్కులు, సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు ఎందరో మహనీయులు త్యాగాలు చేశారన్నారు. ఆదివాసీ వర్గాల సంప్రదాయాలు, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు గొప్ప వీరయ్య, గొప్ప సమ్మారావు, పొదెం కృష్ణ ప్రసాద్, కొండా చెంచయ్య, కబ్బాక శ్రావణ్, నల్లబోయిన లక్ష్మణ్ అయ్యోరి యానయ్య, తాటి నాగరాజు, పొదెం రవీందర్, ఎట్టి సారయ్య, బాడిశ నాగ రమేష్, పొదెం మేనక, దబ్బుల ముత్యాల రావు, చాద మల్లయ్య, పొదెం నాగేష్, కొమరం లక్ష్మీపతి , కొమరం సారన్న, బాలన్న, ఇరప అరుణ తోలేం సౌమ్య, వాగబోయిన లావణ్య, పుసాం సావిత్రి ఇరప రజిని, వివిధ పార్టీలకు చెందిన మైల జయరాం రెడ్డి, చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు, ఎల్పీ ముత్యాలు పగిడిపెల్లి వెంకటేశ్వర్లు, గుగ్గిళ్ళ సురేష్, మురుకుట్ల నరేందర్, ఎంపెల్లి వీరాస్వామి పాల్గొన్నారు.

## భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** ప్రభుత్వ చీఫ్‌విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదివారం భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నా రు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు శ్రీ సత్యం ఆయనకు మహదాశీర్వచనం అందించి అ మ్మవారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆల యఅధికారులుహరినాథ్,నవీన్,శ్యామ్, సంపత్, సందీప్, పాల్గొన్నా రు.

## కొమరం భీమ్ ఆశయ సాధనకు కృషి

### ఎమ్మెల్యే గండ్ర



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఆదివాసీ హక్కుల రక్షణ కోసం ప్ర తి ఒక్కరు కృషి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ హక్కుల దినోత్సవం సందర్భంగా భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని బస్టాండ్ ఆవరణంలో కొమరం భీమ్ విగ్రహానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, జల్‌జంగల్‌జమీన్ పరిరక్షణ కోసం కొమరం భీమ్ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని అన్నారు. ఆదివాసీ ప్రజల భూమి, అటవీ సంపదపై వారికి హక్కు ఉండాలని, వారి జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షించబడాలని కొమరం భీమ్ పోరాటం స్ఫూర్తిదాయకమని గుర్తు చేశారు. ఆదివాసీ కుటుంబాల అభివృద్ధి, విద్య, ఉపాధి, సంక్షేమం వారికి రాజ్యాంగబద్ధంగా లభిస్తున్న హక్కులను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా వారిని సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.ఆదివాసీ సమాజం తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూనే విద్య, ఉద్యోగ, రాజకీయ, సామాజిక రంగాల్లో ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కొమరం భీమ్ చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడే స్ఫూర్తిని నేటి తరం ఆదివాసీ యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కర్ణాకర్, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఆదివాసీ యువత, ఆదివాసీ బిడ్డలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 16న పరకాలలో సిఎం బహిరంగ సభ



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** పరకాలలో ఈ నెల 16న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి కోరారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని జి.ఎస్.ఆర్. గార్డెన్స్‌లో ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, క్లస్టర్ ఇంచార్జిలు, బిఎల్‌ఎలు, సర్పంచులు, గ్రామ పార్టీ కొత్త, పాత అధ్యక్షులు, కాంటెస్టెంట్ సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, మాజీ పిఎసిఎస్ చైర్మన్లు, సీనియర్ నాయకులతో పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ నెల 16వ తేదీన పరకాల పట్టణ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ము ఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే బహిరంగ సభను అత్యంత విజయవంతం చేయడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని అన్నారు. బూత్ లెవెల్ నుంచి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేసి, ప్రజలను పెద్ద ఎత్తున సభకు తరలించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.కమిట్‌మెంట్‌తో కూడిన బలమైన ఆర్గనైజేషన్‌తో ప్రతి గ్రామ ం, ప్రతి బూత్‌లో సమన్వయంతో పనిచేస్తే సభ చా రిత్రాత్మక విజయాన్ని సాధిస్తుందని అన్నారు.సభ ఏర్పాట్లు, ప్రజల రవాణా, ప్రచార కార్యక్రమాలు, బాధ్యతల కేటాయింపు తదితర అంశాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

## ఆదివాసీ హక్కుల కోసం ఉద్యమం

### పసరలో భారీ ర్యాలీ



**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** ఆదివాసీల హ క్కుల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని తు డుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి చింత కృష్ణ ఆదివాసీ పి లుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని గోవిందరావుపేట మండల పస ర చౌరస్తాలో తుడం దెబ్బ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. తుడుం దెబ్బ జాతీయ అధ్యక్షుడు వట్టం ఉపేందర్ ఆదివాసీ పిలుపు మేరకు నిర్వహించిన కార్యక్రమానికి మండల అధ్యక్షుడు గొంది కిరణ్ తొలుత తుడుం దెబ్బ జెండాను ఆవిష్కరించి జల్ జమీన్ జంగిల్ కోసం ప్రాణత్యాగం చేసిన ఆదివాసీ అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పసర చౌరస్తా నుంచి పోలీస్‌స్టేషన్ మీదుగా జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీ సంప్రదాయ పాటలు నృత్యాలతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. అయితే ఇంత పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించినా అధికార యంత్రాంగం మాత్రం కానరాకపోవడం గమనార్హం. ఆదివాసీల భూములు హక్కులను కాపాడుకోవటంతో పాటు తమ పిల్లలకు విద్య ఉద్యోగ ఉపాధి సంక్షేమ రాజకీయ రంగాల్లో తగి న వాటా దక్కేలా పోరాడాలన్నారు. జీవో నంబర్ 3 ను అమలు చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. 1/70 చట్టం అటవీ హక్కుల చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని డి మాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద గొం ది రామచందర్ మాదిగ దండోరా జాతీయ నాయకుడు నెమలి నర్సయ్య మాజీ సర్పంచుల పాయం నారయణ ముద్దబోయిన రాము ఆదివాసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడే సాయిబాబు తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు తాటి హన్మంత్ స్థానిక సర్పంచ్ భూక్య సుమలత ములుగు జిల్లా సాధన సమితి అధ్యక్షుడు మంజాల బిక్షపతి గౌడ్ వట్వ సురేష్ ఈక జగ్గారావు పెండకట్ల బాలరాజు ఆదివాసీ సర్పంచుల పెండకట్ల విజయ కుంజ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## రామభక్తులకు మోదీ, షా సమాధానం చెప్పాలి

### సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారథి రెడ్డి డిమాండ్




**ప్రజాపక్షం/కేసముద్రం:** సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు కేంద్ర ప్రజా వ్యతిరేక బిజెపి సర్కార్ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 6న ప్రారంభమైన సిపిఐ జనచైతన్య ప్రచార యాత్ర ఆదివారం కేసముద్రం మండలం కేసముద్రం స్టేషన్, విలేజ్ కేసముద్రం,పెనుగొండ అర్పణ పల్లి ఉప్పరపల్లి కోరుకొండ పల్లి లో కొనసాగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ మహబూబాబాద్ నియోజకవర్గ కార్యదర్శి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రామభక్తులం అని చెప్పుకునే మోదీ అమిత్ షా బిజెపి నేతలు దేశ ప్రజలకు సమాధానం డిమాండ్ చేశారు. కోట్ల రూపాయలు చోరీ జరిగితే ఇంతవరకు విచారణ చేయకపోవడం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువుటద్దమని ఆయన విమర్శించారు. ఎప్పటికప్పుడు మాయ మాటలు చెప్పి చేతులు దులుపుకున్నారని, కనీసం సిబిఐ ఎంక్వయిరీ కూడా వేయలేని మోదీ, అమిత్ షా లు దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బిజెపి పాలనలో ప్రజలు వెనక్కి పోయారని తప్పకుండా మార్పు రావాలి ,మోదీ పోవాలి అన్నారు. ఈ సందర్భంగా రైల్వే మెగా మెయింటెనెన్స్ డిపో తక్షణమే ఏర్పాటు చేయడం వల్ల మహబూబాబాద్ జిల్లా ప్రాంత నిరుద్యోగులకు వేలాదిమందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా కేసముద్రం అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ కేసముద్రం మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, కమటం ఉపేందర్, మడత నారాయణ, వీరస్వామి, కరుణాకర్, పెరుగు కుమార్, రేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిళ్ల సాంబలక్ష్మి, కట్లోజు పాండురంగా చారి, తండ సందీప్, వీరవెల్లి రవి, వెలుగు శ్రవణ్, కేదాసు రమేష్, ఐలయ్య, సాయిలు, శ్రీనివాస్, చాగంటి శ్రీనివాస్, యాకయ్య, నాగెల్లి యాకమ్మ, బేతమల్ల శ్రీనివాస్, మంద శ్రీనివాస్, మంద రవి, పులి యాకయ్య, రవీందర్, ప్రజానాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు అధికారుల బెదిరింపులు!



**ప్రజాపక్షం/ములుగు:** మండలంలోని చక్రవర్తిపల్లె గ్రామంలో గ్రామైక్య సంఘం భవన నిర్మాణ పనులు చెరువు శిఖం భూమిలో చేపడుతున్నారని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా పనులు కొనసాగిస్తున్నారని మాజీ ఎంపిటిసి గందారపు మధుకర్ తెలిపారు. ప్రభుత్వ నిధులతో గ్రామైక సంఘం భవన నిర్మానం చేపట్టడం అభినందనీయమని, అయితే చెరువు శిఖం ప్రాంతంలో భవనం నిర్మించడం వలన మత్స్యకారులకు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఈ విషయాన్ని మత్స్యకారులు అధికారులకు వివరించినప్పటికి పనులు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. భవన నిర్మాణ పనులను అడ్డుకునేందుకు ప్రయత్నించిన మత్స్యకారులను అధికారులు బెదిరిస్తున్నారని మధుకర్ ఆరోపించారు. చెరువు శిఖం ప్రాంతంలో నిర్మాణం చేపట్టడం వలన మత్స్యకారులతో పాటు గ్రామైక్య సంఘం మహిళలకు కూడా భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నిర్మాణ పనులను నిలిపివేసి, భవనానికి ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించాలని మాజీ ఎంపిటిసి గందారపు మధుకర్ డిమాండ్ చేశారు.

## బస్టాండ్‌లో పశువుల జలకాలాట!



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** ఆత్మకూరు మండల కేంద్రంలోని బస్టాండులో చిన్న వానలకే నీళ్లు నిలిచి ప్రయాణికులకు ఇబ్బందిగా మారుతున్నది.జాతీయ రహదారి అనుకొని ఉన్న బస్టాం డు లోపలికి పోవు దారిలో లోతైన గోతి ఏర్పడి నీటితో నిండి కలకలాడుతున్నది. ఆ గోతిలో బర్రెలు,దూడలు జలకాలాడుతూ లోపలికి పోకుండా అడ్డంగా పడుకొని బస్టాండ్ లోకి బస్సులను పోనివ్వడం లేదు.. ప్రజలు రోడ్డుపై నిలుచుని బస్సు ఎక్కవలసిన దుస్థితి ఏర్పడింది.గత నెల 20వ తేదీన ప్రజాపక్షం పత్రికలో చిన్నవానకే జలమయమైన ఆత్మకూరు బస్టాండ్ అని శీర్షిక వెలువడినా పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు, ప్రయాణికులు డ్రైవర్లు, కండక్టర్లు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ఇకనైనా ఆర్‌టిసి యజమాన్యం త్వరగా స్పందించి బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలని గ్రామ ప్రజలు ప్రయాణికులు కోరుకుంటున్నారు.

## ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

### ప్రపంచ ఆదివాసుల దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్




**ప్రజాపక్షం/ నర్సంపేట:** ప్రపంచ ఆదివాసుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సంపేట పట్టణంలోని ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటి చైర్ పర్సన్ మాట్లాడుతూ అడవితో అనుబంధం, ప్రకృతితో అవినాభావ సంబంధం, మట్టి పరిమళాలను కాపాడుతూ పర్యావరణ పరిరక్షణకు ఆదివాసీలు చేస్తున్న సేవలు ఎంతో గొప్పవన్నారు. ప్రకృతిని తల్లిగా భావించి, అడవులు, కొండలు, నదులు, వనరులను సంరక్షిస్తూ తరతరాలుగా పర్యావరణ పరిరక్షణలో ఆదివాసీలు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, జీవన విధానం మన దేశానికి అమూల్యమైన వారసత్వమని, వారి హక్కులు, అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతిని కాపాడే నిజమైన రక్షకులైన ఆదివాసీ సోదర సోదరీమణులందరికీ ప్రపంచ ఆదివాసుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి అభ్యున్నతికి ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు పెండెం రామానంద్, నర్సంపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంబి వంశీకృష్ణ, నర్సంపేట మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్ర యాకూబ్ రెడ్డి, మాజీ ఎంపిటిసి కాటా ప్రభాకర్, నర్సంపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొంత రంజిత్, నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ములకల మనీష్, కాంగ్రెస్ యువ నాయకులు మెరుగు కిరణ్, గోక వేద ప్రకాష్, షాలుమ్, కాటా అఖిల్, చీకటి శివమణి, ఆదివాసీలు తదితరులు పాల్గొన్నారు.

### మాదన్నపేటలో...

నర్సంపేట పట్టణంలోని మాదన్నపేటలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఆదివాసి తోటి సంఘం అధ్యక్షులు ఆత్రం కుమార స్వామి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఆదివాసి పోరాట యోధుడు కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలను రాష్ట్ర ఆదివాసి తోడి తేగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం రఘు, కౌన్సిలర్ కొత్తకొండ మేఘన శ్యామ్ రాజులు నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఆకుల వెంకటస్వామి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సోయం నాగరాజు, ఆత్రం యాదగిరి, ఆత్రం వెంకటస్వామి, ఆత్రం రాజశేఖర్, గుర్రం రవి, సోయం రవి(టీచర్), ఆత్రం ప్రశాంత్, షద్మకి గోవిందు, మాజీ సర్పంచులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ‘జైల్‌భరో’ను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్:** కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే జైల్‌భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ఆదివారం ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు కొత్తా సీతారాములు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతి సత్యనారాయణ గౌడ్ పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకు వచ్చిన రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పమ్మి వెంకటేశ్వరరావు,నగర అధ్యక్షులు నరేష్ మోహన్‌నాయుడు, నగర ప్రధాన కార్యదర్శి సంగయ్య, ఉపాధ్యక్షులు ఫజల్, ఆదినారాయణ, మేడబోయిన రవి, హన్మంతరావు, వినోద్‌రావు, బాబురావు, జోగారావు, నాగేశ్వరరావు, కర్రి శ్రీనివాసరావు, వల్లాల యుగంధర్, తోట సైదులు, కృష్ణ, నాగరాజు, పాషా, లాజర్, జయరాజు, శివ పాల్గొన్నారు.

## ఆదర్శ కమ్యునిస్టు నరసింహ:బాగం



**ప్రజాపక్షం/చింతకాని:** సిపిఐ నాయకులు నాగిలిగొండ గ్రామానికి చెంది న కనగంటి నరసింహ(80) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మరణవార్త తెలుసుకున్న పార్టీ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు నాగిలిగొండ చేరుకొని నరసింహ మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడు తూ నరసింహ బ్రతికినంతకాలం ఎర్రజెండా ని ఎత్తుకొని పార్టీ అభివృద్ధి కో సం ఎంతగానో కృషిచేశాడన్నారు. నరసింహ కుటుంబానికి పార్టీ ఎల్లప్పు డూ అండగా ఉంటుందన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి తోట రా మాంజనేయులు, గ్రామ సర్పంచ్ ఏపూరి పద్మ, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు షేక్ హుస్సేన్, మాజీ ఎంపీటీసీ పదిమల వెంకటనర్సయ్య, శాఖ కా ర్యదర్శి చాట్ల రమేష్, నాయకులు షేక్ చిన్న జాన్, ఏపూరి నరసయ్య, శేఖ ర్, పంది తిరపయ్య, సలీందర్, బాబు, ముఖర్జీ, నాగేశ్వరరావు, భాస్కర్, శ్రీను, రామారావు ఫకీర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## ‘నేటి’ గిరిజన దర్బార్ ప్రజావాణి రద్దు

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** బోనాల పండుగ సందర్భంగా నేడు జరిగే గిరిజన దర్బార్ ప్రజావాణి కార్యక్రమాలను రద్దు చేస్తున్నట్లు అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి ఐడిఓసికి, గిరిజన దర్బారుకు ఐటిడిఏకు ప్రజలు రావద్దను తెలిపారు. తిరిగి వచ్చే సోమవారం యధావిధిగా ప్రజావాణి, గిరిజన దర్భారు కొనసాగుతాయని, అంతా దీనిని గమనించాలన్నారు.

## యువత హక్కులను కాలరాస్తున్న కేంద్రం :నూతి సత్యనారాయణ గౌడ్



**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ :** యువత ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రశ్నించే గొంతుకలను అణిచివేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వేజండ్ల సాయికుమార్ ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ పతాకాన్ని ఆవిష్కరించారు. నూతి సత్యనారాయణ గౌడ్, సాయికుమార్ లు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలన్నారు. యువశక్తిని జాతీయ నిర్మాణానికి వినియోగించడంతో పాటు నిరుద్యోగం, విద్య, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలు, యువత హక్కులపై అవగాహన కల్పించడం, ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్య పద్ధతులలో ఉద్యమాలు నిర్వహించడమే యువజన కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమన్నారు. హింసా, బెదిరింపులు, అణిచివేతల ద్వారా యువత హక్కులను కాలరాయడం ఏ ప్రభుత్వానికి సాధ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు బాలాజీ నాయక్, అనుబంధ సంఘాల అధ్యక్షులు కొత్తా సీతారాములు, శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, సయ్యద్ గౌస్, పుచ్చకాయల వీరభద్రం, కిలారు అనిల్, గంగరాజు, గాదె ఝాన్సీ, బామ్మిడి శ్రీనివాస్, బెల్లంకొండ శరత్, టౌన్ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మహేష్‌బాబు జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ :** సూపర్ స్టార్ మహేష్‌బాబు జన్మదిన సందర్భంగా ఆయన అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అభిమానాన్ని కేవలం కేకులు, బాణాసంచా, కేరింతలకే పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడేవిధంగా నిర్వహించారు. ఖమ్మం జిల్లా సూపర్ స్టార్ మహేష్‌బాబు అభిమాన సంఘం అధ్యక్షులు దేవభక్తిని కిషోర్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం సూపర్ స్టార్ మహేష్‌బాబు పుట్టిన రోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మహేష్‌బాబు జన్మదిన సందర్భంగా పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న అభిమానులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు తోట రంగారావు, నగర అధ్యక్షులు మునగాల బాలు, జిల్లా కన్వీనర్ బానాల లక్ష్మణ్, నగర కన్వీనర్ పులిపాటి సంపత్‌కుమార్, ఉపాధ్యక్షులు చింతమళ్ల గురుమూర్తి, నల్లబెల్లి గౌతమ్, సుధాకర్, ఏనుగు మహేష్, బుర్రి మోహన్‌రావు, పెరుమాళ్లపల్లి వీరబాబు, వడ్డూరి భార్గవ్, మర్రి శివ, దుంపటి శ్రవణ్, ధర్మేంద్ర, అజీజ్, నర్సింహారావు, యాదగిరి పాల్గొన్నారు.

## గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

**వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్**



**ప్రజాపక్షం/ ఖమ్మంఅర్బన్ :** గిరిజనుల సంక్షేమం, అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తెలిపారు. ఆదివారం ఖమ్మం గిరిజన భవన్ నందు ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిడి ఫిరంగి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ గిరిజనులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సకాలంలో చేరేవిధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గిరిజన జాతులను సమన్వయం చేయాలని ప్రభుత్వం ఆదివాసీలకు ఉపాధి కల్పించేందుకు అనేక రకాల పథకాలు, ఉద్యోగాలు ఇస్తుందన్నారు. గిరిజన బిడ్డలు చదువులో రాణించాలని, గిరిజనుల పండుగలు, గిరిజనుల అభివృద్ధి కోసం నిధులు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఆదివాసీ దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ డిడి ఫిరంగి మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, ఆచారాలను కాపాడుకుంటూనే ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ఉపయోగించుకుని గిరిజన యువత ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలన్నారు. హక్కుల కోసం పోరాడిన కోమరం భీం, అల్లూరి సీతారామరాజు లతో పాటు గిరిజన నాయకుల త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత కల్పిస్తూ పలు సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. కళ్యాణలక్ష్మి, గిరిజన గురుకులాలు, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి, పోడు భూములకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు, గిరివికాసం ద్వారా ఉచిత బోర్లు, విద్యుత్ మోటార్లు పంపిణీ చేస్తుందన్నారు. ఐటిడిఏ ఆధ్వర్యంలో కోయ, కొండరెడ్లు వంటి సాంప్రదాయ తెగల అభివృద్ధికి పోడు భూముల సమస్యల పరిష్కారానికి, అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్ విస్తరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. గిరిజన నిరుద్యోగ యువతీ, యువకుల కోసం గిరిజన యువత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం ద్వారా ఉచిత వృత్తి విద్యా కోర్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖమ్మంలోని రోటరీ నగర్ స్కిల్లింగ్ సెంటర్‌లో ఉచిత వసతి, ఉచిత భోజనం, వసతి, యూనిఫాంతో పాటు శిక్షణ అనంతరం ప్రైవేటు ఉద్యోగాలు, గిరిజన లక్ష్మి ద్వారా వ్యాపార రుణాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌టిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బానోత్ వీరునాయక్, తెలంగాణ గిరిజన సంక్షేమ సంఘం నాయకులు అజ్మీర రామ్మూర్తి నాయక్, భూక్యా వీరభద్రం, ఏఐబిఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు రామ్మూర్తి నాయక్, కిషన్ నాయక్, వీరన్న, బిస్కి నాయక్, భీముడు నాయక్, మంగ్యా నాయక్, భద్రు నాయక్, రాంబాబు, తారాదేవి, సాయికుమార్, మంగీలాల్, రాందాస్, సీతారాం, రమేష్, బాలాజీ, రాంజీ, మాత్రు నాయక్, శ్రీనివాస్, హరి పాల్గొన్నారు.

## భద్రాద్రి ఏజెన్సీలో ఆదివాసీల సంబురం





**ప్రజాపక్షం/భద్రాచలం:** ప్రపంచ ఆదివాసీ దినోత్స వం సందర్భంగా ఆదివారం భద్రాచలం ఏజెన్సీ ము ఖ ద్వారం సంబురాలతో నిండిపోయింది. ఆదివాసీ కళలు ఆచారాలు జీవన విధానాలను ప్రతిబింబించేలా నిర్వహించిన వేడుక సందడిగా సాగింది. కొమ్ము నృత్యాలు డోలు మోతలు కలగలిసిన నృత్యాలతో ఏజెన్సీ ముఖ ద్వారం మార్మోగింది. ఆదివాసీ కళాకారులు సాంప్రదాయ వేషధారణలో నిర్వహించిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తరతరాలుగావస్తున్న తమ సంస్కృతి సంప్రదాయాలను కాపుడుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నట్లు ఈ సంబురం సాగింది. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ సెంటర్లో ఆదివాసీ జెండాను స్థానిక ఎంఎస్‌ఏ డా.తెల్లం వెంకట్రావు ఎగురవేయగా ఐటిడిఏ పిఓ రాహుల్, సర్పంచ్ పూనెం కృష్ణ దొర, మాజీ ఎంపి మిడియం బాబూరావులు పాల్గొని విప్లవ వీరుల విగ్రహాలకు పూల మాలలువేసి నివాళ్లర్పించారు. ఈ వేడుకకు ఐటిడిఏ పిఓ రాహుల్‌తో పాటు ఎంఎల్ఏ డా.తెల్లం ప్రత్యేక గిరిజన సాంప్రదాయ వస్త్రధారణతో హాజరయ్యారు. అనంతరం జరిగిన సభలో ఎంఎల్ఏ మాట్లాడుతూ పోలవరం పేరుతో ఆదివాసీల జీవనం ఛిన్నాభిన్నమైందని, అశాస్త్రీయ పద్ధతిలో రాష్ట్రాన్ని విడదీసి ఆదివాసీల బ్రతుకులపై పెత్తనం సాగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మగౌరవంతో బ్రతికే ఆదివాసీలు ఎక్కడున్నా కలిసిమెలిసే ఉంటామని, అసలు ఈ దేశానికి మూల వాసులు ఆదివాసీలే అన్నారు. ఆదివాసీల బ్రతుకుల్లో వెలుగులు నింపేందుకు ఐటిడిఏ పిఓ ఎంతో కృషి చేస్తున్నారని అభినందించారు.అనంతరం ఐటిడిఓ ప్రాంగణంలోని గిరిజన భవన్లో ప్రత్యేక సాంస్కృతిక వేడుకలు జరిపించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ జనరల్ దేవిద్రాజు, గిరిజన నాయకులు ముర్ల రమేష్ గుండి శరత్ కుంజా ధర్మ పాయం రవివర్మ పుల్లయ్య, డిడి చందన, ఏఓ సున్నం రాంబాబు, అరుణకుమారి మధుకర్ సమ్మయ్య రాధమ్మతో పాటు పలువురు గిరిజన నాయకులు, గిరిజన పెద్దలు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అత్త హత్య కేసులో ఇద్దరు అరెస్ట్



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** అక్రమ సంబంధానికి అడ్డుగా ఉందన్న కారణంతో అత్తను హత్య చేసి, మృతదేహాన్ని పెట్రోల్‌తో తగులబెట్టిన ఘటనలో ఇద్దరు నిందితులను సత్తుపల్లి పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించినట్లు అధికారులు వెల్లడించారు. సత్తుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుంబూరు గ్రామానికి చెందిన గుండాల వెంకటనర్సమ్మ (65) ఈ నెల 2వ తేదీ రాత్రి నుంచి కనిపించకుండా పోయింది. దీంతో ఆమె పెద్ద కుమార్తె వెదుళ్ల మంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 4న సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కేసును సత్తుపల్లి సిఐ టి. శ్రీహరి దర్యాప్తు చేస్తున్నారు.

**అక్రమ సంబంధమే హత్యకు కారణం..?**

పోలీసుల వివరాల ప్రకారం.. తాళ్ళమడ గ్రామానికి చెందిన వెదుళ్ల తిరుపతిరావు (55)కు ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్యకు దూరంగా ఉంటూ రెండో భార్య మంగమ్మతో తుంబూరులో నివసిస్తున్నాడు. కొంత కాలంగా భర్త మృతి చెందిన తుంబూరు గ్రామానికి చెందిన పగుట్ల సునీత (35) తో తిరుపతిరావు అక్రమ సంబంధం కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయం తిరుపతిరావు భార్య మంగమ్మతో పాటు ఆమె తల్లి వెంకటనర్సమ్మకు తెలియడంతో తరచూ గొడవలు జరుగుతున్నాయని విచారణలో వెల్లడైనట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ క్రమంలో సుమారు పది రోజుల క్రితం దుద్దేపూడిలో సునీత పనిచేస్తున్న ఇంటి వద్దకు మంగమ్మ, వెంకట నర్సమ్మ వెళ్లి ఆమెను తిట్టి కొట్టినట్లు తెలిపారు. దీంతో తీవ్ర అవమానానికి గురైన సునీత తనను అవమానించిన వారిపై కక్ష పెంచుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ముందే పథకం.. అర్ధరాత్రి హత్యఅక్రమ సంబంధం కొనసాగాలంటే ముందుగా వెంకటనర్సమ్మను అడ్డు తొలగించుకోవాలని తిరుపతిరావు, సునీత నిర్ణయించుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ మేరకు ఈ నెల 2వ తేదీ అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో వెంకటనర్సమ్మ ఇంటికి ఇద్దరూ వెళ్లారు. ఆ సమయంలో ఇంటి తలుపు తెరిచి ఉండగా.. వెంకటనర్సమ్మ కుర్చీలో కూర్చొని టీవీ చూస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరూ ఇంట్లోకి ప్రవేశించి చీర కొంగుతో ఆమె మెడకు బిగించి హత్య చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారని పోలీసులు వెల్లడించారు.

**గ్రామ పెద్దలకు చెప్పి.. పరారైన నిందితుడు...**

హత్య విషయం బయటపడుతుందన్న భయంతో తిరుపతిరావు తుంబూరు గ్రామ సర్పంచ్ వీరబాబు, తుంబూరు జీపీ ఓ ఎక్కిరాల లక్ష్మణ్‌ల వద్దకు వెళ్లి జరిగిన విషయాన్ని వివరించినట్లు పోలీసులు తెలిపారు. తనను కాపాడాలని కోరగా.. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి విషయం చెబుదామని, భయపడాల్సిన అవసరం లేదని వారు చెప్పినట్లు విచారణలో వెల్లడైందన్నారు. అనంతరం ఇంటికి వెళ్లి వస్తానని చెప్పిన తిరుపతిరావు అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు.

**ఎక్స్‌రోడ్డులో పట్టివేత..**

నిందితుల కోసం వైరా ఏసీపీ, కల్లూరు సబ్‌డివిజన్ ఇన్‌చార్జ్ సారంగపాణి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 9.15 గంటల సమయంలో నారాయణపురంగురుభట్లగూడెం ఎక్స్‌రోడ్డు వద్ద నిందితులను విశ్వసనీయ సమాచారం మేరకు అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.

**ఇద్దరు నిందితులు అరెస్ట్...**

ఈ కేసులో తుంబూరు గ్రామానికి చెందిన వెదుళ్ల తిరుపతిరావు (55), పగుట్ల సునీత (35) లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు నేర విధానానికి సంబంధించి నిందితులు పంచుల సమక్షంలో వెల్లడించిన వివరాలను పోలీసులు నమోదు చేశారు.

**వస్తువుల స్వాధీనం...**

నిందితులు నేరానికి ఉపయోగించినట్లు భావిస్తున్న మోటార్‌సైకిల్, రెండు సెల్‌ఫోన్లు, మృతురాలి పగిలిన సెల్‌ఫోన్, రెండు ఖాళీ పెట్రోల్ బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో సత్తుపల్లి పోలీస్‌స్టేషన్ సిబ్బందితో పాటు రెండు ఎస్‌ఎల్‌ఎస్ బృందాలు సహకరిస్తున్నాయి.

## సింగరేణి మణుగూరు ఏరియాకు నూతన ఉత్తేజం

**ఉపాధి కోసం స్థానిక యువత ఎదురుచూపు**

**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి మణుగూరు ఏరియాకు కొత్త ఉపిరి పోయనున్నాయి పికెఒసి డిప్‌సైడ్, మణుగూరు ఓసీలు. ఈ రెండు కొత్త గనులతో మణుగూరు ఏరియా మనుగడ మరో 20 సంవత్సరాలు పెరగనున్నది. ఈ రెండు గనులలో 219 మిలియన్‌టన్నుల బొగ్గు నిక్షేపాలు ఉన్నాయి. డిప్‌సైడ్‌లో బ్లాక్‌లో 182 మిలియన్ టన్నులు, మణుగూరు ఒసి విస్తరణ ప్రాజేక్టులో 37 మిలియన్ టన్నుల బొగ్గును తీయనున్నారు.

**నాణ్యమైన బొగ్గు.....**

నూతన ప్రాజేక్టులు అయిన పికెఒసి, మణుగూరు ఒసి బ్లాకులు నాణ్యమైన బొగ్గు నిక్షేపాలు కలిగి ఉన్నాయి. ఈ రెండు ప్రాజేక్టులలో జీ 5,6,7,8 ,9,10,11,12 వరకు నాణ్యత కలిగిన బొగ్గు ఉత్పత్తి అవుతుంది. నాణ్యమైన విధ్యుత్ ఉత్పత్తికి జీ 9,10 బొగ్గు అవసరం ఉండగా, మార్కెట్‌లో ఈ రంకం బొగ్గుకు అధిక డిమాండ్ ఉంది. ఈ రెండు ప్రాజేక్టులనుండి జీ6,7,8,9,10 రాన్ను రోజుల్లో సింగరేణికి భారీగా లాభాలు రానున్నాయి.

**స్థానిక కార్మికులకు ఊరట...**

మణుగూరు ఏరియాలో పనిచేస్తున్న సింగరేణి కార్మికులను నిన్నటి వరకు వారి మనుగడ ప్రశ్నార్థకంగా ఉండేది. రెండు గనులు కాలం ముగియటంతో ఏ ప్రాంతానికి బదిలి అవుతామో అనే ఆవేదనలో ఉన్నారు. నేడు ఈ రెండు ప్రాజేక్టులు రావటంతో మణుగూరు ఏరియాలో పనిచేస్తున్న 2528 మంది కార్మికులకు బరోసా కలిగింది.

**ఉపాధి కోసం స్థానిక యువత ఎదురు చూపు....**

ఈ రెండు ప్రాజేక్టులు ప్రారంభం అయితే స్థానికులుకు ఉపాధి దొరుకుందని యువత ఎదురుచూస్తుంది. కాని అది అందిని ద్రాక్షలాగే కనిపిస్తుంది. ఈ రెండు బ్లాకుల ఒబి వెలికితీత పనులు ప్రవేటు కంపెనీలకు ఇవ్వనుండటంతో స్థానికులకు ఉపాధి అవకాశాలు దెబ్బతింటున్నాయి. పనులు దక్కించుకున్న ప్రవేటు కంపెనీలకు ఎక్కువగా ఇతర రాష్రాలనుండి కార్మికలును తీసుక రావటంతో స్థానికులకు నిరాస ఎదురవుతుంది. స్థానిక సింగరేణి యాజమాన్యం ప్రవేటు కంపెనీలలో 60% స్థానికులకు కెటాయించే విధంగా నిభందనలు కఠినంగా అమలు జరిపితే స్థానిక యువతకు న్యాయం జరుగుతుంది.

## వైరా 14వ వార్డుకు రూ. కోటి అభివృద్ధి నిధులు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ 14వ వార్డులో రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యల పరిష్కారానికి సుమారు కోటి రూపాయల నిధులు మంజూరయ్యాయి. కాలనీ ప్రజలు తమ సమస్యలను జిల్లా కాంగ్రేస్ అధికార ప్రతినిధి పమ్మి అశోక్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే స్పందించి నిధులు మంజూరు చేశారు. ఇప్పటికే వార్డులో సిసి రోడ్లు, రూ.8లక్షలతో ట్రాన్స్‌ఫార్మర్ రూ.15లక్షలతో అంగన్‌వాడీ భవనం, నిరుపేదలకు 13 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. వార్డు అభివృద్ధికి చొరవ చూపుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, పమ్మి అశోక్‌కు కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పమ్మి తిరుమలరావు, పమ్మి వెంకయ్య, షేక్ మీరా, కొమ్ము నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## చాత్రోపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** వారంతా 39 ఏళ్ల నాడు ఖమ్మం ప్రభుత్వ టీచర్ శిక్షణా కేంద్రం (టిటిసి)లో శిక్షణ పొందిన చాత్రోపాధ్యాయులు. 90 శాతం మందికి పైగా ఉపాధ్యాయులుగా పనిచేసిన వారే. వివిధ జిల్లాల్లో పనిచేసి కొందరు పదవి విరమణ చేయగా కొందరు ఉద్యోగం చేస్తున్నారు. నాటి మధుర స్మృతుల్ని నెమరువేసుకునేందుకు కలవాలనుకున్నారు. 1987 1988 టిటిసి బ్యాచ్ చాత్రోపాధ్యాయులు. ఓ నలుగురు మిత్రులు కలిసి ఒక వాట్సాప్ గ్రూప్ తయారు చేశారు. ఎవరుకు తెలిసిన వారిని వారు ఆ గ్రూపులో యాడ్ చేశారు. 200 మంది ఉన్న ఈ బ్యాచ్‌లో 150 మందికి పైగా యాడ్ అయ్యారు. అనుకున్నదే తడువుగా ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకోవాలనుకున్నారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. మహబూబ్ నగర్, వరంగల్, మహబూబాబాద్, హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం , ఖమ్మం జిల్లాల నుంచి 100 మందికి పైగా హాజరయ్యారు. ఇన్నేళ్ల తర్వాత కలుసుకున్న వారిలో ఆనందం వెల్లివిరిసింది. ఆనాటి మధుర స్మృతుల్ని నెమరువేసుకున్నారు. తమ తమ కుటుంబాలను పరిచయం చేసుకున్నారు. ఆనాడు ట్రైనింగ్ సెంటర్‌లో జరిగిన సంఘటనలు గుర్తు చేసుకుని 60లో 20కి వెళ్లారు. నాటి గురువులని సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సందడి చేశారు. కార్యక్రమ ఏర్పాట్లను ఆనాటి టిటిసి రిప్రజెంటివ్‌లు చింతమనేని వెంకటేశ్వర రావు, రవీంధర్‌రెడ్డి లతో పాటు ఖమ్మంకు చెందిన మోహన్‌దాస్, బాబురావు, ఎ. నాగేశ్వరరావు, ఎం. నరసింహులు, విజయ్‌లు పర్యవేక్షించారు.

## మంచమెక్కుతున్న పల్లెలు

**సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు స్పందించాలి: అమరేందర్**

**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలంలోని పలు గ్రామాల్లో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నా వైద్యాధికారులు పట్టించుకోవడం లేదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ ఆరోపించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో నీరు నిలిచి దోమల వ్యాప్తి పెరిగిందన్నారు. వ్యాధుల బారిన పడిన ప్రజలు స్థానికంగా వైద్యం అందక భద్రాచలం, మణుగూరు, కొత్తగూడెం తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. అశ్వాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శాశ్వత వైద్యులను నియమించి మెరుగైన వైద్యం అందించాలని, గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మండల పరిషత్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను వేగవంతం చేయాలని కోడి అమరేందర్ కోరారు.

## ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవం

- మన్యం వీరులకు మూల మాలలు వేసిన యువజన నాయకులు
- ఆదివాసీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం : సాధనపల్లి సతీష్



**ప్రజాపక్షం/భద్రాచలం:** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అంబేద్కర్ సెంటర్లోని మన్యం వీరుల విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రముఖ న్యాయవాది సాదనపల్లి సతీష్ మాట్లాడుతూ ఆదివాసీల సమస్యలను పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని మండిపడ్డారు. ఇప్పటికీ రహదార్లు, విద్యుత్ కనీస మౌళిక సదుపాయాలు లేని గ్రామాలో ఎన్నో ఉన్నాయన్నారు. జిల్లాలో అధికశాతం గిరిజనులు నివశిస్తున్నప్పటికీ వారి సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని, ఐటిడిఏలో ఏళ్ల తరబడి గిరిజనాభివృద్ధి కోసం పనిచేస్తున్నా ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదన్నారు. ఇప్పటికే మూల వాసులైన ఆదివాసీల బ్రతుకుల్లో వెలుగులు నింపేందుకు పాలకులు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కొక్కిరేణి అశోక్‌కుమార్ పసుపులేటి నాగు ఖాసీం, పింగళి బాబు తదితరులు పాల్గొన్నారు.ఆదే విధంగా సిపిఎం ఆధ్వర్యంలో కుంజా బొజ్జి సున్నం రాజయ్య స్థూపాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పాలకులు అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని కిష్టారం సిఆర్పిఎఫ్ క్యాంపులో ఆదివాసీ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా సమీప గిరిజన గ్రామాల ప్రజలకు వ్యవసాయ పని ముట్లు పంపిణీ చేశారు.

## హత్య కేసులో నిందితుల రిమాండ్

**బంగారు ఆభరణాల కోసమే మహిళ హత్య**





**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** మండల పరిధిలోని పిండిప్రోలు గ్రామంలో జాతీయ రహదారి వెంట నివసిస్తున్న దంపతుల ఇంట్లోకి ప్రవేశించి మహిళను అతి కిరాతకంగా హత్యచేసి పరారైన నిందితున్ని పట్టుకునేందుకు విశ్వ ప్రయత్నం చేసి ఎట్టకేలకు నిందితున్ని గుర్తించారు. ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్‌దత్ ఆదేశాలతో ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి, కూసుమంచి సిఐ సంజీవ్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలుగా ఏర్పడి చెన్న సుగుణమ్మ హత్య కేసులో నిందితున్ని గుర్తించారు. ఈ మేరకు ఆదివారం ఏసీపీ తిరుపతిరెడ్డి విలేకరులకు వివరాలను వెల్లడించారు. పిండిప్రోలు గ్రామానికి చెందిన అయితేబోయిన ప్రశాంత్(26) చెన్న సుగుణమ్మ ఇంటి పక్కనే చికెన్ దుకాణం పెట్టి జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రశాంత్ మద్యం ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడి ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. జూలై17 అర్ధరాత్రి చెన్నా సుగుణమ్మ, జనార్ధన్ దంపతులు నిద్రిస్తున్న సమయంలో అయితబోయిన ప్రశాంత్ మంచినీళ్ల కోసం మాస్క్ పెట్టుకుని వెళ్లి సుగుణమ్మ మెడలో ఉన్న రెండున్నర తులాల తాడు కేసులు 8 లాగుతుండగా సుగుణమ్మ ప్రతిఘటించడంతో చంనుతానని బెదిరించగా సుగుణమ్మ ప్రశాంత్ కంట్లో కారం కొట్టడంతో ప్రశాంత్ వెంట తీసుకొచ్చిన ఇనుపరాడ్డుతో విచక్షణ రహితంగా నుదిటిపై కొట్టడంతో చెన్న సుగుణమ్మ రక్తపు మడుగులో కొట్టిమిట్టాడుతూ మృతి చెందింది. ఆమె భర్త ఆదమరిచి నిద్రపోవడంతో ఇదంతా జరిగినట్లు వెల్లడించినట్లు తెలిపారు.

## వర్షాలు సమృద్ధిగా కురువాలని.. రైతుల్లో కొత్త వెలుగులు నింపాలి: హరీష్‌రావు



ప్రజాపక్షం/సిద్ధిపేట : వర్షాలు సమృద్ధిగా కురువాలని..రైతుల్లో కొత్త వెలుగులు నింపాలని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల పోచమ్మ దేవాలయం, చిన్నకోడూరు మండలం కస్తూరిపల్లి, జిల్లా కేంద్రంలోని బంగారుమైసమ్మ ఆలయంలో ఆషాడ మాస బోనాల ఉత్సవాల్లో హరీష్‌రావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఇ ఈసందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ ఆషాడ మాసం అమ్మవారి బోనాల కార్యక్రమంలో సంతోషంగా ఉందన్నారు. అమ్మవారిదయతో ఈ యేడ వర్షాలు సమృద్ధిగా కురువాలని అమ్మవారిని ప్రార్థించారు. అమ్మవారి దయతో అన్నింటా శుభం కలుగాలని. ప్రజలంత సుబీక్షంగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ జక్కుల శ్రీలతశ్రీనివాస్, బిఆర్ఎస్ నేతలుజక్కుల కనకయ్య. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. పలువురిని మాజీ మంత్రి హరీష్‌రావు పరామర్శించారు.

## గంజాయి, డ్రగ్స్‌పై యువత అక్షర యుద్ధం ప్రారంభించాలి: మేయర్



ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ : నేటి సమాజాన్ని పట్టి పీడిస్తున్న గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలపై యువత అక్షర యుద్ధం ప్రారంభించాలని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కరీంనగర్ నగరంలోని ఫిల్మ్‌భవన్‌లో తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన యువ కవి సమ్మేళనం కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలంగాణ రచయితల సంఘానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కరీంనగర్ సాహిత్య చరిత్రలో తొలిసారిగా యువ కవులందరినీ ఒకే వేదికపైకి తీసుకొతచ్చి ఫిల్మ్‌భవన్ వేదికగా ఈ యువకవి సమ్మేళనం నిర్వహించడం చారిత్రాత్మక ఘట్టమని అన్నారు. కేవలం కవిత్వానికే పరిమితం కాకుండా నేటి సమాజాన్ని పట్టి పీడిస్తున్న గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల వ్యసనాలకు వ్యతిరేకంగా యుద్ధం మొదలైంది అనే అంశాన్ని ఎంచుకోవడం యువ కవుల సామాజిక బాధ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. యువతనుద్దేశించి మాట్లాడుతూ నేను మేయర్‌గా మాత్రమే రాలేదని మీ మంచి కోరుకునే కుటుంబ సభ్యునిగా వచ్చానని నేటి యువత అనంతమైన శక్తి సామర్థ్యాలకు మారుపేరని అన్నారు. కవుల పాత్రను ప్రస్తావిస్తూ కత్తి కంటే కలం గొప్పదని ఒక కవి రాసే అక్షరం అనేక మంది యువత గుండెల్లో స్ఫూర్తిని నింపగలదని అన్నారు. మీరు రాసే కవితలు కేవలం అక్షరాలు కాదని సమాజాన్ని మేల్కొలిపే అస్త్రాలు అని ఈ మత్తు రక్కసిపై సాగుతున్న అక్షర యుద్ధంలో మీరే మా సైనికులని మీ కలాలు గర్జించాలని మీ పదాలు యువతను సరైన మార్గంలో నడిపించే కరదీపకలు కావాలని పిలుపునిచ్చారు. యువత తమ శక్తిని చదువు, క్రీడలు, కళలు, విజ్ఞానం, ఉపాధి, కెరీర్ నిర్మాణంపై కేంద్రీకరించాలని సూచించారు. డ్రగ్స్ లేని కరీంనగర్ నిర్మాణం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు కొత్త అనిల్ కుమార్ కార్యదర్శి దొమ్మాటి శంకర్, కందూరి వెంకటేశ్వర్లు, కె.ఎస్ అనంతాచార్య, బివిఎన్ స్వామి, అనిత, సాయి చరణ్, యువ కవులు, సాహితీవేత్తలు, విద్యార్థులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## ఘనంగా యూత్ కాంగ్రెస్ 66వ ఆవిర్భావ దినోత్సవం



ప్రజాపక్షం/గజ్వేల్: మల్లారెడ్డిపల్లిలో జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నేతలు శశిభూషణ్ రెడ్డి, మట్ట సాయి కుమార్, సల్మాన్, బిట్ల నవీన్, నంద కుమార్, మహబూబ్, మాధవ్ రెడ్డి, ముకుంద్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ప్రసాద్, స్వామి, ప్రభుదాసు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడానికి యువజన కాంగ్రెస్ కీలక భూమిక పోషించిందని తెలిపారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ఆధ్వర్యంలో యువతను ఏకతాటిపైకి తెచ్చి ప్రజా సమస్యలపై పోరాడుతూ సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు.

### రామగిరిలో

ప్రజాపక్షం/రామగిరి:ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ హాజరై కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ నాయకులు తోట్ల తిరుపతి యాదవ్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు యువతను రాజకీయాల్లో భాగస్వామ్యం చేయడంలో యూత్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.యువతకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని,ప్రజా సమస్యల పరిష్కారానికి యువ నాయకులు ముందుండి పనిచేయాలని పిలుపునిచ్చారు.యూత్ కాంగ్రెస్ నాయకులు,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తోట్ల తిరుపతి యాదవ్ సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, యువతకు అండగా నిలవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు ఎల్లే రామమూర్తి, రామగిరి మండల క మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్,రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ ఓబీసీ అధ్యక్షులు బంధారి సదానంద్,రత్నాపూర్ యూత్ అధ్యక్షులు బర్ల.శ్రీకాంత్ రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కండె పోషం, మాజీ సర్పంచ్ ఎరుకల ఓదేలు, తీగల సమ్మయ్య,సర్పంచ్ లు వనం రామచంద్ర రావు,పుల్లెల కొమురయ్య, ఇల్లందుల సంజీవ్. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోత్కూర్ అవినాష్,గణపతి, కాల్వ శ్రీను,మల్లేష్,రమేష్, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు,ఉప సర్పంచ్,రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అన్ని గ్రామ శాఖల అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

### గోదావరిఖనిలో

ప్రజాపక్షం/గోదావరిఖని: గోదావరిఖని పట్టణంలో యూత్ కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కౌటం సతీష్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు. నగర మేయర్ మహంకాళిస్వామి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాదరబోయిన రవికుమార్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## నిర్మాణం అవుతున్న ప్రతి షాపింగ్ కాంప్లెక్స్‌పై
# శ్వేత పత్రం విడుదల చేయాలి



సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కాపూర్ సూర్య డిమాండ్

ప్రజాపక్షం/పెద్దపల్లి : రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిర్మాణం అవుతున్న ప్రతి షాపింగ్ కాంప్లెక్స్ పైన వివరాలపై శ్వేత పత్రం విడుదల చేయాలని సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కాపూర్ సూర్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసలు ఇక్కడ అనుమతి లేవని చెప్పి సింగరేణి జిఎం నుండి నోటీసులు పిల్లర్లకు అంటించి వెళ్లడం జరిగిందని మీరంతా దుకాణాలు కట్టుకోండి మీకు నేను అనుమతులు లెక్కిస్తాను అని చెప్పిన ఎమ్మెల్యే ఇప్పటివరకు మౌనంగా ఉండడం వెనుక ఆంతర్యం ఏమిటని మార్కపూరి సూర్య ప్రశ్నించారు.బాధితులు అందరిని తీసుకొని వచ్చి బాధితుల వివరాలతో సహా అక్కడ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి అందరితో విలేకరులతో మాట్లాడారు రామగుండం కార్పొరేషన్ లోని ఎల్బీనగర్ షాపింగ్ కాంప్లెక్స్ కుట్రపూరితంగా రాజకీయ కోణంలో నా మీద గెలవలేని కొంతమంది సన్నాసులు మాట విని దీనిని ధ్వంసం చేయడం జరిగిందని అన్నారు ఈరోజు మీరు ఆరుగురు లబ్ధిదారులు అని చెప్పి చెప్పడం జరిగింది. లబ్ధిదారుల వివరాలతో సహా నేనిక్కడ ప్రకటిస్తున్నాం మీరు వారికి న్యాయం చేయాలని ఎమ్మెల్యే రాష్ట్ర కురుని కోరారు. ఉన్నటువంటి బాధితుల్లో ఏ ఒక్కరికి దుకాణం కేటాయించకుండా ఎమ్మెల్యే క్యాపు కార్యాలయం ముందు కూర్చుంటానని సూర్య హెచ్చరించారు. ఈరోజు ఎమ్మెల్యే మాట విని కట్టుకున్న దుకాణాలు నష్టపోయే పరిస్థితి వచ్చిందని దుయ్యబట్టారు రామగుండం కార్పొరేషన్ లో జరుగుతున్న అవినీతి దురాక్రమణాలను ఎవరికి తెలియకుండా తిలక్ నగర్ సెంటర్లో జరుగుతున్న కాంప్లెక్స్ నిర్మాణాల పైన ఎమ్మెల్యేకు తెలియకుండా సింగరేణి చేసిన దాడిని కప్పుచుకోవడానికి ప్రతిపక్ష పార్టీ పైన బురద చల్లడానికి ఎల్బీనగర్ కాంప్లెక్స్ పైన దాడి చేయడం ఏమన చర్య అని అన్నారు తిలక్ నగర్ సెంటర్లో నిర్మాణం జరుగుతున్న షాపింగ్ కాంప్లెక్స్ లో 16 షాపులకు 24 షాపులు నిర్మాణం జరుగుతున్నాయని ఎనిమిది షాపులు ఎక్కువ కడుతున్నారని అక్కడి స్థానిక కార్పొరేటర్ ఆరు పనులు చేసిన ఎందుకు స్పందించడం లేదని నిజంగా మీకు దమ్ముంటే తిలక్ నగర్ సెంటర్లో నిర్మాణం అవుతున్న షాపింగ్ కాంప్లెక్స్ లో మీ స్థానిక కార్పొరేటర్కు మీ కార్పొరేషన్ అధ్యక్షునికి ఎటువంటి రూములు లేవని ప్రకటించగలరా అంతేకాకుండా ఓల్డ్ అశోక్ దగ్గర వేసుకున్న టెంపరరీ స్ట్రక్చర్స్ లో ఎక్స్ట్రా దుకాణాలు లేవని ఏ దుకాణాలు మా నాయకులు మధ్యవర్తిత్వం వహించలేదని మామిడి చెట్టు కింద ఉన్న లీడర్లు చెప్పగలరా రాజేష్ థియేటర్ దగ్గరికి నిర్మాణంలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన రెండు గ్రూపులు పరస్పరం ఫిర్యాదు చేసుకుంటే కూర్చోబెట్టి మాట్లాడిన విషయం నిజం కాదా ప్రకటించాలని ఇవాన్ని నిజాలు కాకపోతే నేను ముక్కు భూమికి రాస్తానని నిజాలైతే మరి మీలో ఎవరు ముక్కు భూమికి రాస్తారని సూర్య ప్రశ్నించారు. నాకు నిబద్ధత ఉంది కాబట్టే ఇక్కడ జరుగుతున్నటువంటి విషయాలను నిక్కచ్చిగా తెలియజేశారు ఇదేవిధంగా మీ పార్టీ కూడా మీ నాయకుడు కూడా నిక్కచ్చిగా నిబద్ధతను ఉన్నట్లయితే ఇదేవిధంగా రావడం కార్పొరేషన్ల నిర్మాణం జరుగుతున్న ప్రతి శాంపియన్ కాంప్లెక్స్ దగ్గర వివరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు ఉన్నటువంటి లబ్ధిదారుల్లో ఏ ఒక్కరిగా అన్యాయం జరిగినా భారత కమ్యూనిస్టు పార్టీ చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధితులు భూసాల శంకర్, సోడాల కనకమ్మ ఎజ్జు రమేష్ ,ఇమ్రాన్ ,ఎస్కే గౌస్ ,రాయమల్లు ,సిపిఐ పార్టీ ఆఫీస్ సమితి ,సభ్యులు గౌతం, గోవర్ధన్, సిబిఐ నగర కార్యదర్శి కె కనకరాజ్, చంద్రశేఖర్, ప్రీతం ,సిపిఐ నాయకులు రాణవేణి సుధీర్, సాధుర శివ ,పోదరాజు నాగరాజు,పాల్గొన్నారు.

## నిధులు మంజూరుకు మంత్రి శ్రీధర్ బాబు హామీ



ప్రజాపక్షం/ముత్తారం:పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని గ్రామాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులను ప్రాధాన్యతా క్రమంలో మంజూరు చేస్తామని రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో ముత్తారం మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు శివకుమార్ నేతృత్వంలో పలువురు మండల సర్పంచ్‌లు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల సమస్యలను, స్థానిక అవసరాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

**మౌలిక వసతుల కల్పనపై వినతి:** గ్రామాల్లో విద్యాభివృద్ధి, యువతకు అవసరమైన క్రీడా ప్రాంగణాలు, మౌలిక వసతుల కల్పన, అంతర్గత రహదారుల నిర్మాణం,పారిశుద్ధ్య నిర్వహణ వంటి కీలక సమస్యలను సర్పంచ్‌లు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. సర్పంచ్‌లు సమర్పించిన వినతిపై మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజాప్రతినిధులు కోరిన సమస్యల పరిష్కారానికి తక్షణమే నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బియ్యని శివకుమార్, సర్పంచులు రాపెల్లి రాజయ్య,గడ్డం రాజేశం,మెంగని సమత తిరుపతి, పెగడ తిరుమల కుమార్, సిలివేరి జ్యోతి లక్ష్మణ్, పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలు పండించాలి

కలెక్టర్ సత్య ప్రసాద్



ప్రజాపక్షం/జగిత్యాల: ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఎలినినో ప్రభావం మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని, ఈ పరిస్థితుల్లో రైతులు వరి సాగును విస్తరించకుండా తక్కువ నీటి అవసరం కలిగిన ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ అంచనాల ప్రకారం రానున్న రోజుల్లో వర్షపాతం తగ్గడంతో పాటు వర్షాల మధ్య సుదీర్ఘ విరామాలు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. దీనివల్ల చెరువుల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాల మట్టాలు గణనీయంగా తగ్గిపోవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 1,010 చెరువులు ఉండగా ప్రస్తుతం కేవలం 268 చెరువులు మాత్రమే నిండి ఉన్నాయని, ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు మొత్తం సాగు అవసరాలను తీర్చేందుకు సరిపోవని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో భూగర్భ జలాల మట్టం ఇప్పటికే సగటున 1.12 మీటర్లు తగ్గిందని, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షపాతం మరింత తగ్గితే భూగర్భ జలాలు ఇంకా దిగజారే అవకాశం ఉందన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యంగా వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉన్నందున వరి సాగుకు పూర్తిస్థాయిలో నీటి సరఫరాపై ఆధారపడలేమని కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు ప్రస్తుతం లేదా ఇకపై కొత్తగా వరినాట్లు వేయడం,వరి సాగు విస్తీర్ణాన్ని పెంచడం పూర్తిగా నివారించాలని సూచించారు. వ్యవసాయ శాఖ సూచించిన కందులు,పెసర,మినుములు, ఆముదం, జొన్న, సజ్జలు,తగిన తేమ ఉన్న ప్రాంతాల్లో మాత్రమే మొక్కజొన్న వంటి తక్కువ నీటి అవసరం కలిగిన ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కలెక్టర్ కోరారు. ప్రత్యామ్నాయ పంటల ఎంపిక, విత్తనాల లభ్యత, సాంకేతిక సూచనల కోసం రైతులు తమ పరిధిలోని వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

## యవజన వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల శంకర్




ప్రజాపక్షం/బెజ్జంకి: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న యువజ వ్యవతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల శంకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ 4వ మండల మహ సభను జిల్లా మాజీ అధ్యక్షులు బోనగిరి శ్రావణ్ అధ్యక్షతన నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వారు హజరై పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపి అధికారం చేపట్టిన అనంతరం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటికరణ చేస్తూ ఔట్ సోర్సింగ్ విధానాన్ని ప్రోత్సహిస్తుందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల అనేక హామీలను ఇచ్చి అమలు చేయడంలో విఫలమయ్యారని అన్నారు. ఉద్యోగులు నియామాకాల ప్రక్రియను వేగవంతం చేయడంలో ఆశించిన పురోగతి సాధించలేదని అన్నారు. యువతకు ఇచ్చన హామీలను కార్యరూపం దాల్చేలా ప్రభు త్వం నిర్దిష్ట ప్రణాళిక చేపట్టాలన్నారు. అదే విధంగా సెప్టెంబర్ 8,9,10 తేదీలల్లో యాదాద్రి భువనగిరి జిల్లాలో ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలు జరుగనున్నాయని యువత అధజక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహ సభలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్, నాయకులు మిద్దె రవి, బాబు, చరణ్, లక్ష్మణ్, బాలమల్లు, మహేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సారెడ్డిని కలిసిన సిపిఐ నేతలు

ప్రజాపక్షం/గజ్వేల్: గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిని ఆదివారం సిపిఐ పార్టీ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యులు బట్టు దయానంద రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు, గజ్వేల్ చేనేత సహకార కార్మిక సంఘం అధ్యక్షులు స్వర్గం రాజేశం, గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ కలిశారు. ఈ సందర్భంగా నిరుపేద చేనేత కార్మికులు, సంఘ అభివృద్ధి, పెండింగ్ లో ఉన్న రింగ్ రోడ్డు, బస్టాండ్, నియోజక వర్గంలోని ప్రాజెక్టు కాలువలు తదితర ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో నర్సారెడ్డి సానుకూలంగా స్పందించి వీలైనంత తొందరలో సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## ఆయిల్‌పామ్ సాగులో సిద్దిపేట జిల్లా దక్షిణ భారతదేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తుంది

సిద్దిపేట నియోజకవర్గంలో 50 వేల ఎకరాలకు విస్తరిస్తాం

మాజీ మంత్రి హరీష్‌రావు



ప్రజాపక్షం/సిద్దిపేట: రాబోయే రోజుల్లో అయిల్ ఫామ్ సాగు సిద్దిపేట జిల్లా దక్షిణ భారతదేశంలో అగ్రస్థానంలో నిలుస్తుందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. ఇప్పటికే 5322 ఎకరాల్లో అయిల్ ఫామ్ సాగవుతుందని..త్వరలోనే 50వేల ఎకరాలకు విస్తరించేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గంలో రైతుల జీవితాల్లో గుణత్మాక మార్పు రావలన్న ఐదేళ్ల కల అయిల్‌ఫామ్ సాగుతోనే సాకారమైందన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మేడిపల్లి గ్రామంలో అయిల్‌ఫామ్ తోటను మాజీమంత్రి హరీష్‌రావు పరిశీలించారు. స్థానిక ప్రజాప్రతినిధులు. రైతులతో సమావేశమై అద్భుతమైన దిగుబడి సాధిస్తున్న రైతులను ఆయన అభినందించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు వచ్చినప్పటి, వరి పంట వేయటం వల్ల రైతుల ఆదాయంలో మార్పురాలేదన్నారు. నంగునూర్‌లో జూన్ 5న 2021లో ఏల్లారెడ్డి రైతు పోలంలో మొదటి మొక్క నాటితే మూడేళ్ల తర్వాత మొదటి గేలను కోసినట్లు తెలిపారు. మొదటి గెలను కోసి ఫ్యాక్టరీలో పంపిన కొద్ది రోజుల్లో రైతుల ఖాతాలో డబ్బులు పడటంతో అందరిలో నమ్మకం కుదిరిందన్నారు. సిద్దిపేట నియోజక వర్గంలో 5322 ఎకరాల్లో అయిల్ ఫామ్ సాగవుతుండగా, 301 ఎకరాలో కటింగ్ మొదలైందని సంతోషం వ్యక్తం చేశారు. నియోజక వర్గంలో 2లక్షల ఎకరాల సాగుభూమి ఉంటే అందులో 88వేల ఎకరాల్లో కేవలం వరిమాత్రమే పండిస్తున్నారన్నారు. వరి పండిస్తే ఏడాదికి 50వేల రూపాయలు మిగలని పరిస్థితి ఉంటే కేవలం రెండు ఎకరాల్లో అయిల్‌ఫామ్ సాగుచేస్తున్న మహేందర్ అనే రైతు నెలకు 50వేల రూపాయలు సంపాధిస్తున్నారన్నారు. టన్నుకు 24 వేల రూపాయల ధర పలుకుతుందన్నారు. ఖర్చులు పోను ఎకరానికి సగటున లక్ష రూపాయలకు పైగా ఆదాయం వస్తుందన్నారు. గోపులాపూర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తన ఉద్యోగం మానేసి నెలకు లక్ష రూపాయలు సంపాధిస్తున్నారన్నారు. పేద విద్యార్థుల చదువుల కోసం హరీష్‌రావు బాసటగా నిలిచి నవజీవన్ ఎంప్లాయిస్ వేల్ఫేర్ సోసైటికి లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. దళిత విద్యార్థిని ఎంబిబిఎస్ ఫీజు సొంత ఖర్చులతో చెల్లించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సీటు సాధించి ఫీజు కట్టలేని నిరుపేద దళిత విద్యార్థులకు డాక్టర్ చేసే బాధ్యత తనదే హరీష్‌రావు స్పష్టం చేశారు. ధళిత, గిరిజన, బిసి కార్పొరేషన్లు కేవలం కాగితాలకే పరిమితమైనారన్నారు. విద్యార్థులు బాగ చదవాలని, చదువుకు పేదరికం,కులం అడ్డురాదన్నారు.

## ప్రాణాంతకంగా గుంతల రోడ్డు!



ప్రజాపక్షం/రామగుండం : రామగుండం పట్టణం మీదుగా హౌసింగ్‌బోర్డుకాలనీ, విలేజి రామగుండం, లింగాపూర్, పాములపేట, రాయదండి గ్రామాలకు వెళ్లే వాహనదారులు, ప్రజలు రోడ్డుపై ఏర్పడిన గుంతల కారణంగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గరవుతున్నారని మాజీ కార్పొరేటర్ బద్రి రజిత రాజు అన్నారు. రోడ్డు పునర్నిర్మాణ పనుల్లో భాగంగా గత 3 మాసాలుగా పనులు జరుగుతున్నప్పటికి వాటిని త్వరగా పూర్తి చేయడంలేదు. దీంతో నిత్యం పెద్ద పెద్ద గుంతల మీదుగా రాకపోకలు సాగిస్తూ వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారిన పడ్తున్నారు. గత కొంతకాలంగా ఈ గుంతలను పూడ్చాలని కోరుతున్న ఏవరూ పట్టించుకోవడంలేదు. గుంతలలో వర్షపు నీరు నిలిచి రోడ్డు మరింత ప్రమాదకరంగా మారింది. ప్రజల ప్రాణ రక్షణ, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే శాశ్వత ప్రాతిపదికన రోడ్డు నిర్మాణ పనులను తక్షణం పూర్తి చేయాలని వాహనదారులు, ప్రజలు స్థానిక ఎమ్మెల్యే, నగర మేయర్, నగరపాలక, ఆర్‌అండ్‌బి ఉన్నతాధికారులను కోరుతున్నారు.

## ఆదివాసీల హక్కులను హరిస్తున్న ప్రభుత్వ విధానాలను అడ్డుకోవాలి

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : ఆదివాసుల హక్కులను హరిస్తున్న ప్రభుత్వ విధానాలను అడ్డుకొని, అటవీ హక్కుల చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని,ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పౌర హక్కుల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు బొంకూరి లక్ష్మణ్ అధ్యక్షతన పెద్దపల్లి జిల్లా కేంద్రం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాధన కుమారస్వామి, బొంకూరి లక్ష్మణులు మాట్లాడుతూఆదివాసీల హక్కులు, భూమి, అడవి, జీవనాధారాల పరిరక్షణపై ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. రాజ్యాంగం ఆదివాసీలకు కల్పించిన ప్రత్యేక రక్షణలు ఉన్నప్పటికీ, నేటికీ వారి భూములు, అడవులు, సహజ వనరులపై దోపిడీ కొనసాగుతుండటం ఆందోళనకరమని అన్నారు. మైనింగ్,పరిశ్రమలు,ప్రాజెక్టులు,రహదారులు తదితర అభివృద్ధి కార్యక్రమాల పేరుతో ఆదివాసీలను వారి నివాస ప్రాంతాల నుంచి తరలించే చర్యలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.అభివృద్ధి పేరుతో ఆదివాసీల ఉనికినే దెబ్బతీసే విధానాలను అభివృద్ధిగా పరిగణించలేమని స్పష్టం చేసింది. ఆదివాసీల భూములకు రక్షణ కల్పించేందుకు ఉద్దేశించిన 1/70 చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, అక్రమంగా బదలాయించిన గిరిజన భూములను తిరిగి ఆదివాసీలకే అప్పగించాలని కోరింది. ఈ నిరసన కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమార్ స్వామి, ముడిమడుగుల మల్లన్న, కే విశ్వనాథ్, గాండ్ల మల్లేశం,బొంకూర్ లక్ష్మణ్,బొడ్డుపల్లి రవి,నారా వినోద్, సత్యనారాయణ, శంకర్,గుమ్మడి కొమురయ్య,పులిపాక రవీందర్,రాజు,అంజన్న,దస్తగిరి,ఎరుకల రాజన్న,రామిల్ల బాబు గూళ్ల రాజు, సిహెచ్ చందు,విష్ణు,లావణ్య నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కి యూత్ కాంగ్రెస్ కార్యకర్తలే పట్టుకొమ్మలు



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్: కాంగ్రెస్ పార్టీకి యూత్ కాంగ్రెస్ కార్యకర్తలే పట్టుకొమ్మలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బొంకూరి అవినాష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ముందుగా మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు అవినాష్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. యువతను రాజకీయంగా చైతన్యవంతులను చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి యూత్ కాంగ్రెస్ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసమస్యల పరిష్కారంతో పాటు యూత్ కాంగ్రెస్ కార్యక్రమాల నిర్వహణలో ఎమ్మెల్యే విజయరమణారావు సరైన మార్గదర్శకత్వం వహిస్తూ, ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తున్నారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు శ్రావణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరంగి రాజు, గుమ్మడి ప్రసాద్, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ తిరుమలేష్, జనరల్ సెక్రెటరీ ఆయుబ్ మహమ్మద్, రాకేష్, ఓదెల, జూలపల్లి మండలాల అధ్యక్షులు రాహుల్, దేవేందర్‌తో పాటు పలువురు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# బహుళంచెల భద్రతలో ఎర్రకోట

- పంద్రాగస్టు వేడుకలకు దేశ రాజధానిలో పటిష్ట భద్రత
- ఎఫ్ఆర్ఎస్ వ్యాన్‌లతో సహా అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగం
- 15-20వేల మంది ఢిల్లీ పోలీసులు, పారామిలిటరీ సిబ్బంది మోహరింపు



**న్యూఢిల్లీ :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ దేశ రాజధాని ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎర్రకోట వద్ద బహుళ అంచెల భద్రతను ఏర్పాటు చేశారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడానికి ఢిల్లీ పోలీసులు అభిజ్ఞాన్ యాప్, ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) వ్యాన్‌లతో సహా అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇంటెలిజెన్స్ సమాచారం నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను పటిష్టం చేశారు. ఆగస్టు 15న జరిగే వేడుకల కోసం సుమారు 15-20వేల మంది ఢిల్లీ పోలీసులు, పారామిలిటరీ సిబ్బందిని మోహరించే అవకాశం ఉంది. ఎర్రకోటలో జరిగే ఈ కార్యక్రమానికి విఐపిలు, వివిఐపిలతో సహా దాదాపు 25,000 మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్లలో భాగంగా, జనసమూహంలోని వ్యక్తులను తనిఖీ చేయడానికి అభిజ్ఞాన్ అప్లికేషన్‌ను తొలిసారిగా విస్తృతంగా ఉపయోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ అప్లికేషన్‌లో కోటి మందికి పైగా నేరస్థుల డేటాబేస్ ఉందని, యాదృచ్ఛికంగా ఎంపిక చేసిన వ్యక్తుల వేలిముద్రలను సేకరించడానికి పోలీసు సిబ్బంది హ్యాండ్‌హెల్డ్ పరికరాలను ఉపయోగిస్తున్నారని వారు తెలిపారు. ఈ వేలిముద్రను కొన్ని సెకన్లలోనే డేటాబేస్‌తో సరిపోల్చి తనిఖీ చేస్తారు. ఎరుపు రంగు సూచిక అంటే ఆ వ్యక్తికి నేర చరిత్ర ఉందని, దాని వివరాలు స్క్రీన్‌పై కనిపిస్తాయని అర్థం. ఆకుపచ్చ రంగు సూచిక అంటే ఎలాంటి నేర చరిత్ర కనుగొనబడలేదని సూచిస్తుంది. ఎర్రకోట, దాని పరిసరాలను పర్యవేక్షించడానికి, ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ముఖ గుర్తింపు వ్యవస్థ) కలిగిన కెమెరాలతో సహా దాదాపు 1,000 సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ స్మారక చిహ్నం లోపల ఒక హైటెక్ సిసిటివి కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ పోలీసు సిబ్బంది, సాంకేతిక బృందాలు ఆ ప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. ఎర్రకోట వెలుపల అనేక కిలోమీటర్ల మేర నిఘా ఉంచడానికి కూడా ఈ నిఘా నెట్‌వర్క్‌ను ఉపయోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎత్తయిన వేదికలతో సహా వ్యూహాత్మక ప్రదేశాలలో స్నైపర్లను మోహరిస్తారని, అలాగే ఎలాంటి అనధికార వైమానిక కార్యకలాపాలను నిరోధించడానికి యాంటీడ్రోన్ వ్యవస్థలను కూడా ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఆ ప్రాంతంలో ఎఫ్ఆర్ఎస్ వ్యాన్‌లను కూడా మోహరించారు. హైరిజల్యూషన్ కెమెరాలతో కూడిన ఈ వ్యాన్‌లు, గుంపులోని ముఖాలను స్కాన్ చేసి, అందుబాటులో ఉన్న డేటాబేస్‌లతో సరిపోల్చుతాయి. కావలసిన లేదా అనుమానాస్పద వ్యక్తిని గుర్తించినట్లయితే, ఈ వ్యవస్థ ఒక హెచ్చరికను జారీ చేసి, తక్షణ ధృవీకరణ, అవసరమైన చర్య కోసం ఆ సమాచారాన్ని కంట్రోల్ రూమ్‌కు పంపుతుంది. ఈ ఏడాది ఎర్రకోట థీమ్ 'వందేమాతరం'. భద్రతా ఆంక్షల్లో భాగంగా 15న స్మారక చిహ్నం చుట్టూ గాలిపటాలు ఎగురవేయడాన్ని నిషేధించారు. ఈ ప్రతిష్టాత్మక జాతీయ కార్యక్రమంలో ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించబడకుండా పోకుండా చూసేందుకే సిసిటివి నిఘా, ఫేషియల్ రికగ్నిషన్, ఫింగర్‌ప్రింట్ వెరిఫికేషన్, యాంటీడ్రోన్ సిస్టమ్స్, స్నైపర్లు, భారీ సంఖ్యలో భద్రతా సిబ్బందిని మోహరించినట్లు ఆ అధికారి తెలిపారు.

# యువతకు పారదర్శకంగా న్యాయం చేస్తాం

- జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ హామీ
- అన్ని సమస్యలను లాఠీలతో కాకుండా చర్చలతోనే పరిష్కరించగలమని వ్యాఖ్య



**రాంచీ :** నియామక పరీక్షల్లో జరిగిన అవకతవకలకు నిరసనగా ఆందోళన చేస్తున్న యువతకు పారదర్శకంగా న్యాయం చేస్తామని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ హామీ ఇచ్చారు. అదే సమయంలో, రాష్ట్రంలోని అన్ని సమస్యలను లాఠీలతో కాకుండా చర్చలతోనే పరిష్కరించగలమని పేర్కొన్నారు. ఆదివారం జరిగిన జార్ఖండ్ ఆదివాసి మహోత్సవంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని అస్థిరపరిచేందుకు స్వార్థ శక్తులు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థుల ఆందోళనను రాజకీయం చేయకూడదని, రాజకీయ ఆశలు పెట్టుకున్నవారు యువతను తప్పుదోవ పట్టించవద్దని ఆయన హెచ్చరించారు. యువత సమస్య తనకూ ఆందోళనేనని, పరీక్షల అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సోరెన్ అన్నారు. 'రాష్ట్ర స్వావలంబనను అంగీకరించలేని స్వార్థ శక్తులు, ఇక్కడి ప్రజాస్వామ్యాన్ని అస్థిరపరిచేందుకు జార్ఖండ్‌లో పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయి. అన్ని సమస్యలను లాఠీ-దండ-బందూక్ (చర్చలు, లాఠీలు కాదు)తో కాకుండా సంవాద్‌తోనే పరిష్కరించగలం. ఆయుధాలు సరిహద్దులోని శత్రువుల కోసం ఉద్దేశించినవి పరీక్షల నిరసనకారులకు పూర్తి పారదర్శకతతో న్యాయం అందిస్తామని నేను హామీ ఇస్తున్నా' అని అన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ పరీక్ష పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనను ప్రస్తావిస్తూ, 'యువతను ఎలా హింసించారో, పెల్లెట్ గన్‌లు, లాఠీ ఛార్జీలను ఎలా ఎదుర్కోవలసి వచ్చిందో, వారిని దేశద్రోహులుగా ఎలా ప్రకటించారో అందరూ చూశారు' అని అన్నారు. బిజెపిని ఉద్దేశిస్తూ ప్రత్యర్థి రాజకీయ పార్టీలు అబద్ధాలు, తప్పుడు సమాచారం వ్యాప్తి చేసి జార్ఖండ్ యువతను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నిస్తున్నాయని సోరెన్ ఆరోపించారు. ఇందులో మేధావులు కూడా పాలు పంచుకున్నారన్నారు. నిరసన చేస్తున్న యువతకు న్యాయం అందించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి నొక్కిచెప్పారు. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, దొంగలను పట్టుకున్నాం, న్యాయం అందిస్తామని చెప్పారు. యువత తమ ఆందోళనకు రాజకీయ అండదండలు కోరవద్దని విజ్ఞప్తి చేస్తున్నానని, న్యాయం మీ హక్కు అని అన్నారు. నియామక పరీక్షలలో జరిగిన అవకతవకలకు నిరసనగా విద్యార్థులు చేపట్టిన ఆందోళన ఆదివారం నాటికి 16వ రోజుకు చేరుకుంది.

### నిరాహారదీక్ష విరమించండి

నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ నిరసన తెలుపుతున్న విద్యార్థులతో చర్చించేందుకు జార్ఖండ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ, ఆదివారం నాడు దేవేంద్ర నాథ్ మహోతో చర్చించింది. గత ఎనిమిది రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న వారిలో మహోతో కూడా ఉన్నారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో మహోతో ఆరోగ్యం క్షీణించింది. అతని రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు తక్కువగా ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. కమిటీ సభ్యుడైన ఉన్నత, సాంకేతిక విద్యాశాఖ మంత్రి సుదివ్య కుమార్ వీడియో కాల్ ద్వారా మహోతోతో మాట్లాడి, అతని ఆరోగ్యం గురించి ఆరా తీశారు. చర్చలు జరుగుతున్నాయని, ఈ రోజులోనే సమస్య పరిష్కారమవుతుందని ఆయనకు హామీ ఇచ్చారు. మరో కమిటీ సభ్యురాలైన మంత్రి దీపికా పాండే సింగ్ కూడా తనను నిరాహార దీక్ష విరమించాలని కోరారని మహోతో తెలిపారు. కమిటీతో జరిగిన సమావేశం నుండి నిరసనకారుల ప్రతినిధులు తిరిగి వచ్చిన తర్వాతే దీనిపై నిర్ణయం తీసుకుంటానని మహోతో చెప్పారు. నియామక పరీక్షల్లో అవకతవకలపై 16వ రోజు కూడా నిరసన కొనసాగిస్తున్న అభ్యర్థులతో జార్ఖండ్ ప్రభుత్వం ఆదివారం నాడు కొత్తగా చర్చలు ప్రారంభించింది. అయితే, హేమంత్ సోరెన్ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యను ఒక ప్రముఖ విద్యార్థి సంఘం 'రాజకీయ ఎత్తుగడ'గా అభివర్ణించింది.

# చరిత్ర పునరావృతం కావొద్దు

- 2023 నాటి 146 మంది ఎంపిల సస్పెన్షన్‌ను గుర్తు చేసిన కాంగ్రెస్ ప్రధాన కార్యదరి జైరామ్ రమేశ్
- పార్లమెంట్‌లో కేంద్రం కీలక బిల్లులు ప్రవేశపెట్టే అవకాశం

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా 2023లో అపూర్వమైన రీతిలో 146 మంది ఎంపిలను సస్పెండ్ చేయడం, స్వల్ప వ్యతిరేకతతో అనేక కీలక చట్టాలను ఆమోదించడం వంటి విషయాలను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఆదివారం గుర్తుచేసుకున్నారు. చరిత్ర పునరావృతం కాకూడదు అని ఆయన ఉద్ఘాటించారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి వారానికి ముందు ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఈ సమావేశాల్లో విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు, 2026తో సహా పలు కీలక చట్టాలను చేపట్టే అవకాశం ఉంది. '2023 డిసెంబర్ 13న, పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరుగుతున్నప్పుడు, ఇద్దరు వ్యక్తులు విజిటర్స్ గ్యాలరీ నుంచి లోక్‌సభలోకి దూకి, నినాదాలు చేస్తూ, క్యాన్ల నుండి పసుపు పొగను విడుదల చేసినట్లు ఎక్స్‌లో జైరామ్ రమేష్ పోస్టు చేశారు. అదే సమయంలో మరో ఇద్దరు బయట రంగు పొగ క్యాన్లను పేల్చారని, ఇది భద్రతకు జరిగిన దిగ్భ్రాంతికరమైన, తీవ్రమైన ఉల్లంఘన అని అన్నారు. 'ప్రతిపక్షమంతా కేంద్ర హోం మంత్రి నుంచి ఒక ప్రకటన కోసం పదేపదే డిమాండ్ చేసింది. కానీ ఏ ప్రకటన రాలేదు. గత నెలలో నిరసన చేస్తున్న యువతపై ఢిల్లీ పోలీసులు జరిపిన దారుణాలపై ఇప్పుడు మౌనం వహిస్తున్నట్లే అప్పుడు కూడా ఆయన మౌనం వహించారు' అని అన్నారు. 2023 డిసెంబర్ 14 నుంచి 2023 డిసెంబర్ 21 మధ్య, అపూర్వమైన రీతిలో 146 మంది ఎంపిలను లోక్‌సభలో 100 మందిని, రాజ్యసభలో 46 మందిని సస్పెండ చేశారని ఆయన ఎత్తి చూపారు. ఈ రికార్డు స్థాయి సస్పెన్షన్ల తర్వాత, మిగిలిన సమావేశాల్లో ప్రతిపక్షాల హాజరు నామమాత్రంగానే ఉన్నప్పటికీ, పార్లమెంట్ అనేక ముఖ్యమైన చట్టాలను ఆమోదించిందని ఆ కాంగ్రెస్ నాయకుడు అన్నారు. డిసెంబర్ 20న లోక్‌సభలో, డిసెంబర్ 21న రాజ్యసభలో మూడు క్రిమినల్ చట్ట సంస్కరణల బిల్లులు ఆమోదం పొందాయని మరికొన్ని ఉదాహరణలను ఆయన పేర్కొన్నారు. 1860 నాటి భారత శిక్షా స్మృతి స్థానంలో 2023 నాటి భారతీయ న్యాయ సంహిత వచ్చింది; 1973 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ స్థానంలో 2023 భారతీయ నాగరిక్ సురక్షా సంహిత వచ్చిందని; భారత సాక్ష్య చట్టం స్థానంలో 2023 భారతీయ సాక్ష్య అధినియమ్ వచ్చిందని రమేశ్ పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలం) బిల్లు ఆమోదం పొందిందని కూడా ఆయన గుర్తు చేశారు. అయితే ఇలాంటి చరిత్ర పునరావృతం కాకూడదని మాజీ కేంద్ర మంత్రి నొక్కి చెప్పారు. అత్యంత కీలకమైన అంశాలపై చర్చ జరగనున్నందున ఈనెల 10, 11, 12 తేదీలలో లోక్‌సభ, రాజ్యసభల్లోని తమ ఎంపిలు తప్పనిసరిగా హాజరుకావాలని కాంగ్రెస్ పార్టీ శుక్రవారం నాడు విప్ జారీ చేసింది. ఈ మూడు రోజులూ తమ ఎంపిలు సభకు హాజరయ్యేలా చూడాలని ప్రతిపక్ష పార్టీ ఇండియా కూటమి మిత్రపక్షాలకు కూడా సూచించిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. వచ్చే వారం పార్లమెంటులో వివాదాస్పద ఎఫ్‌సిఆర్ఎ బిల్లుపై చర్చ, ఆమోదం జరగనున్నాయన్న వార్తల నేపథ్యంలో ఈ విప్ జారీ చేశారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందన్న చర్చ జరుగుతోంది.

# మమతా బెనర్జీ కారుపై దాడి

- 'దొంగ', 'దొంగల రాణి' అంటూ నినాదాలు
- టిఎంసి కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తుండగా ఉద్రిక్తత



కోల్‌కతా : తృణమూల్ కాంగ్రెస్ అధినేత, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి చేదు అనుభవం ఎదురైంది. మరణించిన ఒక టిఎంసి కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించడానికి ఉత్తర 24 పరగణాల జిల్లాలోని హాలిసహర్ వద్దకు మమతా బెనర్జీ వెళ్తుండగా, ఆదివారం నాడు నిరసనకారులు ఆమె వాహనాన్ని చుట్టుముట్టి 'దొంగ', 'దొంగల రాణి' అంటూ నినాదాలు చేశారు. ఆమె కారుపై బురద, చెప్పులు, రాళ్లు విసిరారు. పోలీసు కస్టడీలో మరణించాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక టిఎంసి కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన బెనర్జీ, పోలీసుల బారికేడ్ల గుండా వెళ్లవలసి వచ్చింది. ఈ నిరసనతో ఆ రహదారి కాసేపు ఉద్రిక్త రాజకీయ వేదికగా మారింది. ఇరు పక్షాలు కుట్ర, రెచ్చగొట్టడం, పరిపాలనా వైఫల్యం వంటి ఆరోపణలు చేసుకున్నాయి. 'నా కారుపై రాళ్లు, చెప్పులు, బురదతో దాడి చేసినట్లు సమాచారం. 'ఇది పూర్తిగా కుట్రే. నేను వస్తున్నానని పోలీసులకు ముందే తెలియజేశాను, అయినప్పటికీ ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోలేదు' అని ఆ ప్రాంతానికి చేరుకున్న తర్వాత బెనర్జీ విలేకరులతో అన్నారు. తన వాహనంపై పెద్ద ఇటుకలు కూడా విసిరారని మాజీ ముఖ్యమంత్రి ఆరోపించారు. 'నా తల పగిలిపోయి ఉండేది. నేను ఇక్కడే చనిపోయి ఉండేదాన్ని' అని తనను లక్ష్యంగా చేసుకోవడానికి బిజెపి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం గూండాలను వాడుకుంటోందని ఆరోపించారు. పోలీసులపై తనకు ప్రత్యేకంగా కోపం ఏమీ లేనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బలగాలను ఉపయోగిస్తున్నారని ఆరోపిస్తూ, బెనర్జీ ముఖ్యమంత్రి, హోం మంత్రి సువేందు అధికారిపై కూడా విమర్శలు గుప్పించారు. పోలీసులు గూండాలను కాపాడుతున్నారని, బెంగాల్ గూండాల చేతుల్లోకి వెళ్లిపోయిందని విమర్శించారు. ఈ విషయాన్ని తమ పార్టీ చట్టపరంగా ముందుకు తీసుకువెళ్తుందని ఆమె తెలిపారు. అయితే, ఉద్రిక్తతలను రెచ్చగొట్టడానికే బెనర్జీ కాంచరపారాకు వచ్చారని బిజెపి ఆరోపించింది. ఆమె రాకను స్థానిక ప్రజలు నిరసించారని కూడా పేర్కొంది. పశ్చిమ బెంగాల్‌లో రోజురోజుకు పెరుగుతున్న ప్రతికూల రాజకీయ వాతావరణానికి ఈ ఘర్షణ మరింత ఆజ్యం పోసింది. ఇటీవలి పర్యటనల సందర్భంగా బెనర్జీ, సీనియర్ టిఎంసి నాయకులు అక్కడి ప్రజల నిరసనలను ఎదుర్కొన్నారు. జూన్‌లో కలకత్తా హైకోర్టు ప్రాంగణం నుంచి బయటకు వస్తుండగా బెనర్జీ 'దొంగదొంగ' నినాదాలను ఎదుర్కొన్న రెండు నెలల తర్వాత ఈ తాజా సంఘటన జరిగింది. అదే నెలలో సోనార్‌పూర్ పర్యటన సందర్భంగా ఆమె మేనల్లుడు, టిఎంసి జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. ఆ సమయంలో నిరసనకారులు ఆయన కాన్వాయ్‌పై గుడ్లు విసిరి, ఇలాంటి నినాదాలే చేశారని ఆరోపణలు ఉన్నాయి. బెనర్జీ ఆదివారం ఆ కుటుంబాన్ని పరామర్శించి, శాంతిభద్రతలు క్షీణించడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతిస్తోందని ఆరోపించారు. ఇదిలా ఉండగా, వీధుల్లో ప్రజల ప్రతిచర్య ఆమె పర్యటనలోని రాజకీయ ప్రాముఖ్యతను మరింత పెంచింది. ఆమె వాహనం ఆ ప్రాంతం గుండా వెళుతుండగా, నిరసనకారులు దాని చుట్టూ గుమిగూడారు. దీంతో భద్రతా సిబ్బంది మానవ కవచంలా ఏర్పడాల్సి వచ్చింది. బెనర్జీకి వ్యతిరేకంగా నినాదాలు మారుమోగుతుండగా, వాహనంపై బురద, పాదరక్షలు పడ్డాయి.

## రన్‌వే నుంచి అదుపుతప్పిన శిక్షణ విమానం

**పుణె :** శిక్షణ విమానానికి ప్రమాదం తప్పింది. మహారాష్ట్రలో పుణె జిల్లాలో ఉన్న బారామతి ఎయిర్‌స్ట్రిప్‌లో శిక్షణ విన్యాసాల సందర్భంగా, ఒక ప్రైవేట్ ఏవియేషన్ అకాడమీకి చెందిన శిక్షణా విమానం ఆదివారం రన్‌వే నుండి పక్కకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పోలీసులు చెప్పారు. ఇదిలా ఉండగా, ఈ ఏడాది జనవరి 28న, అప్పటి ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, మరో నలుగురు ప్రయాణిస్తున్న ఒక ప్రైవేట్ చార్టర్ విమానం బారామతి ఎయిర్‌స్ట్రిప్ సమీపంలో కూలిపోవడంతో అందులో ఉన్నవారందరూ మరణించారు. తాజాగా కార్వర్ ఏవియేషన్‌కు చెందిన విటిసెక్స్ విమానం, ఒక పైలట్, ఒక క్యాడెట్‌తో కలిసి, బారామతి ఎయిర్‌ఫీల్డ్ శిక్షణ విన్యాసాల సందర్భంగా రన్‌వే నుండి పక్కకు దూసుకెళ్లిందని పోలీసు అధికారులు తెలిపారు. విన్యాసాల సమయంలో, రన్‌వేపై టాక్సీయింగ్ చేస్తున్నప్పుడు విమానాన్ని నిర్దేశిత ప్రదేశంలో ఆపలేకపోయారు. ఫలితంగా, అది రన్‌వే చివరను దాటి సుమారు 20 అడుగుల దూరం వెళ్లి పచ్చిక ప్రాంతంలోకి ప్రవేశించిందని వారు చెప్పారు. సర్క్యూట్, ల్యాండింగ్ అత్యవసర విన్యాసాల కోసం ఆ విమానం రన్‌వేపైకి వచ్చింది. అది మొదట రన్‌వే 29 ప్రారంభంలో ఆగి, ప్రయత్నాన్ని విరమించుకుంది. ఆ తర్వాత, ఆ విమానం రన్‌వే 11 ప్రారంభంలో ఆగినప్పుడు, అక్కడ కూడా మరో ప్రయత్నాన్ని విరమించుకుందని ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. 'ఈ విన్యాసాల సమయంలో, విమానాన్ని రన్‌వేపై పూర్తిగా ఆపలేకపోయారు. అది రన్‌వే ప్రారంభాన్ని దాటి ముందుకు వెళ్లింది. తదనంతరం, అది రన్‌వే 29 ప్రారంభాన్ని దాటి కుడి వైపున ఉన్న విస్తరించిన పేవ్డ్ ఉపరితలం నుండి పక్కకు మళ్లింది. ఎటువంటి గాయాలు సంభవించలేదు' అని ఆ అధికారి తెలిపారు. మే 13న, మరో ప్రైవేట్ కంపెనీకి చెందిన శిక్షణా విమానం సాంకేతిక లోపం కారణంగా బారామతి ఎయిర్‌స్ట్రిప్ సమీపంలో కూలిపోయింది. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

## ఎఫ్‌సిఆర్ఎ బిల్లును వ్యతిరేకిస్తాం

- ప్రశ్నలు ఎదుర్కోవాల్సి వస్తుందన్న భయంతోనే మోదీ, షాలు సభలకు రావడం లేదు : కెసి వేణుగోపాల్



**అలప్పుజ :** ప్రతిపాదిత ఎఫ్‌సిఆర్ఎ బిల్లును కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెడితే, కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తాయని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ అన్నారు. నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల సమయంలో విద్యార్థులపై బలప్రయోగం చేయడంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమాధానం చెప్పాల్సిందేనన్న తమ డిమాండ్‌ను మరోసారి ఆయన లేవనెత్తారు. ప్రశ్నలను ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతో ప్రధాని నరేంద్ర మోదీ, షా తప్పించుకుంటున్నారని, పార్లమెంటుకు హాజరు కావడం లేదని ఆరోపించారు. ఆదివారం వేణుగోపాల కేరళలోని అలప్పుజలో విలేకరులతో మాట్లాడారు. 'ఈ రెండు మూడు రోజుల్లో విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లును ఏదో ఒకటి తయారు చేసి ప్రవేశపెట్టవచ్చని కేంద్ర ప్రభుత్వం భావిస్తే, ఆ కోరికను తమలోనే ఉంచుకోవాలి' అని ఆయన సూచించారు. ప్రతిపాదిత చట్టం మైనారిటీలను, ఎన్‌జిఒలను లక్ష్యంగా చేసుకుందని, దానిని ఆమోదించనివ్వమని ప్రతిపక్షాలు చెబుతున్నాయని వేణుగోపాల్ ఆరోపించారు. తమ నిరసనను అణచివేయడానికి తమపై పెల్లెట్ గన్లు, లాఠీ ఛార్జీలు, టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించాలని ఎవరు ఆదేశించారని భారతదేశంలోని విద్యార్థులు కీలకమైన ప్రశ్న అడిగినప్పుడు, అమిత్ షా దానికి సమాధానం చెప్పడానికి ముందుకు రావడం లేదని మండిపడ్డారు. 'అమిత్ షా ఈ ప్రజా వ్యతిరేక బిల్లును ఆమోదింపజేసినా కూడా, ఆయన పార్లమెంటులో తీవ్ర నిరసనలను ఎదుర్కోవలసి వస్తుందనడంలో సందేహం లేదు. ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధం, ప్రజా వ్యతిరేకం. ఇటువంటి ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ విరుద్ధమైన బిల్లును ఆమోదించడానికి మేము అనుమతించము' అని వేణుగోపాల్ అన్నారు. ఎఫ్‌సిఆర్ఎ కింద నిధులు పొందుతున్న ఎన్‌జిఒలపై ప్రతిపాదిత ఆంక్షలను వ్యతిరేకిస్తూనే, ఆర్ఎస్ఎస్‌తో సంబంధం ఉన్న సంస్థలు విదేశీ నిధులు పొందుతున్నాయనే ఆరోపణలను కూడా ఆయన ప్రశ్నించారు. ఎఫ్‌సిఆర్ఎ కింద చట్టబద్ధంగా పనిచేస్తున్న సంస్థలను ప్రతిపాదిత చట్టం లక్ష్యంగా చేసుకుంటుందని ఆరోపిస్తూ, ఆర్ఎస్ఎస్‌ను నియంత్రించడానికి ప్రయత్నించండి అని వేణుగోపాల్ సవాల్ విసిరారు. ప్రతిపాదిత డీలిమిటేషన్ బిల్లుపై వేణుగోపాల్ మాట్లాడుతూ, జనాభా నియంత్రణ చర్యలను విజయవంతంగా అమలు చేసిన రాష్ట్రాలపై ఇది ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. జనాభా నియంత్రణలో అనేక దక్షిణాది రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాలు, పంజాబ్, ఒడిశా పాఠాలు నేర్చుకున్నాయని, భారతదేశ సమగ్రత పట్ల శ్రద్ధ వహించే ప్రభుత్వం ఇటువంటి చట్టాన్ని ప్రవేశపెడుతుందా అని ఆయన ప్రశ్నించారు. నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనపై పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త టి.జి. మోహన్‌దాస్‌ను అరెస్టు చేయడంలో జరుగుతున్న జాప్యం గురించి అడగ్గా, ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ఆ తర్వాత దర్యాప్తు జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వేణుగోపాల్ అన్నారు.

# బయోమెడికల్ వ్యర్థాల 'లోతైన పూడ్చివేత'లో...

- 17రాష్ట్రాలు, యుటిలు నిబంధనల ఉల్లంఘన
- ఎన్‌జిటికి 'సిపిసిబి' నివేదిక



**న్యూఢిల్లీ :** బయో మెడికల్ వ్యర్థాల పారవేతకు సంబంధించిన కొన్ని నిబంధనలను పాటించని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలపై చర్యలు తీసుకుంటామని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డ్ (సిపిసిబి) జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు తెలియజేసింది. చికిత్సా కేంద్రాల ద్వారా బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ, శుద్ధి, పారవేతలో జరుగుతున్న ఉల్లంఘనలకు సంబంధించిన ఒక విషయాన్ని పర్యావరణ సంస్థ విచారిస్తోంది. ఆగస్టు 5వ తేదీన జారీచేసిన ఒక ఉత్తర్వులో ఎన్‌జిటి చైర్‌పర్సన్ జస్టిస్ ప్రకాష్ శ్రీవాస్తవ, నిపుణ సభ్యుడు అఫ్రోజ్ అహ్మద్‌లతో కూడిన ధర్మాసనం, దేశంలోని 17రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఆచరణలో ఉన్న బయోమెడికల్ వ్యర్థాలను 'లోతుగా పూడ్చిపెట్టడానికి' సంబంధించి సిపిసిబి ఆగస్టు 5వ తేదీన ఒక నివేదికను దాఖలు చేసిందని తెలిపింది. బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ నియమాల ప్రకారం..వ్యర్థాలను లోతుగా పూడ్చిపెట్టడం అనేది ఒక పరిమితమైన పారవేసే పద్ధతిగానే మిగిలిపోయింది. ఉమ్మడి బయో మెడికల్ వ్యర్థాల శుద్ధి కేంద్రం అందుబాటులో లేని గ్రామీణ లేదా మారుమూల ప్రాంతాలలో మాత్రమే ఇది అనుమతించబడుతుంది. ఇటువంటి పద్ధతికి నిర్దేశిత రాష్ట్ర అధికార సంస్థ నుంచి ముందస్తు అనుమతి అనవసరం ఉంటుంది.లోతైన ఖననాన్ని ఉపయోగిస్తున్న 9,178 ఆరోగ్య సంరక్షణ కేంద్రాలలో(హెచ్‌సిఎఫ్‌లు), కేవలం 5,715 మాత్రమే ప్రామాణిక నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయని ట్రిబ్యునల్ పేర్కొంది. ఖనన గుంతకు 6మీటర్ల దిగువన కనీస భూగర్భ జల మట్టాన్ని నిర్వహించడంలో వైఫల్యం(477 హెచ్‌సిఎఫ్‌లు నిబంధనలకు అనుగుణంగా లేవు), నిర్దేశిత అధికారుల నుంచి సరైన అధికారం లేకుండా పనిచేయడం (341 హెచ్‌సిఎఫ్‌లు) వంటివి అత్యంత తరచుగా జరిగే ఉల్లంఘనలలో ఉన్నాయి. సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత రాష్ట్రాలు వివిధ పారామీటర్ల విషయంలో నిబంధనలను పాటించడంలో గణనీయమైన లోపాలను కలిగి ఉన్నాయని నివేదిక వెల్లడించిందని పేర్కొంది. ఉదాహరణకు ఉత్తర్ ప్రదేశ్, రాజస్థాన్‌లలో వరుసగా మొత్తం 111, 33 ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు హెచ్‌సిఎఫ్‌లు, నిబంధనలను పాటించడం లేదు. ట్రిబ్యునల్ ఇలా పేర్కొంది.'సిపిసిబి' తరపున హాజరైన న్యాయవాది, ప్రస్తుతం ఉల్లంఘనలకు పాల్పడిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన సంబంధిత రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డులు (పిసిబిలు), కాలుష్య నియంత్రణ కమిటీలకు (పిసిసిలు) సమాచారాలు పంపబడినాయని, నిబంధనల పాటింపు ఉంటే 8 వారాలలోగా పూర్తి చేయని పక్షంలో, పర్యావరణ (పరిరక్షణ) చట్టం, 1986 చట్టంలోని సెక్షన్ 5 కింద ఆదేశాలు జారీ చేయబడతాయి'. ఈనిబంధన పారిశ్రామిక కార్యకలాపాలను నియంత్రించడం లేదా నిలిపివేయడం, వినియోగ సేవలను రద్దు చేయడంతో సహా కట్టుబడి ఉండే ఆదేశాలను జారీచేయడానికి కేంద్రానికి అమలు అధికారాలను కల్పిస్తుంది. ఈ ఉత్తర్వులో, అక్టోబరులో జరిగే తదుపరి విచారణ తేదీకి ఒక వారం ముందుగా మరో పురోగతి నివేదికను దాఖలు చేయాలని ట్రిబ్యునల్ సిపిసిబిని ఆదేశించింది.

## రక్తదానాన్ని ఒక సంస్కృతిగా మార్చాలి

రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పిలుపు

**న్యూఢిల్లీ :** 'ఆపరేషన్ సిందూర్' దేశ సాయుధ దళాల అసమాన శౌర్యాన్ని ప్రదర్శించిందని, తన పౌరుల భద్రతను నిర్ధారించడానికి భారతదేశం ఎంతకైనా వెళుతుందనే సందేశాన్ని యావత్ ప్రపంచానికి పంపింది అని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆయన ఆదివారం దేశ రాజధాని ఢిల్లీలోని 'బేస్' హాస్పిటల్‌లో జరిగిన ఒక కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్రవాదులను, వారి హ్యాండ్లర్లను ఏరివేసి, భారతదేశంపై కన్నెత్తి చూడటానికి సాహసించిన వారు తీవ్ర పరిణామాలను ఎదుర్కొనేలా చేసినందుకు రాజ్‌నాథ్‌సింగ్ రక్షణ దళాలను ప్రశంసించారు. ఘోరమైన పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత సాయుధ దళాలు మే, 2020లో ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించాయి.'మన మహిళలు ధరించిన సిందూర్‌ను కాపాడుకుంటూనే, తమ పౌరుల భద్రతను నిర్ధారించడానికి భారతదేశం ఎంతకైనా వెళుతుందనే సందేశాన్ని ప్రపంచానికి పంపిన 'ఆపరేషన్ సిందూర్', మన రక్షణ దళాల అసమానమైన శౌర్యాన్ని ప్రదర్శించింది' అని ఇక్కడ బేస్ హాస్పిటల్‌లో 'సిందూర్ మహా రక్తదాన్' పేరుతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. మెగా రక్తదాన శిబిరంతో పోలుస్తూ, అది కరుణకు ప్రతీక అని, ఆపరేషన్ సిందూర్ ధైర్యాన్ని ప్రదర్శిస్తుందని రక్షణ శాఖ మంత్రి నొక్కిచెప్పారు. ఈ శిబిరంలో పాల్గొన్న దాతలలో మహారాష్ట్రకు చెందిన 1,000మంది మల్లయోధులు, క్రీడాకారులు ఉన్నారని, వీరు నిస్వార్థ సేవా స్ఫూర్తిని, సాయుధ దళాల పట్ల సంఘీభావాన్ని ప్రదర్శించారని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

## ఎస్‌సి, ఎస్‌టి కోటాల్లో క్రీమీలేయర్ విధించొద్దు

- రిజర్వేషన్లు వారి సామాజిక పరివర్తన, ఆర్థిక విముక్తి, ఆత్మగౌరవానికి ముడిపడి ఉన్నాయి
- బిఎస్‌పి అధినేత్రి మాయావతి



**లక్నో :** షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల రిజర్వేషన్లలో 'క్రీమీ లేయర్' భావనను బిఎస్‌పి అధినేత్రి మాయావతి వ్యతిరేకించారు. రిజర్వేషన్లు వారి సామాజిక పరివర్తన, ఆర్థిక విముక్తి, ఆత్మగౌరవానికి ముడిపడి ఉన్నాయని, ఈ అంశాన్ని ఆర్ఎస్ఎస్ రాజకీయం చేస్తోందని ఆమె విమర్శించారు. ఆ మేరకు ఆదివారం యుపి మాజీ ముఖ్యమంత్రి ఎక్స్‌లో పోస్టు చేశారు. రిజర్వేషన్ అనేది ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి వర్గాలకు, ముఖ్యంగా శతాబ్దాలుగా వివక్ష, దోపిడీ, వంచనకు గురైన ఎస్‌సి, ఎస్‌టిలకు అత్యంత ముఖ్యమైన, సున్నితమైన అంశమని అన్నారు. ఈ వర్గాల కోసం 'క్రీమీ లేయర్' గురించి చర్చించడం అనుచితం మాత్రమే కాకుండా, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నాయకత్వంలో రూపొందించిన రాజ్యాంగం 'మానవతా లక్ష్యాలకు' కూడా విరుద్ధమని చెప్పారు. రిజర్వేషన్ అంటే శతాబ్దాలుగా కుల వ్యవస్థకు బాధితులుగా ఉండి, దోపిడీకి, అణచివేతకు, నిర్లక్ష్యానికి, బహిష్కరణకు గురైన లక్షలాది మంది ప్రజలకు మానవతా దృక్పథంతో సమానత్వానికి సంబంధించిన వారి రాజ్యాంగ, చట్టపరమైన హక్కును ఇవ్వడమే అని ఆమె అన్నారు. రిజర్వేషన్లను ఉద్దేశపూర్వకంగా రాజకీయం చేశారని, ఇది సమాజంలో విద్వేషాలను సృష్టిస్తోందని, లబ్ధిదారులు తమ ప్రయోజనాలను స్వచ్ఛందంగా వదులుకోవాలని ఆర్ఎస్ఎస్ అధిపతి మోహన్ భగవత్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను మాయావతి విమర్శించారు. ఆర్ఎస్ఎస్ వైఖరి కులతత్వ మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తోందని, ఇది సంకుచిత రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగపడవచ్చు కానీ రాజ్యాంగ లక్ష్యాలను దెబ్బతీస్తుందని ఆమె అభివర్ణించారు. ఎస్‌సి, ఎస్‌టిలను క్రీమీ లేయర్ పరిధికి వెలుపల ఉంచాలనుకుంటే, ప్రస్తుత ప్రభుత్వం తన వాదనను కోర్టుల ముందు సమర్థవంతంగా వినిపించాలని ఆమె కోరారు. ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని గౌరవించాలని, రిజర్వేషన్ల విధానంలో ఎలాంటి మార్పులకూ మద్దతు ఇవ్వడం మానుకోవాలని మాయావతి హితవు పలికారు. 'బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మానవతా, సంక్షేమ ఆధారిత రాజ్యాంగాన్ని ఆర్ఎస్ఎస్ పూర్తిగా గౌరవిస్తూనే, రిజర్వేషన్లను రాజకీయం చేయడం, రిజర్వేషన్ వ్యవస్థలో ఎలాంటి జోక్యాన్ని సమర్థించడం మానేస్తే బాగుంటుంది' అని ఆమె అన్నారు. సమానత్వ సామాజిక వ్యవస్థను స్థాపించాలన్న రాజ్యాంగ లక్ష్యాన్ని నెరవేర్చడంలో సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు. ఇది ప్రస్తుత అవసరమని ఆమె పేర్కొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
సోమవారం
10-08-2026
www.prajapaksham.in
ప్రపంచం
WORLD NEWS

# నేపాల్‌లో ఎనిమిది పార్టీల 'ప్రోగ్రెసివ్ ఫ్రంట్'

**కాఠ్మండు:** నేపాల్‌లో ఎనిమిది రాజకీయపార్టీలు కలిసి ఒక కొత్త రాజకీయ కూటమిని ఏర్పాటు చేశాయి. ఈ కూటమికి ''ప్రోగెసివ్ ఫ్రంట్''గా నామకరణం చేశాయి. ఉమ్మడి ఎజెండాతోపాటు రాజకీయ సమస్యలను కూడా ఈ ఎనిమిది పార్టీలు ఉమ్మడిగా చేపట్టి దేశ ప్రజల ప్రయోజనాలకోసం పోరాటం చేస్తాయి. శనివారం కాఠ్మండులో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ రాజకీయపార్టీలన్ని కలిసి కొత్త కూటమి గురించి ప్రకటన చేశాయి. జనతా సమాజ్‌వాదీ పార్టీ (జెఎస్‌పి),జనమత్ పార్టీ(జెపి), ఆమ్ జనతాపార్టీ(ఎజెపి), నాగరిక్ ఉన్ముక్తి పార్టీ నేపాల్(ఎన్‌యుపిఎన్) ప్రగతిశీల్ లోక్‌తాంత్రిక్ పార్టీ(పిఎల్‌పి), నేపాల్ సంఘియ సమాజ్‌వాదీపార్టీ(ఎన్‌ఎస్ఎస్‌పి), బహుజన్ సమాజ్‌వాదీపార్టీ నేపాల్(బిఎస్‌పిఎన్),ఝుముువన్ రాష్ట్రీయ మోర్చా(కెఆర్‌ఎం)పార్టీలు కొత్తగా ఏర్పడిన ప్రోగ్రెసివ్ ఫ్రంట్‌లో భాగస్వాములుగా ఉన్నాయి. మధేష్ ఆధారిత పార్టీలు,కొన్ని చిన్న రాజకీయ పార్టీలమధ్య సహకారం,సమన్వయం పెంపొందించుకోవడానికి ప్రయత్నాలు కొనసాగుతున్న చర్యల మధ్య ఈ ఫ్రంట్ ఆవిర్భవించింది. కుల,మత,వర్గ భేదాలు లేకుండా అన్ని రకాల వివక్షలను అంతం చేయడానికి సమానత్వ సాధనకు,న్యాయమైన,సమ్మిళిత,వివక్ష లేని ఏకీకృత సమాజాన్ని ఏర్పాటు చేయడానికి ఈ కొత్త కూటమి పనిచేస్తుందని నిర్వాహకులు ప్రకటించారు. వ్యవస్థీకృత, సమాఖ్య, ప్రజాస్వామ్యయుత,గణతంత్ర ప్రభుత్వవ్యవస్థను దేశంలో అభివృద్ధి చేసేందుకు ఈ ప్రోగ్రెసివ్ ఫ్రంట్ కృషి చేస్తుంది. దేశంలో జనాభా ప్రాతిపదికపై చట్టసభలో ప్రాతినిధ్యం లభించేవిధంగా భరోసా కల్పించేందుకు కృషి చేస్తుంది. దేశంలో అన్ని రకాల దోపిడీలు,అసమానతలు,మధేష్‌లకు వ్యతిరేకంగా పాటించే వివక్షను అంతం చేసేందుకు ఈ కూటమి పాటుపడుతుంది. వివిధ ఆదివాసీ జాతులు, దళితులు, మహిళలు, థరు, ముస్లింలు, వెనుకబడిన తరగతులు, లైంగిక మైనారిటీలపై జరిగే వివక్ష దోపిడీలకు వ్యతిరేకంగా ఈ కూటమి పోరాటం చేస్తుంది. పార్లమెంటులో ఈ కూటమికి ఎలాంటి ప్రాతినిధ్యం లేకపోయినప్పటికీ, పోరాటాల ద్వారా నేపాల్ రాజకీయ రంగంపై ఈ కూటమి తనదైన ప్రభావం చూపిస్తుందని నిపుణులు అంచనావేస్తున్నారు. నేపాల్‌లోని కోసి,మధేష్ రాష్ట్రాలలో మత ఘర్షణలు చెలరేగిన కొద్ది రోజులకే వారి రక్షణకోసం ఈ కొత్త కూటమి ఆవిర్భవించింది.

# అమెరికాతో చర్చలు జరగడం లేదు: అరాఘ్చీ

- మధ్యవర్తులతో సందేశాల మార్పిడి చర్చలు కాదు
- ఇరాన్–ఒమన్ సారథ్యంలో కొత్త జలమార్గాల ఏర్పాటు



**టెహ్రాన్:** అమెరికాతో ఇరాన్ ప్రస్తుతం ఎలాంటి చర్చలు ఏ స్థాయిలోనూ జరపడంలేదని ఇరాన్ విదేశీవ్యవహారాలమంత్రి అబ్బాస్ అరాఘ్చీ స్పష్టం చేశారు. రెండు దేశాలమధ్యా బహిరంగంగా మాటల యుద్ధం జరుగుతున్నప్పటికీ అంతర్గతంగా తెర వెనుక సంభాషణలు కొనసాగుతున్నాయన్న వార్తలను ఆయన తీవ్రంగా ఖండించారు. మధ్యవర్తుల ద్వారా ఇరు దేశాలమధ్యా సందేశాల మార్పిడి జరుగుతోందని, కానీ ఈ ప్రక్రియను చర్చలు అని పిలవకూడదని అన్నారు. శత్రుపక్షం (అమెరికా) 'ఇస్లామాబాద్ ఒప్పందాన్ని' ఉల్లంఘించడం ముగించే వరకూ, ఇప్పటివరకూ చేసిన ఉల్లంఘనలకు పరిహారం చెల్లించేవరకూ చర్చలు పునఃప్రారంభమయ్యే అవకాశం లేదని చెప్పారు. ఇరాన్ కొత్త షరతులు విధించిందని, ఈ షరతులను మధ్యవర్తుల ద్వారా అమెరికాకు తెలియజేశామన్నారు.
ప్రస్తుతం ఎలాంటి చర్చలూ జరగడంలేదని అరాఘ్చీ ఆదివారం మొహర్రం–అషూరా కార్యక్రమం సందర్భంగా పాత్రికేయులకు చెప్పారు.చేసుకున్న ఒప్పందానికి అమెరికా కట్టుబడి ఉండకుండా ఉల్లంఘనలకు పాల్పడిందని విమర్శించారు. కట్టుబాట్లను వదిలిపెట్టి అమెరికా ఇష్టానుసారంగా వ్యవహరించినంతకాలం ఆ దేశంలో ఎలాంటి చర్చలకు అవకాశం లేదని చెప్పారు.అమెరికా తక్షణం ఒప్పంద కట్టుబాట్ల ఉల్లంఘన చర్యలు నిలిపివేయాలని, యుద్ధంవల్ల ఇరాన్‌కు కలిగిన తీవ్ర నష్టానికిగాను పరిహారం చెల్లించాలని అప్పటివరకూ చర్చలు ఉండబోవన్నారు. ఐతే రెండు దేశాలను ఒకచోటకు చేర్చి చర్చలు జరిపేలా చూసేందుకు మధ్యవర్తిదేశాలు ఇప్పటికీ తమవంతు కృషి చేస్తున్నాయని చెప్పారు. ఇరాన్‌పై అమెరికా అక్రమంగా రుద్దిన యుద్ధం ముగించేందుకు ఇరు పక్షాల అంగీకారంతో జూన్ 18వ తేదీన 14 అంశాలతో కూడిన అవగాహన ఒప్పందం ''ఇస్లామాబాద్ ఒప్పందం'' కుదిరింది. ఆ తర్వాత హోర్ముజ్ జలసంధి జలమార్గాల విషయంలో తగాదా ప్రారంభం కావడంతో ఒప్పందాన్ని రద్దుచేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ ఒప్పందాన్ని ట్రంప్ అనేకసార్లు ఉల్లంఘించారు.
కాగా హోర్ముజ్ జలసంధి నిర్వహణపై ఒమన్‌తో చర్చలు పురోగతిలో ఉన్నాయని, ఈ మేరకు కొత్త జలమార్గాలు ఏర్పాటు చేస్తామని, నౌకలు వెళ్ళేందుకు, వచ్చేందుకు ఇరు దేశాల ప్రాదేశిక జలాల నుండి ఈ మార్గాలు ఉంటాయని, ఈ కొత్త పటాలపై కసరత్తు జరుగుతోందని అబ్బాస్ అరాఘ్చీ ప్రకటించారు. ఐతే ఈ ఒప్పందానికి చేరువకావడమంటే జలసంధిని తెరుస్తున్నట్లు అర్థం కాదని, ఇతర షరతులను కూడా నెరవేర్చడంపైనే జలసంధి తెరుచుకోవడం ఆధారపడి ఉంటుందని చెప్పారు.

### మాది మానవత్వ దౌత్యం

ఇరాన్ చేస్తున్నది మానవత్వ దౌత్యమని అబ్బాస్ అరాఘ్చీ అన్నారు. అన్యాయం, అమానుషత్వం అనే తుఫానుకు వ్యతిరేకంగా ఇరాన్ దృఢంగా నిలబడిందని, ఇదే మార్గంలో త్యాగాలతో ముందుకు సాగుతుందన్నారు. స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడానికి సైద్ధాంతిక వ్యూహాత్మక అవగాహనతో ఇరాన్ అన్ని రకాల ఒత్తిడులను ఎదుర్కొంటున్నదన్నారు. ఇస్లామిక్ విప్లవోద్యమ నాయకుడు ఆయతొల్లా అలీ ఖమేనీకి ఇచ్చిన వాగ్దానానికి తాము కట్టుబడి పనిచేస్తున్నామన్నా రు. అన్యాయంగా మేం రక్తాన్ని చిందించాం, దీనిని మరచిపోలేం, న్యాయంకోసం పోరాడే వృక్షం భూమిలో మరింత బలంగా నాటుకుపోతుందని విస్మరించకూడదన్నారు. ఇరాన్ సంకుచిత అవకాశవాది కాదని, తమ దేశం చేస్తున్నది మానవత్వ దౌత్యమని అన్నారు.

## ట్రంప్ 15 సూత్రాల గాజా ప్రణాళికను తిరస్కరించిన నెతన్యాహూ



**జెరూసలెం:** హమాస్ నిరాయుధీకరణకు సంబంధించి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని గాజా శాంతి మండలి ప్రకటించిన 15 సూత్రాల ప్రణాళికను ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ తిరస్కరించారు. హమాస్ ఉగ్రవాద సంస్థ ఆయుధాలు పూర్తిగా వదిలిపెట్టి స్వాధీనం చేసేవరకూ ఇజ్రాయెల్ తన బలగాలను గాజా ప్రాంతాల నుండి ఉపసంహరించుకోబోదని స్పష్టం చేశారు. ఆదివారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో నెతన్యాహూ మాట్లాడుతూ, 15 సూత్రాల ప్రణాళిక పత్రాన్ని తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు.గాజా ప్రణాళికపై బ్రహ్మాండమైన పురోగతి సాధించామని గతనెలలో ట్రంప్ ప్రకటించారు. నిరాయుధీకరణకు హమాస్ అంగీకరించిందని చెప్పారు. ఒకవైపు హమాస్ ఆయుధాలు స్వాధీనం చేస్తుంటే మరోవైపు ఇజ్రాయెల్ కూడా దశలవారీగా గాజా నుండి సైన్యాలను ఉపసంహరిస్తుందని ట్రంప్ చెప్పారు. ఐతే శనివారం తాజాగా హమాస్ ఒక ప్రకటన చేస్తూ, ట్రంప్ ప్రతిపాదించిన గాజా ప్రణాళికకు తాము ఇంకా కట్టుబడి ఉన్నామని తెలియజేసింది. ఇజ్రాయెల్ ఎన్నికలు దగ్గరపడిన తరుణంలో, ఈ గాజా ఒప్పందంపై ప్రతిపక్షం నుండి నెతన్యాహూకు తీవ్ర వ్యతిరేకత ఎదురవుతున్నది.
వాస్తవ ప్రాతిపదికపై హమాస్ ఉగ్రవాద సంస్థ ఆయుధాలు పూర్తిగా వదిలిపెట్టిన తర్వాతే సైనిక ఉపసంహరణ జరుగుతుందని ట్రంప్ పేర్కొంటూ ఈ 15 సూత్రాల గాజా ప్రణాళికను ట్రంప్ ప్రకటించారు. గాజాలో హమాస్,ఇతర సాయుధ గ్రూపుల నిరాయుధీకరణకు సంబంధించి ఒక ఒప్పందానికి వచ్చినట్లు ట్రంప్ శాంతి మండలి గతంలోనే ప్రకటించింది. ఐతే ఇజ్రాయెల్ అన్ని రకాల దురాక్రమణలను నిలిపివేయాలని,గాజా నుండి సైనిక బలగాలను ఉపసంహరించుకోవాలని అప్పుడే తమ వద్ద ఉన్న విలువైన,భారీ ఆయుధాలను స్వాధీనం చేయడానికి వీలు కలుగుతుందని హమాస్ ప్రకటించింది. గత ఏడాది అక్టోబరులో గాజాలో కాల్పుల విరమణకు హమాస్–ఇజ్రాయెల్ మధ్య ఒప్పందం కుదిరింది. ఐనప్పటికీ కూడా గాజాలో పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి.

## అభివృద్ధిలో అగ్రస్థానం


(మొదటి పేజీ తరువాయి)

తదితర రంగాలకు వినియోగిస్తున్నామని చెప్పారు. ఇంది రా గిరి జల వికాసం ద్వారా గిరిజన రైతుల భూములకు సాగునీరు అందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తె లిపారు. సౌరశక్తి, సోలార్ పంపుల వినియోగాన్ని పెంచడంతో పాటు తోటలు, ప్రత్యామ్నాయ పంటలు, భూమి ఉ త్పాదకత పెంపునకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

### అడవి.. ఆదివాసీకి తల్లి లాంటిది..

ఆదివాసీలకు అడవి కేవలం ప్రకృతి సంపద కాదని, జీవనాధారం, సంస్కృతికి మూలం, భవిష్యత్తుకు భరోసా అని మంత్రి అన్నారు. ఆదివాసీఅడవి బంధం చెట్టుమనిషి సంబంధం కాదు, తల్లిబిడ్డ అనుబంధం అని పేర్కొన్నారు. అడవిని కాపాడుకుంటూనే అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీ సమాజం, గిరిజన సంక్షేమం, విద్య, సంస్కృతి, హక్కుల పరిరక్షణ తదితర రంగాల్లో విశిష్ట సేవలు అందించిన తొమ్మిది మంది ప్రముఖులు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఆదివాసీ కళా సంస్కృతులకు సంబంధించిన ప్రదర్శనలు, ఆట పాటలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.ఎం.సంతోష్ మాట్లాడుతూ అటవీ హక్కుల పరిరక్షణ, విద్యాభివృద్ధి, ఆరోగ్యం, మహిళా సాధికారత, ఆర్థికాభివృద్ధి, సంస్కృతిసంప్రదాయాల పరిరక్షణకు శాఖ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మాజీ ఎంపి రవీంద్ర నాయక్ మాట్లాడుతూ మైదాన ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులకు జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, మాజీ ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, టిజిటిడబ్ల్యుఆర్ఇఐఎస్ సెక్రటరీ సీతాలక్ష్మి , ఎంపి బలరాం నాయక్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ సర్వేశ్వర రెడ్డి, ట్రైబల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సముజ్వల, మ్యూజియం క్యురేటర్ డాక్టర్ డి. సత్యనారాయణ, ట్రైబల్ వెల్ఫేర్ చీఫ్ ఇంజనీర్ ఎం. బాలు, ట్రైకార్ జిఎం శంకర్ రావు, జిఎం జిసిసి ప్రతాప్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, కళాకారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ట్రంప్ బాల్‌రూమ్ ప్రాజెక్టుకు కోర్టులో ఎదురుదెబ్బ




**వాషింగ్టన్:** వైట్‌హౌస్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 400 మిలియన్ డాలర్లతో తలపెట్టిన బాల్‌రూమ్ ప్రాజెక్టును ఫెడరల్ అప్పీల్ కోర్టు నిలిపివేసింది. దేశంలో గెలిచిన ప్రతి అధ్యక్షుడు వై ట్‌హౌస్‌లో తాత్కాలిక నివాసి మాత్రమే త ప్ప, శాశ్వత అధికారి కాదు, యజమాని కా దు'' అని న్యాయస్థానం స్పష్టం చేసింది. భూగర్భంలో నిర్మాణ పనులకు అనుమతి ఇస్తూనే భూమిపైన మాత్రం పనులకు కాం గ్రెస్ అనుమతి కావాలని స్పష్టం చేసింది.
ఒక భారీ బాల్‌రూమ్‌ను నిర్మించాలా? వద్దా? అనే విషయంపై అమెరికా అత్యున్నత చట్టసభ కాంగ్రెస్ తీసుకోవాల్సిన నిర్ణయమేగానీ, కార్యనిర్వాహకవర్గం తీసుకోవాల్సిన నిర్ణయం కాదని అప్పీల్‌కోర్టు న్యాయమూర్తులలో మెజార్టీ వర్గం తీర్పు స్పష్టం చేసింది. దీంతో, ఎట్టిపరిస్థితుల్లోనూ బాల్‌రూమ్ ప్రాజెక్టును పూర్తిచేస్తానని ట్రంప్ ప్రతిజ్ఞచేశారు. ఈ విషయాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేస్తానని ప్రకటించారు. కాంగ్రెస్ అనుమతి లేకుండానే ట్రంప్ కార్యనిర్వాహకవర్గం గత సంవత్సరంలో ఈస్ట్‌వింగ్ భవంతి ప్రాంతాన్ని బాల్‌రూమ్ నిర్మాణం నిమిత్తం కూల్చివేసింది. దీంతో జాతీయ చారిత్రక ప్రదేశాల పరిరక్షణ ధార్మికసంస్థ కోర్టులో కేసు వేసి గెలిచింది. ఆ తర్వాత ఈ తీర్పును ఇప్పుడు అప్పీల్ కోర్టు కూడా సమర్థించింది. దీంతో సుప్రీంకోర్టుకు వెళతానని ట్రంప్ చెబుతున్నారు.''వైట్‌హౌస్ అనేది ప్రజల భవనం, ఈ భవానాన్ని ఇష్టానుసారంగా కార్యనిర్వాహకవర్గం కూల్చివేసి కొత్త నిర్మాణాలు చేయలేదు. దీనికి కాంగ్రెస్ అనుమతి కావాలి, ఎలాంటి నియంత్రణలు లేకుండా ప్రభుత్వానికి కాంగ్రెస్ అనుమతులు ఇవ్వలేదు,కాబట్టి ట్రంప్ నిర్ణయం చెల్లదు'' అని అప్పీలుకోర్టు జ్యూరీలో మెజార్టీ సభ్యులు ప్రకటించారు.

## చర్చలు విఫలం

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థి సంఘం జెపిఎస్‌సి,జెఎస్‌సి సంస్కరణల మంచ్ ఈ నిరసనకు నాయకత్వం వహిస్తోంది. వామపక్షాల మద్దతుగల విద్యార్థి సంఘం ''ఐసా'' తరపున ఐదుగురు విద్యార్థి ప్రతినిధులు కూడా ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో పాల్గొన్నారు. 14వ జెపిఎస్‌సిని రద్దు చేయడంతో పాటు అన్ని పరీక్షల్లో అవకతవకలపై సిబిఐ దర్యాప్తు చేయాలని,ఈ దర్యాప్తు నివేదికను బాహాటంగా ప్రకటించాలని, నేరస్థులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. గత ఏడాది అక్టోబరులో సిఐడి అరెస్టు చేసిన ఆర్థికశాఖ సెక్షన్ అధికారి,ఈ లీకేజీ వ్యవహారాన్ని బట్టబయలు చేసిన సంతోష్ కుమార్ మస్తానాపై సస్పెన్షన్ ఎత్తివేయాలని,ఆయనపై బనాయించిన కేసులు రద్దు చేయాలని కూడా విద్యార్థి ప్రతినిధులు చర్చల్లో కోరుతున్నారు. ప్రస్తుతం జార్ఖండ్ హైకోర్టు ఆయనకు బెయిలు మంజూరు చేసింది.
విద్యార్థులు చర్చల్లో లేవనెత్తిన సమస్యల్లో 98 శాతం డిమాండ్లను పరిష్కరించామని, ఐతే జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జెఎస్‌ఎస్‌సి),సిజిఎల్ (కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ లెవెల్) పరీక్షలలో అవకతవకలపై సిబిఐ దర్యాప్తు చేసేందుకు ఆ రాష్ట్ర సాంకేతిక,ఉన్నత విద్యాశాఖామంత్రి సుదివ్య కుమార్ తిరస్కరించారు. ఈ విషయానికి సంబంధించిన విచారణ హైకోర్టు,సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరిగిందని, అందువల్ల తాము సిబిఐ విచారణ జరిపించే పరిస్థితుల్లో లేమని మంత్రి ప్రకటించారు. కానీ విద్యార్థులు మాత్రం సిబిఐ విచారణ జరిపించాల్సిందేనని గట్టి పట్టుపట్టారు. ఈ డిమాండ్ పరిష్కారం కాకపోవడంతో సోమవారం అసెంబ్లీ వరకూ తలపెట్టిన ప్రదర్శన యథాతథంగా కొనసాగుతుందని ప్రదర్శకులు ప్రకటించారు. పరీక్షల్లో అవకతవకలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆరుగురు నిరసనకారులు చేపట్టిన నిరవధిక నిరాహారదీక్షా కార్యక్రమం ఆదివారంనాటికి 16వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం తరపున వ్యవహరిస్తున్న ప్రతినిధుల కమిటీలో మంత్రి సుదివ్యకుమార్ కూడా ఉన్నారు. ప్రదర్శకుల తరపున ప్రతినిధులతో ఆదివారంనాడు ఆరోవిడత చర్చలు జరిగాయి. విద్యార్థులతో సానుకూలంగా చర్చలు జరిపామని, జెఎస్‌ఎస్‌సిలో ఆర్థిక అవకతవకలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరెక్టొరేట్ ద్వారా విచారణ జరిపించాలని సిఫార్సు చేసేందుకు ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసిందని, అందువల్ల ఆందోళన విరమించుకోవాలా? వద్దా? అనే విషయంపై ఇక ప్రదర్శకులే వారి నిర్ణయాన్ని ప్రకటిస్తారని మంత్రి సుదివ్య కుమార్ చెప్పారు. పరీక్షల అవకతవకలపై 90 రోజులలోపు ఛార్జిషీటు దాఖలు చేసేవిధంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టును కూడా ఏర్పాటు చేస్తున్నామని కూడా ప్రదర్శకుల తరపున ప్రతినిధులకు ప్రభుత్వం తెలియజేసిందని మంత్రి చెప్పారు. ఐఐటి–ఐఎస్‌ఎం ధన్‌బాద్,ఐఐఎం రాంచీ,ఎక్స్‌ఎల్ఆర్ఐ జమ్‌షెడ్‌పూర్‌లకు చెందిన నిపుణులతో ఒక కమిటీని కూడా ఏర్పాటు చేశామని,ఈ నిపుణుల కమిటీ పరీక్షల సంస్కరణలకు తగిన సిఫార్సులు చేస్తుందని మంత్రి చెప్పారు. అదేవిధంగా పదవీ విరమణ చేసిన హైకోర్టు న్యాయమూర్తి నాయకత్వంలో ఒక కమిటీ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందని, ఈ కమిటీ జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్, కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ లెవెల్ పరీక్షల్లో అవకతవకలపై దర్యాప్తు చేస్తుందని చెప్పారు.
అంతకుముందు విద్యార్థి నాయకుడు రవీంద్ర పాశ్వాన్ మాట్లాడుతూ, చాలా వరకూ తమ డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిందనీ,14వ జెపిఎస్‌సి పరీక్షలను కూడా రద్దు చేయాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించిందని, కానీ సిబిఐ దర్యాప్తు చేయాలన్న డిమాండ్ విషయంలో రాజీ పడబోమని స్పష్టం చేశారు. ఈ పరిస్థితుల్లో సోమవారం (ఆగస్టు 10)నాడు అసెంబ్లీ వరకూ తలపెట్టిన ''పాదయాత్ర'ను కొనసాగించడం తప్ప తమకు వేరే ప్రత్యామ్నాయం లేదని ప్రకటించారు.

### జార్ఖండ్ పిఎస్‌సిలో ముగ్గురు సభ్యుల రాజీనామా

జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జెపిఎస్‌సి)లో ఉన్న మొత్తం ముగ్గురు సభ్యులూ ఆదివారం రాత్రి రాజీనామా చేశారు. రాష్ట్ర గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ ఈ ముగ్గురు రాజీనామాలను వెంటనే ఆమోదించారు. రాజీనామాలు చేసినవారిలో అజీత భట్టాచార్య, అనిమ హాన్స్‌దా,జమాల్ అహ్మద్ ఉన్నారు. ఈ మేరకు లోక్‌భవన్ ఒక ప్రకటన విడుదల చేసింది.
సిఐడి అధికారులు ఈ ముగ్గురినీ పిలిచి ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై ప్రశ్నించారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో సభ్యురాలుగా ఉండి ప్రస్తుతం రాజీనామా చేసిన అజీత భట్టాచార్య జెఎంఎం నాయకుడు సుప్రియో భట్టాచార్య సతీమణి. ఆమెను నిర్ణీత ప్రకారం సిఐడి అధికారులు సోమవారం (ఆగస్టు 10)నాడు పిలిపించి ప్రశ్నించాల్సి ఉంది. అహ్మద్‌ను ఆగస్టు 12వ తేదీన, హన్స్‌దాను ఆగస్టు 14న సిఐడి అధికారులు లీకేజీ వ్యవహారంపై ప్రశ్నించాల్సి ఉంది. కానీ వారిని ముందుగానే పిలిపించి ప్రశ్నించారు. ఈ ముగ్గురూ 2021 సెప్టెంబరులో జెపిఎస్‌సి సభ్యులుగా నియమితులయ్యారు.జులై 22వ తేదీన జెపిఎస్‌సి ఛైర్‌పర్సన్ ఎల్.ఖైంగ్టే తన పదవికి రాజీనామా చేశారు. జెపిఎస్‌సి పరీక్షల అవకతవకలకు సంబంధించిన కేసులో ఇప్పటివరకూ 19 మంది నిందితులను అరెస్టు చేశారు. జులై 28 నుండి ఖైంగ్టేను ఇప్పటివరకూ నాలుగుసార్లు సిబిఐ ప్రశ్నించింది.

## నౌకల రాకపోకలు

(మొదటి పేజీ తరువాయి)

కారణంగా ఇరాన్‌కు జరిగిన తీవ్రమైన నష్టాన్ని భర్తీ చేసేందుకు తగినంత పరిహారం చెల్లించడం ప్రధానాంశాలుగా ఉన్నాయి. ఇరాన్‌కు ఇక భవిష్యత్తులో అమెరికా ఎప్పుడూ హెచ్చరికలు,బెదిరింపులు చేయకూడదని షరతు విధించింది. ఇరాన్ సహా తమకు మద్దతుగా ఉండే సాయుధ మిత్రులు (హౌతీలు, హమాస్, హెజ్బొల్లా, పాపులర్ మొబిలైజేషన్ ఫోర్స్ తదితరాలు)పై దాడులు నిలిపివేయాలని, ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనం ఎత్తివేసి అమెరికా సైన్యాలు పశ్చిమాసియాను శాశ్వతంగా వదిలివెళ్ళిపోవాలని, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను ఎలాంటి షరతులూ లేకుండా విడుదల చేయాలని కోరింది. దీంతో ఇరాన్ తన వైఖరిని మరింత కఠినతరం చేసినట్లయింది.ఇరాన్‌కు శక్తిమంతమైన సైనికదళం ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్‌లో జోల్ఫాదర్ కమాండర్ హోదాలో ఉన్నారు. ఇరాన్ పరిపాలనకు పొలిట్ బ్యూరో లాంటి సంస్థగా పనిచేసే నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ అమెరికా–ఇరాన్ మధ్య జరుగుతున్న చర్చలను కుదిపివేసే కఠిన డిమాండ్లను తెరమీదకు తీసుకువచ్చింది. కీలక ఆయుధాల కొరత ఏర్పడిందన్న సంక్షోభంలో చిక్కుకున్న డోనాల్డ్ ట్రంప్‌కు ఈ షరతులు పెద్ద శరాఘాతంగా మారనున్నాయి. ఈ అన్ని షరతులను పూర్తిగా నెరవేర్చేవరకూ హోర్ముజ్ జలసంధిని తెరిచే ప్రసక్తే లేదని, శత్రువు మా షరతులన్నీ అంగీకరించేవరకూ జలసంధిని తమ అధీనంలోనే ఉంచుకోవడమే తమ వ్యూహమని ఐఆర్‌జిసి గార్డుల ప్రతినిధి హొస్సేన్‌మొహెబి స్పష్టం చేశారు.
ఇదిలా ఉండగా, హోర్ముజ్ జలసంధిలో ఒక కొత్త నౌకా యాన మార్గాన్ని ఏర్పాటు చేసే విషయంపై ఇరా న్–ఒమన్ దేశాలు ఒక ఒప్పందానికి చాలా దగ్గరగా వచ్చాయని, ఐతే జలసంధిలో కార్యకలాపాల నిర్వహణకు ఈ సాన్నిహిత్యం సరిపోదని, ఇంకా పూర్తి పరి పక్వతతో ఒప్పందం కుదరాల్సి ఉందని ఇరాన్ విదేశీవ్యవహారాలమంత్రి అబ్బా స్ అరాఘ్చి ఇంతకుముందే చెప్పారు.

### ఎర్ర సముద్రంలో కీలక ఓడరేవుపై హౌతీల దాడి

ఎర్ర సముద్రంలో కీలకమైన ఓడరేవుపై దాడి చేసినట్లు హౌతీ ఉగ్రవాద సైన్యాలు ఆదివారం ప్రకటించాయి. యెమె న్‌లో ప్రపంచ గుర్తింపు పొందిన ప్రభుత్వం ఇప్పుడు హౌతీ ఉగ్రవాదులతో పోరాడు తోంది. హౌతీల అధీనంలో ఉన్న హొడెయిడా ఓడరేవుతో సంబంధం లేకుండా నౌకా కార్యకలాపాలు నిర్వహించడానికి యెమెన్ ప్రభుత్వం ఇటీవల మోచా ఓడరేవును అభివృద్ధి చేసింది. ఈ ఓడరేవుపై హౌతీలు దా డులు చేశారు. యెమెన్ ప్రభుత్వ అధీనంలో ఉన్న ప్రధానమైన ఓడరేవులలో ఇది ఒకటి. దీంతో యెమెన్ సైన్యం హౌతీల స్థావరాలపై ఎదురు దాడులు చేసింది. ఇదిలా ఉండగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన అడ నోక్ కంపెనీ నౌకపై ఇరాన్ క్షిపణి దాడి చేసింది. మరోవైపు మక్కాలో కుదిరిన త్రైపాక్షిక రక్షణ ఒప్పందంలో ఈజిప్టు కూడా చేరేందుకు ఆసక్తి చూపిస్తోందని టర్కీ విదేశీమంత్రి ఫిదాన్ చెప్పారు. కాగా, టర్కీలో కుర్దిస్ట్ వర్కర్స్‌పార్టీ (పికెకె) రద్దుకు, ఈ బృందం ఆయుధాలు వది లిపెట్టేందుకు రంగం సిద్ధమైంది. దీనికి సంబంధించిన ఒక తీర్మానం టర్కీ చట్టసభలో ఆమోదానికి సిద్ధమవుతోంది. అనేక దశాబ్దా లుగా పికెకె టర్కీ ప్రభుత్వంతో యుద్ధం చేయడంతో వేలాది మంది మరణించారు.

## చెప్పక తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ఏళ్ల తరబడి సన్నద్ధత, కుటుంబానికి చెందిన భూమి అమ్మకం, తల్లిదండ్రులపై అప్పుల భారం... అయినా చివరకు చేతికి దక్కింది ఏమీ లేదు అని ఆ విద్యార్థి తన గోడును వెల్లబోసుకున్నాడని రాహుల్‌గాంధీ ఆదివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇది ఆ విద్యార్థి వైఫల్యం కాదు, అతని కష్టానికి తగిన గుర్తింపునివ్వని వ్యవస్థ వైఫల్యం లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ఉద్ఘాటించారు. పేపర్ లీక్ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన నిరసనను విరమించి చాలా రోజులు గడిచినా, వారిపై ఢిల్లీ పోలీసులు తీసుకున్న చర్యల గురించి షా నుండి ఒక్క మాట కూడా రాలేదని మండిపడ్డారు. క్షమాపణ చెప్పడానికి బదులుగా, మోదీజీ క్షమను ప్రసాదించడంలో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. 'అమిత్ షా గారూ, మేము బాధ్యతను ప్రశ్నించడం ఆపేస్తామని ఒక్క క్షణం కూడా అనుకోవద్దు. రాజధాని వీధుల్లో యువతపై లాఠీలు, పెల్లెట్ గన్‌లు ప్రయోగించారు. అయినా మీరు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఈ నేరానికి సంబంధించి ఎప్పటికైనా మీరు సమాధానం చెప్పక తప్పదు' అని రాహుల్‌గాంధీ హెచ్చరించారు. విద్యార్థులే దేశానికి వెలుగు అని పేర్కొన్న కాంగ్రెస్ అగ్రనేత వారికి తన పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. పేపర్ లీక్ వ్యవహారంపై జులై 20న విద్యార్థులు చేసిన నిరసన సమయంలో పోలీసుల దౌర్జన్యాలపై హోం మంత్రి షా ఉభయ సభలలోనూ ప్రకటన చేయాలన్న ప్రతిపక్షం డిమాండ్ కారణంగా పార్లమెంటు ఉభయ సభలలోనూ స్తంభన కొనసాగుతోంది. సభలో గందరగోళం మధ్యే చాలా వరకు శాసనపరమైన కార్యకలాపాలు జరిగాయి. పోలీసుల చర్యపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గత వారం అమిత్ షాపై తీవ్ర విమర్శలు చేశారు. సభలో మాట్లాడాలని ఛైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ సూచించినప్పటికీ హోం మంత్రి రాజ్యసభకు రాలేదని ఆయన పేర్కొన్నారు. నిరసన చేస్తున్న విద్యార్థులపై ఇటీవల జరిగిన పోలీసు చర్యకు సంబంధించి షా సమాధానాలు ఇవ్వాలని కాంగ్రెస్, ఇతర పార్టీలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో, ఏ మంత్రి సభకు వచ్చి తమ ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలో ప్రతిపక్షాలు నిర్దేశించలేవని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు లోక్‌సభలో అన్నారు.

## భాగ్యనగరం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అంతటా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. హైకోర్టు జడ్జి ఎస్.నంద, జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, శాసన మండలి డిప్యూటి చైర్మన్ బి. ప్రకాష్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి , శాసన సభ్యులు తాగూర్, మాజి ఎంపి అంజన్ కుమార్ యాదవ్, మాజి మంత్రులు కెటి.రామారావు, తలసాని శ్రీనివాసయాదవ్, దేవాదాయ కమిషనర్ హనుమంతరావు, సిపి సజ్జనార్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

## ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

సామాజిక భద్రతను అందించిందని, ఇది సోషలిజం శక్తిని నిరూపిస్తోందన్నారు. ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆసియా తదితర ప్రాంతాల్లో విముక్తి ఉద్యమాలకు క్యూబా సహకరించిందని గుర్తుచేశారు. క్యూబా వైద్యులు, ఉపాధ్యాయులు ప్రపంచ దేశాల్లో అందించిన సేవలు అంతర్జాతీయవాదానికి గొప్ప ఉదాహరణగా రామకృష్ణ తెలిపారు.

### పలస్తీనాకు సంపూర్ణ మద్దతు

పలస్తీనా, గజాలో మానవతా విషాదంపై ఆవేదన వ్యక్తం చేస్తూ పలస్తీనియన్ల న్యాయబద్ధమైన హక్కుల కు సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తోందన్నారు. తూర్పు జెరూసలెంను రాజధానిగా చేసుకుని స్వతంత్ర పలస్తీనా దేశం ఏర్పడాలని రామకృష్ణ డిమాండ్ చేశా రు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ఇరాన్ యుద్ధం గురించి ప్రస్తావిస్తూ తాజా పరిణామాలు విస్తత యుద్ధానికి దారితీయవచ్చని హెచ్చరించారు. సమస్యలను సైనికశక్తితో కాకుండా చర్చలు, దౌత్యం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. అదే విధంగా దేశాలు పరస్పర గౌరవించుకోవాలని, సా ర్వభౌమత్వానికి విలువనివ్వాలని హితవు పలికారు.

### భారత్‌లో నయా ఉదారవాద విధానాల వ్యతిరేక పోరు

భారతదేశ పరిస్థితుల గురించి మాట్లాడుతూ మతతత్వం, నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా సిపిఐ పోరాడుతోందని రామకృష్ణ తెలిపారు. నయా ఉదారవాద ఆర్థిక విధానాలు, ప్రైవేటీకరణ, నిరుద్యోగం, కార్మికులు, రైతుల హక్కులపై దాడులను ప్రతిఘటిస్తున్నట్లు వెల్లడించారు. రాజ్యాంగంలోని లౌకిక, ప్రజాస్వామ్య విలువలను, సామాజిక న్యాయాన్ని పరిరక్షించేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా కార్మికులు, రైతులు, యువత, మహిళలు, ఆదివాసీలు, ప్రజాస్వామిక శక్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై కమ్యూనిస్టు, కార్మిక పార్టీలు మరింత సమన్వయంతో పనిచేయాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం ప్రకటనలకే పరిమితం కాకూడదని... ఉమ్మడి కార్యాచరణ, సంఘీభావ కార్యక్రమాలు, యువజన సహకారం, భావజాల పరస్పర మార్పిడి ద్వారా మరింత విస్తతంగా సాగాలని సూచించారు.

### క్యూబాకు అంతర్జాతీయ సంఘీభావం పెరగాలి

సోషలిస్టు క్యూబాపై అమెరికా విధించిన అక్రమ ఆర్థిక, వాణిజ్య, ఆర్థిక దిగ్బంధనాన్ని తక్షణమే, బేషరతుగా ఎత్తివేయాలని, అమెరికా ఉగ్రవాద దేశాల జాబితా నుంచి క్యూబాను తొలగించాలని సిపిఐ డిమాండ్ చేస్తున్నట్లు రామకృష్ణ తెలిపారు. ప్రపంచంలోని కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీలు క్యూబాకు మరింత బలమైన అంతర్జాతీయ సంఘీభావాన్ని అందించాలని పిలుపునిచ్చారు. పాలస్తీనా ప్రజల న్యాయమైన పోరాటానికి, దురాక్రమణ ఎదుర్కొంటున్న దేశాలకు అంతర్జాతీయ సంఘీభావం పెరగాలన్నారు. ఫిడెల్ కాస్ట్రో ఆశయాలను మరింతగా ముందుకు తీసుకెళ్లాలని, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యతను బలోపేతం చేయాలని రామకష్ణ పిలుపునిచ్చారు. సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ వ్యవస్థ, వలసవాదం, ఫాసిజం, అన్ని రకాల అణచివేతలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్త పోరాటాన్ని ఉధతం చేయాలని కోరారు. 'క్యూబా విప్లవం వర్ధిల్లాలి, శ్రామిక అంతర్జాతీయవాదం వర్ధిల్లాలి, కమ్యూనిస్టువర్కర్ల పార్టీల ఐక్యత వర్ధిల్లాలి' అని నినదిస్తూ తన ప్రసంగాన్ని రామకృష్ణ ముగించారు.

## కెసిఆర్ పరామర్శ

(మొదటి పేజీ తరువాయి)

నివాళులు అర్పించారు. నల్లబెల్లి మండల కేంద్రంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి అభిమానులు భారీ సంఖ్యాలో హాజరు కావడంతో మాజీ ఎంఎల్‌ఎ పెద్ది సుదర్శన్ రెడ్డి అమర్‌హై నినాదలతో మారుమ్రోగింది. ఎర్రవల్లి నుండి భారీ కాన్వాయ్‌తో నల్లబెల్లి గ్రామానికి మాజీ సిఎం కెసిఆర్ బయలుదేరి సాయంత్రం 3 గంటల 50 నిమిషాలకు పెద్ది ఇంటికి చేరుకున్నారు. ఇంటికి పెద్ద దిక్కైన మాజీ ఎంఎల్‌ఎ పెద్ది సుదర్శన్‌రెడ్డిని కోల్పోవడం బాదకరమని కుటుంబాన్ని కెసిఆర్ ఓదార్చి ధైర్యం చెప్పారు . నర్సంపేట నియోజక వర్గ ప్రజలు ,పెద్ది సుదర్శన్‌రెడ్డి అభిమానులు అధైర్య పడవద్దని తెలిపారు. కష్టాకాలంలో బిఆర్‌ఎస్ పార్టీని అదుకున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆయన కుటుంబాన్ని , నియోజక వర్గ ప్రజలకు అదుకుంటానని తెలిపారు . సహచార ఉద్యమకారున్ని కోల్పోవడం, ఎప్పుడు కెసిఆర్ వెంట ఉండే వారని తెలంగాణ ఉద్యమంటే ప్రాణంగా ప్రేమించే వారని ఆంధ్ర పార్టీలకు బెదరకుండా ఉద్యమం కోనసాగించారని కెసిఆర్ వెల్లడించారు . కెసిఆర్‌కు నమ్మిన బంటుగా నమ్మిన సిద్ధాంతం కోసం పెద్ది సుదర్శన్‌రెడ్డి పని చేసే వారని ,పెద్ది భౌతికంగా మన మాధ్య లేకపోయిన ఆయన ఆశయాలకు కార్యకర్తలు పాటు పడాలని సూచించారు. తెలంగాణ ఉద్యమకారుడు నర్సంపేట మాజీ ఎంఎల్‌ఎ పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని బిఆర్‌ఎస్ పార్టీ అదుకోవాలని ఇద్దరు పిల్లలు కుమారుడు నిదర్శన్ రెడ్డి, కుతూరు ధర్మిష్టరెడ్డిలకు చెరో కోటి చొప్పున తల్లికి 25 లక్షల అర్థిక సహకారం అందించాలని నిర్ణయించి చెక్కును అందించారు. నల్లబెల్లి గ్రామంలో కెసిఆర్ రాకతో వెయ్యి నుండి 1500 కార్లతో కిక్కిర్సి పోయింది . మాజీ సిఎం కెసిఆర్ వెంట జనగామ ఎంఎల్‌ఎ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ,రాజ్యాసభ సభ్యులు వద్దిరాజ్ రవిచంద్ర ,మాజీ మాత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్‌రావు ,సత్యవతిరాథోడ్ ,బండా ప్రకాష్ ,మాజీ స్పీకర్ ,శాసనమండలి ఫ్లోర్ లీడర్ సిరికొండ మధుసుధనచారి ,టి.జీవన్ రెడ్డి ,పాడి కౌశిక్‌రెడ్డి ,ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ,మాజీ ఎంపి బోయినిపల్లి వినోద్‌కుమార్ ,మాజీ గిడ్డంగుల చైర్మన్ దివంగత సాయిచంద్ భార్య రజిని , పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ,మాజీ ఎంఎల్‌ఎలు అరూరి రమేష్ ,చల్లా ధర్మారెడ్డి ,గంగుల కమాలకర్ ,తదితరులు పాల్గొన్నారు.

ఆఖర్లో సిరాజ్ హ్యాట్రిక్ సిక్సర్లు

# వామప్ మ్యాచ్‌ల్లో భారత్ ఘన విజయం..!

శ్రీలంక పర్యటన భారత్ ఘనంగా ప్రారంభించింది. రెండు టెస్ట్‌ల సిరీస్‌కు సన్నాహకంగా శ్రీలంక ఎలెవన్‌తో జరిగిన మూడు రోజుల వామప్ మ్యాచ్‌లో భారత్ 6 వికెట్‌లో తేడాతో గెలుపొందింది. ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో టెయిలెండర్ మహమ్మద్ సిరాజ్(15 బంతుల్‌లో ఫోర్, 4 సిక్స్‌లతో 32 నాటౌట్) అద్వితీయమైన బ్యాటింగ్‌తో చిరస్మరణీయమైన విజయాన్ని అందుకుంది.207 పరుగుల లక్ష్య ఛేదనలో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన భారత్ నిర్ణీత 45 ఓవర్‌లో 4 వికెట్‌లకు 214 పరుగులు చేసి గెలుపొందింది. యశస్వి జైస్వాల్(46 బంతుల్లో 9 ఫోర్‌లు, 2 సిక్స్‌లతో 61 రిటైర్డ్ హర్ట్) హాఫ్ సెంచరీతో రాణించగా.. శుభ్మన్ గిల్(54 బంతుల్లో 7 ఫోర్లతో 44), మహమ్మద్ సిరాజ్(15 బంతుల్లో ఫోర్, 4 సిక్స్‌లతో 32 నాటౌట్) విలువైన పరుగులు చేశారు. శ్రీలంక బౌలర్లలో కేశర నువాంత(2/57) రెండు వికెట్లు తీయగా.. విశ్వ ఫెర్నాండో, రమేష్ మెండీస్‌తలో వికెట్ తీసారు.

**హ్యాట్రిక్ సిక్స్‌లతో గెలిపించిన సిరాజ్..**

భారత్ విజయానికి ఆఖరి 6 బంతుల్లో 16 పరుగులు అవసరమయ్యాయి. క్రీజులో టెయిలెండర్ మహమ్మద్ సిరాజ్తో పాటు సరాన్ష్ జైన్ ఉండటంతో విజయం కష్టమేనని అంతా అనుకున్నారు. కానీ సిరాజ్ అనూహ్యంగా హ్యాట్రిక్ సిక్స్‌లు భారీ విజయాన్ని అందించాడు. శ్రీలంక ఎలెవన్ ప్రధాన బౌలర్ కేశర నువాంత్ వేసిన ఆఖరి ఓవర్‌లో వరుసగా మూడు బంతులను సిక్స్‌లు భారీ భారత్ విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. ఈ విజయం భారత్ ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. ఈ మూడు రోజుల వామప్ మ్యాచ్ ద్వారా భారత ఆటగాళ్లకు కావాల్సిన ప్రాక్టీస్ లభించింది.

**శతక్కొట్టిన పడిక్కల్**


ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక ఎలెవన్ తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్లకు 363 పరుగులు చేసింది. నిషాన్ ఫెర్నాండో(65 బంతుల్లో 11 ఫోర్లు, సిక్స్‌తో 66), రావిందు రసంతా(143 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 71), కెప్టెన్ సోనాల్ దినుషా(72 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 52) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్‌లలో రవీంద్ర జడేజా(2/64), కుల్దీప్ యాదవ్(2/76), మానవ్ సుతార్(2/33) రెండేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, యువ బౌలర్ సరాన్ష్ జైన్ ఒక్క వికెట్ తీయలేకపోయారు. అనంతర భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 90 ఓవర్‌లలో 6 వికెట్లకు 357 పరుగుల వద్ద డిక్లేర్డ్ చేసింది. దేవదత్ పడిక్కల్(164 బంతుల్లో 18 ఫోర్‌లతో 142 నాటౌట్) అజేయ సెంచరీతో చెలరేగగా.. రవీంద్ర జడేజా(117 బంతుల్లో 7 ఫోర్‌లతో 63) హాఫ్ సెంచరీతో రాణించాడు. మానవ్ సుతార్(90 బంతుల్లో 5 ఫోర్‌లు, సిక్స్‌తో 41), సరాన్ష్ జైన్(22), గుర్నూర్ బ్రార్(17 బంతుల్లో 2 ఫోర్‌లు, 3 సిక్స్‌తో 36 నాటౌట్) విలువైన పరుగులు చేశారు.శ్రీలంక ఎలెవన్ బౌలర్‌లలో రమేష్ మెండీస్, అసంక మనోజ్ రెండేసి వికెట్లు తీయగా.. విశ్వ ఫెర్నాండో, కేశర నువాంత తలో వికెట్ తీసారు.



**శ్రీలంక 200/6 డిక్లేర్డ్..**

శ్రీలంక ఎలెవన్ రెండో ఇన్నింగ్స్‌లో 45 ఓవర్‌లలో 6 వికెట్లకు 200 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. నిషాన్ ఫెర్నాండో(73 బంతుల్లో 10 ఫోర్‌లతో 63), నిపున్ ధనంజయ(56 బంతుల్లో 5 ఫోర్‌లతో 46), అంజల బండార(48 బంతుల్లో 4 ఫోర్‌ల, సిక్స్‌తో 35) టాప్ స్కోర్‌లుగా నిలిచారు. భారత బౌలర్‌లలో వికెట్ తీయగా.. గుర్నూర్ బ్రార్(2/37), రవీంద్ర జడేజా(2/33) రెండేసి వికెట్లు తీసారు. దాంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కలుపుకొని భారత్ ముందు 207 పరుగుల లక్ష్యం నమోదైంది.

## హై జంప్‌లో భారతకు తొలి రజతం చరిత్ర సృష్టించిన బసంత్..!



జావెలిన్ త్రోలో పదేళ్ల నిరీక్షణకు తెరదించుతూ అశిష్ యాదవ్ రజతం కొల్లగొట్టగా.. హై జంప్‌ల్లో బసంత్ కుమార్ మేఘ్వాల్ చరిత్ర సృష్టించాడు. అమెరికాలోని ఒరెగా వేదికగా జరుగుతున్న అండర్ 20 ఛాంపియన్‌షిప్స్ 2026లో భారత అథ్లెట్లు పతకాల వేట కొనసాగిస్తున్నారు. జావెలిన్ త్రోలో పదేళ్ల నిరీక్షణకు తెరదించుతూ అశిష్ యాదవ్ రజతం కొల్లగొట్టగా.. హై జంప్‌లో బసంత్ కుమార్ మేఘ్వాల్ చరిత్ర సృష్టించాడు. పురుషుల ఫైనల్‌లో సత్తా చాటిన బసంత్ వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనతో వెండి వెలుగులు విరజిమ్మాడు. అండర్ 20 ఛాంపియన్‌షిప్స్‌లో భారత కుర్రాళ్లు రికార్డులు పట్టేస్తున్నారు. జావెలిన్ త్రోలో భావి తారగా ఎదుగుతున్న అశీష్ యాదవ్ సిల్వర్ మెడల్ సాధించిన మరునాడే.. హై జంపర్ బసంత్ కుమార్ మేఘ్వాల్ సైతం వెండి పతకం గెలుపొందాడు. ఆదివారం జరిగిన ఫైనల్‌లో భారత అథ్లెట్ రెండో ప్రయత్నంలో ఏకంగా 2.21 మీటర్ల ఎత్తు దూకాడు. తద్వారా వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనతో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ అందుకున్నాడు. అండర్ 20 ఛాంపియన్‌షిప్స్‌లో భారతకు హై జంప్‌లో తొలి పతకం సాధించిన బసంత్ చరిత్రకు ఎక్కాడు. లాంగ్ జంప్‌లో షహన్వాజ్ ఖాన్ కాంస్యంతో మెరిశాడు. శనివారం పురుషుల జావెలిన్ త్రో ఫైనల్ల్ అశీష్ యాదవ్ 74.09 మీటర్ల దూరం ఈటెను విసిరి రెండో స్థానంతో రజతం పట్టేసిన విషయం తెలిసిందే. పదేళ్ల క్రితం నీరజ్ పసిడి గెలిచిన ఈ టోర్నీలో అశీష్ అంచనాలు అందుకుంటూ మువ్వన్నెల జెండాను రెపరెపలాడించాడు.


## ఆరోగ్యం

### మెదడు పనితీరుపై పరిశోధనల్లో ముందడుగు




మెదడు పనితీరుపై జరుగుతున్న పరిశోధనల్లో మరో కీలక ముందడుగు పడింది. కెనడాలోని బ్రిటిష్ కొలంబియా విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు మనుషులు, ఎలుకలు సహా వివిధ క్షీరదాల మెదడులో ఇప్పటివరకు గుర్తించని 'ఓవాయిడ్ సెల్స్' అనే కొత్త రకం నర కణాలను గుర్తించారు. ఈ కణాలు మెదడులో జ్ఞాపకాల ఏర్పాటుకు కీలకమైన 'హిప్పోకాంపస్' ప్రాంతంలో ఉంటాయని పరిశోధన వెల్లడించింది. ఇతర నర కణాలతో పోలిస్తే ఓవాయిడ్ సెల్స్ ప్రత్యేకమైన పనితీరును ప్రదర్శిస్తాయి. మనం ఒక వస్తువును మొదటిసారి చూసినప్పుడు ఈ కణాలు అత్యంత చురుకుగా స్పందిస్తాయి. అదే వస్తువును మళ్లీ చూసినప్పుడు వాటి స్పందన గణనీయంగా తగ్గిపోతుంది. అంటే, కొత్త సమాచారాన్ని గుర్తించడం, ఇప్పటికే తెలిసిన సమాచారంతో దానిని వేరు చేయడం, జ్ఞాపకాలను క్రమబద్ధీకరించడం వంటి ప్రక్రియల్లో ఈ కణాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ప్రయోగాల్లో ఎలుకలు ఒక వస్తువును ఒక్కసారి చూసిన తర్వాత కూడా చాలా కాలం దానిని గుర్తుంచుకోవడం ఈ కణాల ప్రాధాన్యాన్ని సూచిస్తోంది. కాగా, ఓవాయిడ్ సెల్స్ పనితీరులో లోపాలు ఏర్పడితే అల్జీమర్స్ వ్యాధి, ఆటిజం స్పెక్ట్రమ్ రుగ్మతలు, ఎపిలెప్సీ వంటి నాడీ సంబంధిత వ్యాధులతో సంబంధం ఉండే అవకాశం ఉందని పరిశోధకులు భావిస్తున్నారు. ఈ కణాల చురుకుదనం తగ్గితే గుర్తింపు జ్ఞాపకశక్తి బలహీనపడవచ్చు. మరోవైపు, అసాధారణంగా అధిక చురుకుదనం నాడీ వ్యవస్థలో అసమతుల్యతకు దారితీయవచ్చని సూచిస్తున్నారు. ఈ పరిశోధనకు నాయకత్వం వహించిన డాక్టర్ మార్క్ సెంబ్రోస్కీ అభిప్రాయం ప్రకారం, ఓవాయిడ్ సెల్స్‌పై మరింత లోతైన అధ్యయనం జ్ఞాపకశక్తి ఎలా ఏర్పడుతుందనే విషయంపై కొత్త అవగాహన కల్పించడమే కాకుండా, అల్జీమర్స్, ఎపిలెప్సీ వంటి వ్యాధులకు మరింత లక్ష్యిత చికిత్సలను అభివృద్ధి చేసే అవకాశాన్ని కూడా తెరుస్తుంది. మెదడులో ఇంకా గుర్తించాల్సిన ప్రత్యేక నర కణాలు ఉండవచ్చనే సంకేతాలను కూడా ఈ అధ్యయనం అందిస్తోంది.

## ఆహారం.. మెదడుకూ కీలకమే!




మనం తీసుకునే ఆహారం శరీరానికే కాదు, మెదడు ఆరోగ్యానికీ కీలకమని తాజా పరిశోధనలు మరోసారి స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా అధికంగా ప్రాసెసింగ్ చేసిన ఆహారాలు మెదడులో కొత్త నర కణాలు ఏర్పడే 'న్యూరోజెనెసిస్' ప్రక్రియపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ ప్రక్రియ జ్ఞాపకశక్తి, కొత్త విషయాలను నేర్చుకునే సామర్థ్యం, మానసిక చురుకుదనాన్ని కొనసాగించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ప్రయోగాత్మక అధ్యయనాల్లో శుద్ధి చేసిన చక్కెరలు, అధికంగా ప్రాసెస్ చేసిన కొవ్వులు, కృత్రిమ పదార్థాలు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకున్న నమూనాల్లో మెదడులోని 'హిప్పోకాంపస్' ప్రాంతంలో కొత్త నర కణాల ఉత్పత్తి తగ్గినట్లు గుర్తించారు. హిప్పోకాంపస్ జ్ఞాపకశక్తి, అభ్యాసం, భావోద్వేగాల నియంత్రణకు కీలకమైన భాగం. ఈ ప్రాంతంలో న్యూరోజెనెసిస్ తగ్గితే జ్ఞాపకశక్తి బలహీనపడటం, నేర్చుకునే సామర్థ్యం తగ్గడం, వయసుతో వచ్చే మానసిక క్షీణత వేగంగా సంభవించే అవకాశం ఉందని పరిశోధకులు చెబుతున్నారు. నేటి జీవనశైలిలో ప్యాకేజ్డ్ స్నాక్స్, చక్కెర పానీయాలు, రెడీటుఈట్ ఆహారాలు విస్తృతంగా వినియోగంలో ఉన్నాయి. ఇవి శరీరానికి కేలరీలను అందించినప్పటికీ, మెదడు ఆరోగ్యానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు వంటి పోషకాలు తక్కువగా ఉంటాయి.మరోవైపు ఆకుకూరలు, తాజా పండ్లు, బెర్రీలు, వేరుశెనగలు, ఇతర గింజలు, ఒమెగా3 కొవ్వు ఆమ్లాలు సమృద్ధిగా ఉండే చేపలు వంటి సహజ ఆహారాలు మెదడు ఆరోగ్యానికి అనుకూలంగా ఉంటాయని అనేక పరిశోధనలు సూచిస్తున్నాయి. వీటిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, సూక్ష్మ పోషకాలు కొత్త నర కణాల ఏర్పాటుకు ఇప్పటికే ఉన్న నర కణాలను కూడా రక్షిస్తాయి. అందువల్ల ఇదే ప్రభావం మనుషుల్లో ఎంత మేరకు ఉంటుందో నిర్ధారించడానికి మరిన్ని క్లినికల్ అధ్యయనాలు అవసరం. అయినప్పటికీ, తక్కువ ప్రాసెసింగ్ చేసిన సహజ ఆహారాన్ని రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం మెదడు ఆరోగ్యాన్ని దీర్ఘకాలం కాపాడుకోవడానికి ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

## రుచులతో సబంధంలేని ఆహారం ఎంపిక!



ఆకలి వేస్తే మనం ఏ ఆహారాన్ని ఎంచుకుంటామనే నిర్ణయం కేవలం అలవాట్లు లేదా రుచులపై మాత్రమే ఆధారపడదని, మెదడులోని ప్రత్యేక నర కణాల సమన్వయంతో అది జరుగుతుందని తాజా పరిశోధన వెల్లడించింది. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు తగ్గినప్పుడు న్యూరోపెప్టైడ్ వై (ఎన్‌పివై) న్యూరాన్లు చురుకుగా మారి, శరీరానికి శక్తిని త్వరగా అందించే ఆహారం కోసం అన్వేషణను ప్రారంభిస్తాయి. ఈ ప్రక్రియలో పిఎన్‌వై న్యూరాన్లు రెండు వేర్వేరు నాడీ మార్గాలను ఉత్తేజితం చేస్తాయి. ఒక మార్గం కార్బోహైడ్రేట్లు, ముఖ్యంగా చక్కెరలు అధికంగా ఉండే ఆహారం వైపు ఆకర్షిస్తే, మరొక మార్గం కొవ్వు పదార్థాలపై ఆసక్తిని పెంచుతుంది. పరిశోధకుల ప్రకారం, 'కార్టికోట్రోపిన్‌రిలీజింగ్ హార్మోన్' (సిఆర్‌హెచ్) న్యూరాన్లు చక్కెరలు తీసుకునే ప్రవర్తనను నియంత్రిస్తాయి. అదే సమయంలో 'మెలనోకోర్టిన్4 రిసెప్టర్' (ఎంసి4ఆర్) న్యూరాన్లు కొవ్వు పదార్థాల ఎంపికను ప్రభావితం చేస్తాయి. ఆహార ఎంపిక వెనుక పనిచేసే ఈ సూక్ష్మ నాడీ వ్యవస్థను గుర్తించడం పోషకాహార శాస్త్రం, నాడీ శాస్త్రంలో కీలక పురోగతిగా భావిస్తున్నారు. ఊబకాయం, మధుమేహం, అతిగా తినే అలవాటు వంటి భవిష్యత్తులో వ్యక్తిగత ఆహార నియంత్రణ, కొత్త చికిత్సా విధానాల అభివృద్ధికి కూడా ఈ అధ్యయనం దోహదపడే అవకాశం ఉందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## వేట కత్తితో 'మాస్'లుక్

రవితేజ తాజా చిత్రం ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం 21న భారీ స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన 'గ్లింప్స్', పాటలతో ఆసక్తిని రేకెత్తించిన చిత్ర బృందం, ఇప్పుడు థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేయడానికి సిద్ధమవుతోంది. 12న భీమవరంలో జరిగే భారీ కార్యక్రమంలో 'ఇరుముడి' ట్రైలర్ విడుదల కానుంది. ఈ కార్యక్రమానికి రవితేజ హాజరు కానుండటంతో ఇది సినిమా ప్రచారంలో ఒక కీలక ఘట్టం కానుంది. ట్రైలర్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో రవితేజ రెండు విభిన్న అవతారాల్లో కనిపిస్తున్నారు. ఒకవైపు నోటిలో గొడ్డలితో మాస్‌లుక్‌లో కనిపిస్తుండగా, మరోవైపు అయ్యప్ప మాల ధరించిన ఆధ్యాత్మిక అవతార్‌లో కనిపిస్తున్నారు. 'ఇరుముడి'లో రవితేజ ఇప్పటివరకు చూడని విధంగా మరింత ఫ్యామిలీ ఓరియెంటెడ్ పాత్రలో కనిపించనున్నారు. దీంతో సినిమాలో కుటుంబ బంధాలు, భావోద్వేగాలకు కీలక స్థానం ఉండబోతుంది. ఈ చిత్రంలో ప్రియ భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బేబీ నక్షత్ర కీలక పాత్రలో కనిపించనుంది. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి విష్ణు శర్మ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. సాహి సురేశ్ ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తుండగా, ప్రవీణ్ పూడి ఎడిటర్‌గగా పనిచేస్తున్నారు. జివి ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. 21న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్న 'ఇరుముడి'కి భీమవరంలో జరుగనుంది. మాస్ మహారాజా రవితేజ, ప్రియా భవానీ శంకర్, సాయి కుమార్, బేబీ నక్షత్ర, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, స్వాసిక, రాజ్ కుమార్ కసిరెడ్డి, రమణ భార్గవ్, కిషోర్ కంచెరపాలెం, కార్తీక్ అడుసుమల్లి, మహేష్ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: జివి ప్రకాష్ కుమార్, డిఒపి : విష్ణు శర్మ, ఎడిటింగ్: ప్రవీణ్ పూడి, స్క్రిప్ట్ కోఆర్డినేటర్: నరేష్ బాబు పి.

## అల్లరి నరేష్ మార్క్‌తో 'రంభ ఊర్వశి మేనక'



గత కొన్నేళ్లుగా విభిన్న పాత్రలు, కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలతో ప్రేక్షకులను అలరించిన అల్లరి నరేష్, ఇప్పుడు తన మార్క్ కామెడీ జోనర్ 'రంభ ఊర్వశి మేనక'తో సిద్ధమయ్యారు. చంద్ర మోహన్ చింతాడ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌ను అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్లపై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా అల్లరి నరేష్ మార్క్ వినోదంతో మేళవించిన వినూత్న కథగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తొలి పాట 'నా కంటి మీద కునుకే'కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. 10న టీజర్‌ని లాంచ్ చేయనున్నారు. అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో అల్లరి నరేష్ చిరునవ్వుతో కనిపించడం ఫీల్ గుడ్ వైబ్ ని తీసుకొచ్చింది. ఈ చిత్రంలో వెన్నెల కిశోర్, వికె నరేష్, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్ తదితర ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వీరందరూ తమదైన కామెడీ టైమింగ్‌తో సినిమాకు మరింత వినోదాన్ని అందించనున్నారు.ఈ చిత్రానికి రామ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, చైతన్ భరద్వాజ్ సంగీతం సమకూరుస్తున్నారు. బ్రహ్మ కడలి ఆర్ట్ డిజైన్‌ను రూపొందించగా, చోటా కె. ప్రసాద్ ఎడిటింగ్. 'రంభ ఊర్వశి మేనక' చిత్రం సెప్టెంబర్ 4న థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: చైతన్ భరద్వాజ్, డిఒపి: రాంరెడ్డి, ఆర్ట్ డైరెక్టర్: బ్రహ్మ కడలి, ఎడిటర్: ఛోటా కె ప్రసాద్.

## రీల్

### నయనతార అంకితభావంతో పనిచేశారు
### 'టాక్సిక్' ట్రైలర్ రిలీజ్‌లో హీరో యష్



యశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'టాక్సిక్' ట్రైలర్ విడుదలైంది. నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హుమా ఖురేషి ప్రధాన పాత్రల్లో నటించారు. దర్శకురాలు గీతు మోహన్దాస్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు, థ్రిల్లింగ్ మూమెంట్స్, ప్రొడక్షన్ డిజైన్, డార్క్ అండ్ టెక్చర్డ్ విజువల్స్‌లో 'టాక్సిక్' ప్రపంచాన్ని ట్రైలర్ రూపొందించారు. యాక్షన్తో పాటు ఎమోషన్, రిలేషన్‌షిప్స్, క్యారెక్టర్ డైనమిక్స్‌కు కూడా ట్రైలర్‌లో ప్రాధాన్యత ఇచ్చారు. ఇంగ్లిష్, కన్నడ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కిన ఈ చిత్రం హిందీ, తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో డబ్బింగ్ వెర్షన్స్‌లో విడుదల కానుంది. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాస్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మించిన 'టాక్సిక్' 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. బెంగళూరులో గ్రాండ్‌గా జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్లో కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా యశ్ మాట్లాడుతూ ఈ సినిమా కచ్చితంగా గుర్తుండిపోతుంది. ఇలాంటి సినిమా చేయడం మామూలు విషయం కాదు. దాదాపు 200 రోజుల పాటు రెండు భాషల్లో ఈ సినిమాను షూట్ చేశాం. ఇందులో పనిచేసిన స్టార్స్ అందరూ తమ సమయాన్ని ఈ సినిమా కోసం డెడికేట్ చేశారు. నయనతార చాలా గ్రేస్ఫుల్‌గా ఈ సినిమాలో నటించారు. ఆమె లేడీస్ సూపర్‌స్టార్. ఆమె ఎంత బిజీగా ఉంటారో మనందరికీ తెలుసు. అయినప్పటికీ ఈ సినిమా కోసం ఎంతో అంకితభావంతో పనిచేశారు. ఇందులో చాలా మంది హీరోయిన్స్ ఉన్నారు. అందరి పాత్రలకు సమానమైన ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. దేశాల సరిహద్దులు దాటి ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుందని నమ్ముతున్నాను. గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌పై ఈ సినిమా ఇండియన్ సినిమాను మరింత ఎలివేట్ చేస్తుంది అని ఆశాభావం వ్యక్తం చేశారు. హీరోయిన్లు హుమా ఖురేషి , కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, నయనతార .దర్శకురాలు గీతు మోహన్దాస్ పాల్గొన్నారు.

## సైకలాజికల్ థ్రిల్లర్ కథతో 'ది మేజ్'



డాక్టర్ కాబోయి యాక్టర్ కావడం చూస్తుంటాం కానీ డా. రవికిరణ్ గడలాయ్ ఎం.డి, పాథాలజిస్ట్ డాక్టర్‌గా తన వృత్తిలో కీర్తి ప్రతిష్టలు గడించి ఇప్పుడు దర్శకుడిగా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. శ్రీరామ్ (శ్రీకాంత్) హీరోగా సైకలాజికల్ థ్రిల్లర్ కథతో 'ది మేజ్' చిత్రాన్ని తన తొలి ప్రయత్నంగా తెరకెక్కిస్తున్నారు. రవికిరణ్ గడలాయ్ గతంలో 'ది రాంగ్ స్వప్' అనే షార్ట్ ఫిలింను తన ఫోన్ తో తెరకెక్కించారు. ఈ లఘుచిత్రం రూపొందించే క్రమంలో కథ చెప్పే విధానం, కెమెరా, నటన, సన్నివేశ నిర్మాణం, ఎడిటింగ్ వంటి అంశాలపై అవగాహన తెచ్చుకున్నారు. డైరెక్టర్ డా.రవికిరణ్ గడలాయ్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. నేను ఎక్కడా అసిస్టెంట్ డైరెకర్‌గా పని చేయలేదు. ఫీచర్ ఫిల్మ్ డైరెక్టర్ అయ్యే ముందు ఇండస్ట్రీలో నా అనుభవం కూడా చాలా తక్కువే. కానీ చిన్నప్పటి నుంచే ఒక సినిమా తీయాలనే కల ఉండేది. ఎన్నో సినిమాలు చూస్తూ, వాటిని విశ్లేషిస్తూ, నా మొబైల్‌తోనే ప్రాక్టీస్ చేస్తూ సినిమా భాషను నేర్చుకున్నాను. ఎడిటిం్ప ఉన్న అవగాహన వల్ల ప్రతి సన్నివేశాన్ని ముందుగానే ఊహించుకోగలిగాను. అదే దర్శకత్వాన్ని నాకు మరింత సులభం చేసింది. ఫిలింమేకింగ్ లో దర్శకులు అకిరా కురోసావా, సెల్వరాఘవన్, సందీప్ రెడ్డి వంగా నాకు స్ఫూర్తినిస్తుంటారు. ఇప్పుడు 'ది మేజ్' చిత్రంతో దర్శకుడిగా తొలి ప్రయత్నం చేస్తున్నా. మీ అందరి సపోర్ట్ అందిస్తారని కోరుకుంటున్నా అన్నారు.'ది మేజ్' మూవీలో ప్రియాంక, హ్రితిక శ్రీనివాస్, కమల్ కామరాజు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని డాక్టర్ నైమిష రెడ్డి కసిరెడ్డి సమర్పణలో శ్రౌష కమల ఆర్ట్స్, యూఆర్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై డాక్టర్ ఉదయ్ కె. రెడ్డి పాల్వాయి, డాక్టర్ కెవిఎస్ఆర్ (కరెడ్డి శ్రీధర్ రెడ్డి), డాక్టర్ భరత్ రెడ్డి గోపు, డాక్టర్ అనిరుధ్ రెడ్డి సోమ నిర్మిస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది. వాస్తవంభ్రమ మధ్యనున్న సరిహద్దులను చెరిపేస్తూ, ప్రతి క్షణం మీ ఆలోచనలను సవాలు చేసే, జెయింట్ వీల్ ప్రయాణం లాంటి ఉత్కంఠభరితమైన సైకలాజికల్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపొందుతోంది.

## 21న వస్తున్న 'అమీర్ లోగ్'



పక్కా లోకల్, హైదరబాద్ గల్లీని, బస్తీని తెరపై చూపించేందుకు 'అమీర్ లోగ్' చిత్రం రాబోతోంది. 'అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై మాధవి రెడ్డి సోమ నిర్మించిన ఈ మూవీకి రమణా రెడ్డి సోమ దర్శకత్వం వహించారు. ఈ సినిమాకి మనోహర్ రెడ్డి మంచురి సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రంలో హరి, మనోజ్, శశిధర్ ప్రధాన పాత్రల్లో నటించగా.. వేధా జలంధర్, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయి యోగీ కీలక పాత్రలు పోషించారు. రానా దగ్గుబాటి సంస్థ 'స్పిరిట్ మీడియా' ఈ మూవీని తెలుగులో 21న రిలీజ్ కానుంది. తాజాగా 'బజారే బ్యాన్జో' అనే హిందీ ర్యాప్ పాటను వదిలారు. ఇక ఇది హైదరబాద్ యూత్‌కు ప్రతీకగా నిలిచేలా ఉంది. ఈ పాటలో హైదరాబాద్ సంస్కృతిని, గల్లీ, బస్తీ యువతను చక్కగా చూపించారు. ఈ హిందీ ర్యాప్ పాటకు డబుల్ ఈ (వసీం) సాహిత్యాన్ని, గాత్రాన్ని అందించారు. షబాజ్ ఖాన్ వాయిస్ ఈ పాటకు ఆకర్షణను జోడించింది. స్మరణ్ సాయి బాణీ క్యాచీగా ఉంది. ఈ మూవీకి ఎస్వికె కెమెరావర్క్, రోహిత్ పెనుమత్స ఎడిటింగ్, స్మరణ్ సాయి మ్యూజిక్ ప్రధాన ఆకర్షణ కానున్నాయి. రానా దగ్గుబాటి కి సంబధించిన స్పిరిట్ మీడియా ఈ చిత్రాన్నీ రిలీజ్ చేస్తోంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: మనోహర్ రెడ్డి మంచురి, ఎడిటర్: రోహిత్ పెనుమత్స సంగీతం: స్మరణ్ సాయి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సందీప్ బోరెడ్డి.

### పివి ఫిలిమ్స్ ద్వారా
## 'బాబి' రీ – రిలీజ్




మహేష్ బాబు ఆర్తి అగర్వాల్ కాంబినేషన్ లో వచ్చిన చిత్రం 'బాబి'. శోభన్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా రోమియో జూలియట్ ప్రేమ కథ తరహాలో ట్రాజెడీ లవ్ స్టోరీగా తెరకెక్కింది. మణిశర్మ సంగీత అందించిన ఈ చిత్రంలోని పాటలు యువతను ఉర్రూతలూగించి మ్యూజికల్ హిట్స్ గా నిలిచాయి. ఈ చిత్రాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురడానికి పీవీ ఫిలిమ్స్ సంస్థ సన్నాహాలు చేస్తోంది. మహేష్ బాబు జన్మదినం సందర్భంగా ఆదివారం ఈ సినిమా పోస్టర్‌ను విడుదల చేశారు. నవంబర్ లో ఈ చిత్రాన్ని రి –రిలీజ్ చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# సిఎం రాకకు సర్వం సిద్ధం

## నాగార్జునసాగర్‌లో వరుణ యాగానికి పూర్తైన ఏర్పాట్లు.. పటిష్ఠ బందోబస్తు

**ప్రజాపక్షం/నల్లగొండ :** రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ నాగార్జునసాగర్ విజయ్ విహార్ ఆవరణలో కృష్ణానది ఒడ్డున నిర్వహించనున్న వరుణ యాగానికి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు ప్రారంభం కానున్న ఈ యాగానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. ఆదివారం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్‌పి శరత్‌చంద్ర పవార్‌తో కలిసి వరుణ యాగం ఏర్పాట్లను మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా బీసీ సంక్షేమ హాస్టల్ ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించిన కలెక్టర్ అనంతరం విజయ్ విహార్ వెనుకవైపు కృష్ణానది ఒడ్డున ఏర్పాటు చేసిన యాగశాల, హోమగుండాలు, రుత్వికుల కోసం ఏర్పాటు చేసిన ఆసనాలు, యాగ సామగ్రి, పగోడాలు, బ్యారికేడ్లు, ఎల్ఈడీ స్క్రీన్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు.

**108 మంది రుత్వికులతో యాగం**

వరుణ యాగాన్ని నిర్వహించేందుకు 108 మంది రుత్వికులను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. యాగం జరిగే ప్రాంగణంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు,ఇతర ప్రజాప్రతినిధులు యాగాన్ని వీక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాధారణ ప్రజల కోసం ప్రత్యేక గ్యాలరీ,మీడియా ప్రతినిధుల కోసం మీడియా గ్యాలరీ ఏర్పాటు చేశారు.

**ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా ప్రత్యక్ష వీక్షణ**

యాగశాలలో జరిగే క్రతువులు అందరికీ కనిపించేలా విజయ్ విహార్ ప్రాంగణం మొత్తం ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. సాధారణ ప్రజలు సైతం యాగాన్ని వీక్షించేలా ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. విజయ్ విహార్ ముందు భాగంలో ప్రవచనాలు వినేందుకు ప్రత్యేక ప్రవచనశాలను ఏర్పాటు చేశారు.

**పాస్ ఉన్నవారికే ప్రవేశం**





ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాక నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పోలీసు అధికారులను ఆదేశించారు. విజయ్ విహార్‌కు వచ్చే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ప్రవేశ పాస్ కలిగి ఉండాలని, పాస్ ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతించాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసు సిబ్బంది పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

**ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే**

నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి కూడా వరుణ యాగం ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులను అడిగి ఏర్పాట్ల వివరాలను తెలుసుకున్న ఆయన యాగానికి వచ్చే ప్రముఖులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.రాష్ట్ర దేవాదాయ కమిషనర్ హనుమంతరావు కూడా వరుణ యాగం ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్‌రెడ్డి, మిర్యాలగూడ ఆర్‌డిఓ రమణారెడ్డి, రెవెన్యూ,పోలీస్ శాఖల అధికారులు, ఇతర శాఖల అధికారులు ఏర్పాట్లలో పాల్గొన్నారు.

**సాయంత్రం 3.20 గంటలకు ముగింపు**

వరుణ యాగం సోమవారం ఉదయం 4 గంటలకు ప్రారంభమై సాయంత్రం 3.20 గంటలకు ముగియనుందని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాకతో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నందున అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు.



## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

### డబుల్ బెడ్‌రూం ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

**ప్రజాపక్షం/కోదాడ:** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తుందని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కోదాడ పెరిక భవన్‌లో బాలాజీనగర్‌లో నిర్మాణం చేపట్టిన 542 డబుల్ బెడ్‌రూం ఇండ్ల లబ్ధిదారులకు ఆమె పట్టాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండ్లు లేని నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద నిర్మాణం చేపట్టి అందిస్తుందని అన్నారు. ఇప్పటికే పైలెట్ గ్రామాలలో ఇళ్ల నిర్మాణం పూర్తయిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల లబ్ధిదారులు ఆగస్టు 15 నాటికి గృహ ప్రవేశాలు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి చేశామన్నారు. సంక్షేమ పథకాల విషయంలో ఎవరికి ఒక నయాపైసా కూడా లంచం ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి నిరుపేదకు అభివృద్ధి ఫలాలు అందాలన్నదే తన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం, వైస్ చైర్మన్ దేవరం మల్లేశ్వరి, ఆర్డీవో సూర్యనారాయణ, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారు

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/కోదాడ:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 10న దేశవ్యాప్తంగా నిర్వహించే జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు, ఎస్‌కెఎం జిల్లా కన్వీనర్ దొడ్డ వెంకటయ్యలు పిలుపునిచ్చారు. కోదాడ సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కార్మిక, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్య కార్యచరణలో భాగంగా సూర్యాపేట జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలపై కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని తమ నిరసన గళాన్ని వినిపించాలని కోరారు. దేశవృద్ధిరేటు పెరిగిందని చెబుతూ దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత నరేంద్రమోదీ ప్రభుత్వానిదేనని విమర్శించారు. భవిష్యత్‌లో మరిన్ని సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ లతీఫ్ పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొన్న డిసిఎం.. డ్రైవర్ మృతి

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని డీసీఎం ఢీకొనడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన విషాద ఘటన నార్కట్‌పల్లి మండల పరిధిలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం రాయభూపాలపట్నం గ్రామానికి చెందిన వడ్లపాటి శాంతి స్వరూప్ (26) డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.శనివారం రాత్రి ఎపి 39 డబ్ల్యుయూ 2727 నంబర్ గల అశోక్ లేలాండ్ డీసీఎం వాహనంలో సరివి కర్రలను లోడ్ చేసుకుని పత్తిపాడు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున సుమారు 5 గంటల సమయంలో గ్రామ శివారులోని ఓల్డ్ వివర్ హోటల్ సమీపానికి చేరుకున్నాడు.అదే సమయంలో డీసీఎం వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో డీసీఎం ముందు భాగం తీవ్రంగా దెబ్బతినడంతో శాంతి స్వరూప్‌కు తలకు బలమైన గాయాలయ్యాయి. తీవ్ర గాయాల కారణంగా ఆయన సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ప్రమాద సమాచారం అందుకున్న నార్కట్‌పల్లి పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని ప్రైవేట్ అంబులెన్స్‌లో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నార్కట్‌పల్లి ఎస్‌ఐ పి.విష్ణుమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి 12 మంది అరెస్ట్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అక్రమంగా పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేసి 12 మందిని అరెస్ట్ చేసినట్లు మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపారు. మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామంలోని కంసాలి మణెమ్మకు చెందిన పాతబడిన ఇంట్లో కొంతమంది పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 6,600 రూపాయల నగదుతో పాటు 12 సెల్ ఫోన్లు, 2 మోటార్ సైకిళ్లు, గ్రౌండ్ న్యూస్ పేపర్ షీట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్థానికుల సమక్షంలో పంచనామా నిర్వహించి నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, పేకాట శిబిరాలు నిర్వహించినా వారిపై చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

## మద్యం మత్తులో ఎలుకల మందు సేవించి వృద్ధుడి మృతి

**ప్రజాపక్షం/నకిరేకల్:** మద్యం మత్తులో ఎలుకల మందు సేవించి ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన నకిరేకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కడపర్తి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బొల్లం లింగయ్య (80) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం సేవించిన సమయంలో కుటుంబ సభ్యులను తాను చనిపోతానంటూ పలుమార్లు బెదిరించేవాడని వారు తెలిపారు. ఈ క్రమంలో శనివారం ఉదయం నుంచి మద్యం సేవించిన లింగయ్య.. మధ్యాహ్నం 2 గంటల సమయంలో మద్యం మత్తులో ఇంట్లో ఉన్న ఎలుకల మందును నీటిలో కలుపుకొని సేవించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.అనంతరం ఇంటి సమీపంలో వాంతులు చేసుకుంటుండగా ఓ గ్రామస్థుడు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వారు వెంటనే అంబులెన్స్‌లో నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు నల్గొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మధ్యాహ్నం 3.03 గంటలకు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.ఘటనపై నకిరేకల్ సీఐ హరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## 16న ఉద్దీపన ఉచిత కోచింగ్ సెంటర్ ప్రారంభం

### ముఖ్య అతిథులుగా ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపి చామల

**ప్రజాపక్షం/నకిరేకల్ :** ఎస్‌ఐ కానిస్టేబుల్, అన్ని రకాల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు పరీక్షల్లో మెరుగైన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఉద్దీపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఈనెల 16న నకిరేకల్ పట్టణంలోని వీటీ కాలనీ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం ఎదుట ఉన్న అచల గురు మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఉద్దీపన ఫౌండేషన్ కోఆర్డినేటర్ చెరుకు సతీష్ తెలిపారు.ఈ ప్రారంభ కార్యక్రమానికి ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి,ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాట్లను ఆదివారం ప్రభుత్వ విప్, ఉద్దీపన ఫౌండేషన్ చైర్మన్, ఎమ్మెల్యే వేముల వీరేశం పరిశీలించి మాట్లాడుతూ ఎస్‌ఐ, కానిస్టేబుల్‌తో పాటు వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటివరకు పేర్లు నమోదు చేసుకోని అభ్యర్థులు ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కోచింగ్ సెంటర్‌లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు పన్నాల రాఘవరెడ్డి, చౌగోని శ్రీనివాస్, లింగాల వెంకన్న, నాగులవంచ వెంకటేశ్వరరావు, వేమవరపు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# ఎడమకాలువ నీటి విడుదల తేదీలను ప్రకటించాలి





### క్రాఫ్ హాలిడేను ప్రకటించి రైతులకు ఎకరాకు రూ.50వేలు ఆర్థికసాయం చేయాలి

### రాష్ట్ర రైతు సంఘం జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ కృష్ణానది పరివాహక ప్రాంతంలో కుండపోతగా వర్షాలు కురుస్తున్నందున కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులన్ని నిండి జలకళను సంతరించుకుంటున్న ఈ సమయంలో కూడా సాగర్ ఎడమకాలువ ఆయకట్టుకు నీటి విడుదల తేదీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించకపోవడం శోచనీయమని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నీటి విడుదల తేదీలను ప్రకటించి రైతులలో నెలకొన్న గందరగోళంను తీర్చాలని తెలంగాణ రాష్ట్రరైతు సంఘం జిల్లా నాయకులు పోకల వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో రైతుసంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగార్జునసాగర్‌కూడా వరద వస్తున్న ఈ సమయంలో ప్రభుత్వం వేరే కారణాలు చెప్పకుండా వెంటనే నీటివిడుదల తేదీలను ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వానికి సాగుకు నీళ్లు విడుదల చేయడం ఇష్టం లేకుంటే వెంటనే క్రాప్ హాలిడేను ప్రకటించి రైతులకు ఎకరాకు 50వేల రూపాయల ఆర్థికసాయం చేసి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, ఎఐటియుసి జిల్లా నాయకులు త్రిపురం సుధాకర్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు యడ్ల అంజన్‌రెడ్డి, ప్రతాని సైదులు,కుందురు వెంకటరెడ్డి, పోకల ఆంజనేయులు, అంబటి వెంకటరెడ్డి, పంగ గోవింద్, జానపాటి శ్రీనివాస్, పీర్‌సాబ్, పంగ సైదయ్య, సోమయ్య, నర్సింహరావు పాల్గొన్నారు.

### సాగర్ ఎడమకాలువకు నీరు విడుదల చేయాలి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** సాగర్ ఎడమకాలువకు నీరు విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కృష్ణా పరివాహక ప్రాంతాల నుంచి వస్తున్న వరదల వల్ల ఆల్మట్టి, జురాల, నారాయణపుర్ పూర్తిగా నిండిపోయాయని, శ్రీశైలం కూడా నిండబోతుందని తక్షణమే సాగర్ ఎడమకాలువకు సాగునీరు విడుదల చేయాలన్నారు. ఒక పంట పూర్తి స్థాయిలో రైతు చేతికి అందేందుకు కేవలం 40 టిఎంసిల నీరు సరిపోతుందన్నారు. శ్రీశైలంలో దాదాపు రెండు వందల టిఎంసిలు నీరు ఉన్నదని, అందువల్ల ఎడమకాలువకు నీరు విడుదల చేయడం సబబుగా ఉంటుందన్నారు. ఒకపంటకు నీరు విడుదల చేయడం వల్ల భూగర్భ జలాలు పెరిగి తాగునీటి ఇబ్బందులు తొలగిపోతాయని అన్నారు. ఈకార్యక్రమంలో కోటయ్య, శ్రీను, భాస్కర్, గోవింద్, వెంకట్, శ్రీనివాసగౌడ్, భరత్ పాల్గొన్నారు.



## బిజెపి ప్రజా వ్యతిరేక పాలనకు స్వస్తి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ దేశంలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బద్లావ్ జరూరి హై మార్పు కావాలి అనే ప్రధాన నినాదంతో ఆగస్టు 6 నుంచి పద్నాలుగు వరకు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రలు, ప్రచార యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో పాదాచారులను, స్థానిక ప్రజలను నేరుగా కలిసి వారికి కరపత్రాలు అందజేస్తూ విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక, రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ముందుకు పోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అంజనపల్లి రామలింగం, జిల్లా యాదగిరి, పోలేపల్లి విజయ్ కుమార్, వేణుగోపాల్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా యశ్వంత్, ధోనేటి వెంకన్న, కార్తీక్, దర్శనం వినయ్, పోస్ట్ ఆఫీస్ రామయ్య, శ్రీనివాస్, నాగేందర్ పాల్గొన్నారు.

## భారత ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగొని గాలయ్య

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** భారత రాజ్యాంగాన్ని కాపాడి ప్రభుత్వ రంగ సంస్థల్ని పరిరక్షించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగొని గాలయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు 'బదలావ్ జరూరి' మార్పు రావాలి అని దేశవ్యాప్తంగా ఈనెల 6 నుండి 14 వరకు ప్రజా చైతన్య యాత్రలు నిర్వహించాలని పార్టీ పిలుపు మేరకు సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి ఆదివారం ప్రచార జాతా రావడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రంలో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలన్నీటిని నిర్వీర్యం చేసి బడా పెట్టుబడుదారులకు దారాదత్తం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ ప్రచార జాతలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కే.శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు జగన్, పాండురంగారావు మండల కార్యవర్గ సభ్యులు సుర్వి నరసింహ, వీరమల్ల యాదయ్య, పల్లె మల్లారెడ్డి, మహ్మదాబాద్ సర్పంచ్‌లు ముత్యాల అంజయ్య, కొతులాపురం సర్పంచ్ కురిమిద్ద వినోద, దుబ్బాక సంజీవ పందుల యాదగిరి, కొప్పు సుధాకర్, రాజు, ప్రశాంత్ పాల్గొన్నారు.



# శత్రువులను గుర్తిస్తేనే బిసి రిజర్వేషన్లు సాధ్యం

### నోటితో మాట్లాడి.. నొసటితో వెక్కిరిస్తున్న రాజకీయ పార్టీలు

### చట్టసభల్లో పేద సామాజిక వర్గాల గొంతుకలు కరువయ్యాయి: ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/నల్లగొండ:** బిసిల రిజర్వేషన్ల సాధన కోసం సాగుతున్న పోరాటంలో తమ శత్రువులు ఎవరో బీసీలు ముందుగా గుర్తించాలని,అప్పుడే హక్కుల సాధన సాధ్యమవుతుందని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు.ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని జీవిఎల్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా బీసీఐఎఫ్ ఆధ్వర్యంలో బీసీల హక్కులకై సామాజిక న్యాయ పోరాట సభ నిర్వహించారు. బీసీఐఎఫ్ జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ నేలపట్ల చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విశిష్ట అతిథిగా పాల్గొని మాట్లాడారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రజలు ఏ విధంగా ఐక్యంగా పోరాడారో, అదే స్ఫూర్తితో బీసీలు తమ హక్కులు,రిజర్వేషన్ల కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.బీసీలకు న్యాయం చేస్తామని కొన్ని రాజకీయ పార్టీలు నోటితో మాట్లాడి..నొసటితో వెక్కిరిస్తున్నాయని విమర్శించారు. బీసీలకు సామాజిక న్యాయం కల్పించాలంటే మాటలకే పరిమితం కాకుండా చట్టపరమైన హక్కులు కల్పించేందుకు రాజకీయంగా ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉందన్నారు.చట్టసభల్లో కార్పొరేట్ వ్యక్తులు, పెద్ద వ్యాపారవేత్తలు అడుగు పెట్టడంతో పేద,బడుగు,బలహీన సామాజిక వర్గాల సమస్యలను బలంగా




ప్రశ్నించే గొంతుకలు కరువవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం (బీసీఐఎఫ్) రాష్ట్ర వ్యవస్థాపక చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ఐక్యంగా పోరాడాలని అన్నారు. పోరాటాల ఖిల్లా నల్లగొండ జిల్లాలో బడుగు, బలహీనవర్గాల జెండా ఎగరాలని పిలుపునిచ్చారు.ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీసీలు 56 శాతం ఉన్నప్పటికీ జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం దక్కలేదన్నారు. మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, తెలంగాణ విఠల్, చెరకు సుధాకర్ తదితరులు మాట్లాడారు సభలో బీసీఐఎఫ్ జిల్లా కోఆర్డినేటర్లు గుండెబోయిన జానయ్య యాదవ్, ఆమంచి అంజయ్య, సుంకరి బిక్షంగౌడ్, చక్రహరి రామరాజు, దుడుకు లక్ష్మీనారాయణ, మిర్యాల యాదగిరి పాల్గొన్నారు.

## ఆర్‌టిసి బస్సు ఢీకొని యువకుడి మృతి

**ప్రజాపక్షం/చందంపేట:** ఆర్టీసి బస్సు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం మండల పరిధిలో సర్కిల్ తండా వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని పొగిళ్ల గ్రామానికి చెందిన వాయిలపల్లి శ్రీను(35) ఆదివారం ఉదయం మృతుడు శ్రీను తన ద్విచక్ర వాహనంపై మల్లెపల్లి నుండి పొగిళ్ల గ్రామానికి వెళుతుండగా పాత కంబాలపల్లి వైపు నుండి అతి వేగంగా వచ్చిన ఆర్టిసి బస్సు టిఎస్ 05 జెడ్ 0170 ఢీకొనడంతో శ్రీను తలకు తీవ్ర గాయం అయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి వజ్రమ్మ ఫిర్యాదు మేరకు చందంపేట ఎస్‌ఐ లోకేష్ కేసు నమోదు చేసుకొన దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## డ్రగ్స్ అక్రమ రవాణాపై భారీ ఆపరేషన్

### రూ.54 కోట్ల విలువైన 27 కిలోల మెఫిడ్రోన్ స్వాధీనం

**ప్రజాపక్షం/బీబీనగర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు, జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ తయారీ, రవాణా , విక్రయాలను అరికట్టేందుకు పోలీసులు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా బీబీనగర్ పోలీసులు, ఎస్ఓటి యాదాద్రిభువనగిరి పోలీసులు సంయుక్తంగా భారీ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్లో 27 కిలోల నిషేధిత మెఫిడ్రోన్ డ్రగ్‌ను సుమారు రూ.54 కోట్ల విలువైన మాదకద్రవ్యాన్ని స్వాధీనం చేసుకుని, అక్రమ రవాణాకు పాల్పడుతున్న నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు 8న కొండమడుగు గ్రామ శివారులో ప్రత్యేక తనిఖీలు నిర్వహించగా, ఎంహెచ్49 సిడబ్ల్యు1313 నంబర్ గల ఫార్చ్యూనర్ కారును పోలీసులు అడ్డుకుని తనిఖీ చేశారు. వాహనంలో 27 కిలోల మెఫిడ్రోన్‌తో పాటు డ్రగ్ తయారీలో ఉపయోగించే సుమారు 40 కిలోల అసిటోన్ లిక్విడ్ గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. A1. చేతన్ మధుకర్ మెశ్రామ్, వయస్సు 49 సంవత్సరాలు, నాగ్పూర్, మహారాష్ట్రకు చెందిన అతను డ్రగ్ తయారీకి ఆర్గనైజర్ ఆర్థిక సహకారం అందించిన వ్యక్తి. A2. ముజామల్ హక్, వయస్సు 25 సంవత్సరాలు, మారిగావ్, అస్సాం. డ్రగ్ తయారీలో సహకరించిన వ్యక్తి. A3. ఆకాశ్ అశోక్ గవాండే, వయస్సు 31 సంవత్సరాలు, నాగ్పూర్, మహారాష్ట్ర. పాత్ర: డ్రగ్ అక్రమ రవాణాలో సహకరించిన వ్యక్తి. A4. ఉపద్రష్ట రమణ మూర్తి, వయస్సు 65 సంవత్సరాలు, చందానగర్, హైదరాబాద్. పాత్ర: వేటుకూరి ల్యాబ్స్ ఇన్‌చార్జిగా వ్యవహరించిన వ్యక్తులు ఉన్నారు. తయారు చేసిన డ్రగ్‌ను కొండమడుగు నుంచి నాగ్‌పూర్ తరలించి అక్కడ పంపిణీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు విచారణలో తేలింది.



# సదర్మాట్ రైతులకు హామీలే సాగునీరు!

### మాటలు తప్ప చేతల్లో కనిపించని అభివృద్ధి



**ప్రజా పక్షం/ఖానాపూర్ :** దాదాపు 130 ఏళ్ల చరిత్ర కలిగిన సదర్మాట్ ఆయకట్టు ప్రాంతం అభివృద్ధికి నోచుకోకపోవడంపై ఖానాపూర్ ప్రాంత రైతాంగంలో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. ఒకప్పుడు వేల ఎకరాలకు సాగునీరు అందిస్తూ రైతుల జీవితాల్లో వెలుగులు నింపిన సదర్మాట్ ఆయకట్టు ఇప్పుడు నిర్లక్ష్యానికి గురవుతోందని ఆయకట్టు ప్రాంత రైతులు,ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, ఖానాపూర్ తాలూకాలోని ఖానాపూర్,కడెం,పెంబి,దస్తురాబాద్ తదితర ప్రాంతాల రైతులకు సదర్మాట్ ఆయకట్టు దశాబ్దాలుగా జీవనాధారంగా నిలిచింది. ఈ ఆయకట్ట ఉత్తర వాహినిగా పిలువబడే గోదావరి నదిపై సదార్మాట్ ఆయకట్ట నిర్మించినప్పటి నుండి కాలువల ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందేది.ఈ నీటితో ఆయకట్టు ప్రాంత రైతులు విస్తృతంగా పంటలు పండించేవారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో సదర్మాట్ ఆయకట్టుకు అవసరమైన నీటి సరఫరాపై అప్పటి పాలకులు, అధికారులు తీసుకున్న నిర్ణయాలపై స్థానిక రైతులు ఇప్పటికీ ప్రస్తావిస్తున్నారు. ఎగువన నిర్మించిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా సదర్మాట్ ఆయకట్టుకు నిరంతర నీటి సరఫరా ఉం టుందని అప్పట్లో రైతులు ఆశించారు.అయితే కాలక్రమేణా ప్రాజెక్టు నిర్వహణ, కాలువల ఆధునీకరణ,నీటి సరఫరా తదితర అంశాల్లో నిర్లక్ష్యం చోటుచేసుకోవడంతో సదర్మాట్ ఆయకట్టు పరిస్థితి క్రమంగా దిగజారిందని రైతులు ఆరోపిస్తున్నారు.సదర్మాట్ అభివృద్ధిపై గతంలో పలువురు ముఖ్యమంత్రులు,మంత్రులు,ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చినా అవి పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదని రైతులు వాపోతున్నారు.వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సదర్మాట్ ఆయకట్టను సందర్శించి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చినట్లు స్థానికులు గుర్తుచేసుకుంటారు.అనంతరం ఆయన ఆకస్మిక మరణం,రాష్ట్ర విభజన వంటి పరిణామాలతో ఆ హామీ ముందుకు సాగలేదని,తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత టిఆర్ఎస్ ప్రభుత్వంలో నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు కూడా సదర్మాట్‌ను సందర్శించి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చినట్లు రైతులు పేర్కొంటున్నారు.దీంతో తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందని రైతాంగం ఆశించింది.కానీ ఆ ఆశలు కూడా నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సదర్మాట్‌కు బదులుగా కొత్త ప్రాజెక్టు :** తదనంతర కాలంలో గోదావరి నదిపై నిర్మల్ నియోజకవర్గ పరిధిలోని కమల్ కోట సమీపంలో కొత్త ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడం,దానికి సదర్మాట్ పేరును పెట్టడం స్థానికంగా



చర్చనీయాంశమైంది. ప్రతి ఎన్నికల్లో సదర్మట్ ఆయకట్టు మాట చెబుతూ నాయకులు ఓట్లు దండుకుంటున్నారే తప్ప ఖానాపూర్ ప్రాంత రైతాంగానికి మేలు చేసింది ఏమీ లేదని,గత ఎన్నికల్లో కూడా నూతనంగా నిర్మించే ప్రాజెక్టు నుండి ఏడు కిలోమీటర్ల మేర కెనాల్ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రచారంలో నాయకులు ప్రతి ఒక్కరు హామీలు ఇచ్చారు.ప్రస్తుతం భారీ వ్యయంతో నిర్మించిన నూతన ప్రాజెక్టును ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించినప్పటికీ,అసలు సదర్మాట్ ఆయకట్టు రైతుల సమస్య మాత్రం ఇంకా పరిష్కారం కాలేదని, రైతులు అంటున్నారు.

**సదర్మాట్ ఆయకట్టకు 7 కిలోమీటర్ల కాలువ ఎప్పుడు?** కొత్తగా నిర్మించిన ప్రాజెక్టు నుంచి ఖానాపూర్ సదర్మాట్ ఆయకట్టు దిగువ ప్రాంత రైతులకు సుమారు 7 కిలోమీటర్ల మేర కాలువ నిర్మించి సాగునీరు అందించాల్సి ఉందని రైతులు చెబుతున్నారు.ఈ కాలువ నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుంది? పొలాలకు నీరు ఎప్పుడు వ స్తుంది? జరిగిన ఒప్పందాలు,ఇచ్చిన హామీలు అమలు అవుతాయా? లేదా మరోసారి రైతాంగం నిరాశ చెందాల్సిందేనా?అనే ప్రశ్నలు ప్రస్తుతం రైతుల ముందున్నాయి.

## కార్మికుల వేతనాలు పెంచాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు



**ప్రజాపక్షం / నస్పూర్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలను ఎందుకు పెంచడం లేదో దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు డిమాండ్ చేశారు. సిపిఐ ప్రజా పోరు యాత్రను ఆదివారం నస్పూర్ షిర్కే సెంటర్‌లో ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ 1న నిర్వహించే చలో డిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం కార్పొరేట్ వ్యాపారుల అభివృద్ధికి మాత్రమే ప్రాధాన్యమిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచాలని, అందరికీ వైద్యం, విద్య అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు రేగుంట చంద్రశేఖర్, కారుకూరి నగేష్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు, ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా, జిల్లా సమితి సభ్యులు కొట్టే కిషన్ రావు, మోత్కూరు కొమురయ్య, గునీగంటి నర్సింగ రావు, సురేష్, చిలుక రామచందర్ పాల్గొన్నారు.

## ఆదివాసీల హక్కుల పరిరక్షణకు కృషి



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** ఆదివాసిల హక్కులు, ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాలు, పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు.మంచిర్యాలలో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆదివాసిల ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఐబి చౌరస్తా నుండి పద్మనాయక ఫంక్షన్ హాలు వరకు నిర్వహించిన భారీ ర్యాలీని ఎమ్మెల్యేతో పాటు మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రారంభించారు. ఆదివాసి సమాజ అభ్యున్నతికి వారి సంక్షేమానికి తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్య, కార్పొరేటర్లు, ఆదివాసి నాయకులు పాల్గొన్నారు.

## 13న 'చలో కలెక్టరేట్'ను జయప్రదం చేయండి

### తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రాజన్న డిమాండ్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** అర్హులైన బీడీ కార్మికులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా 'చేయూత' పథకం ద్వారా నెలకు 4,016 జీవన భృతి వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది.ఈ డిమాండ్ సాధనకై ఈ నెల 13న నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను కార్మికులందరూ హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది.ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ భవన్‌లో యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు బీడీ కార్మికులకు చేయూత పథకం ద్వారా 4,016 జీవన భృతి అందిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆ హామీని పక్కన బెట్టి, దరఖాస్తులను కూడా స్వీకరించకుండా బీడీ కార్మికుల పట్ల వివక్ష చూపుతోందని మండిపడ్డారు.వెంటనే స్పందించి బీడీ కార్మికుల నుంచి దరఖాస్తులు స్వీకరించి జీవన భృతిని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 13న ఉదయం 11 గంటలకు నిర్మల్ జిల్లా కలెక్టరేట్ ముట్టడిధర్నా కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం.బక్కన్న,ఉపాధ్యక్షుడు ఆర్.రామలక్ష్మ ణ్, సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న, కోశాధికారి ఎం.డి. గఫూర్, జిల్లా నాయకురాలు లక్ష్మి ,తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి జూపల్లిని కలిసిన గజేందర్



**ప్రజాపక్షం/నేరడిగొండ:** అమెరికా పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బోథ్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలు, పార్టీ సంస్థాగత బలోపేతం, నిలిచిపోయిన పనుల పురోగతిపై చర్చించి, సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మంత్రి ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు 'బోనాలు'

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు బోనాలు నిదర్శనమని మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య, జిల్లా అధ్యక్షుడు సుధాకర్ అన్నారు. ఆదివారం జిజిహెచ్ సానిటేషన్ కార్మికుల ఆధ్వర్యంలో బోనాల పండగ నిర్వహించారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య, జిల్లా అధ్యక్షుడు సుధాకర్, నాయకులు భాగ్యలక్ష్మి హైమది, స్వరూప రాధకుమార్, వెంకటేష్, కార్మికుల మధ్య స్నేహభావాన్ని పెంపొందిస్తున్నాయన్నారు. భక్తితో పాటు సమస్యత పరిష్కారం దొరుకుతుందన్నారు. నాయకులు జిజిహెచ్ సానిటేషన్ కార్మికుల భాగ్య లక్ష్మి హైమది స్వరూప రాధకుమార్ వెంకటేష్ పాల్గొన్నారు.



## మైనర్లు వాహనాలు నడిపితే చర్యలేవీ?

### వాహనాలు నడిపినా పట్టించుకోని అధికారులు

**ప్రజాపక్షం/మోర్తాడ్:** గ్రామాల్లో, పట్టణాల్లో మైనర్లు ద్విచక్రవాహనాలను నడిపితే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఒక దిక్కు ఆదేశిస్తున్నప్పటికీ అధికారులు మాత్రం నిర్లక్ష్యం వహరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. కాగా ప్రస్తుతం అన్ని గ్రామాలలో ప్రభుత్వం పాఠశాలకు సెలవు ప్రకటించడంతో విద్యార్థులంతా ఇళ్లకు చేరుకుంటున్నారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని ఆయా గ్రామాలలో పాఠశాలలకు సెలవులు రావడంతో అందులో మైనర్లు సైతం వారి వారి ఇంటి వద్ద ఉన్న ద్విచక్ర వాహనాలను తీసుకొని రోడ్లపై సర్రుమని, బుర్రుమని, వాహనాలు తీసుకొని రోడ్లపై బయలుదేరుతున్నారు. దీంతో రోడ్లపై నడిచే బాటసారులకు గాని వాహనాలపై వెళ్లే వారికి గాని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులకు శిక్షలు విధిస్తామని గతంలో పోలీసు అధికారులు కూడా తెలిపారు. కానీ మోర్తాడ్ మండలంలోని ఆయా గ్రామాలలో మైనర్లు ప్రతినిత్యం వాహనాలు నడిపిస్తున్నప్పటికీ అ ధికారులు చూసీచూడనట్లు ఉంటున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. పోలీసులు మాత్రం ప్రతినిత్యం రోడ్ల వెంబడి వాహనాలపై వస్తున్న ప్రజలను ఆపి మీరు మద్యం సేవించి వస్తున్నారా? లేదా? అని ఓ ప్రత్యేక యంత్రంతో గాలి ఊదమని పరీక్షిస్తున్నారు. వాహనాలు నడిపే వారు మద్యం సేవించినట్లయితే వారికి ఫైన్‌లు వేస్తున్నారు. కానీ మైనర్లు నడిపే వాహనాలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని తెలిసి కూడా చూస్తూ ఊరుకుంటున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

## ఆదివాసీ సంస్కృతి ప్రపంచానికే ఆదర్శం

### కలెక్టర్ హరిత

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ఆదివాసీలు తరతరాలుగా పరిరక్షిస్తూ వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు ప్రపంచానికే ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఆదివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్, ఎస్పీ నితికా పంత్, జిల్లా అటవీ అధికారి బాలమణి, ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి , సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం జెండా వద్ద ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిది తెగల అమరవీరుల చిత్రపటాలతో పాటు కుమ్రం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఆదివాసీ సంస్కృతిని కాపాడు




కోవడంతో పాటు భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గిరిజన యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కార్పొరేట్ సంస్థలతో చర్చలు జరుపుతున్నామని, జిల్లాలో పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఎస్పీ నితికా పంత్ మాట్లాడుతూ పోలీసులు ఎల్లప్పుడూ ఆదివాసీల సంక్షేమం కోసం పనిచేస్తారని తెలిపారు. గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని ఎమ్మెల్సీ దండే విఠల్ పేర్కొన్నారు. ఆదివాసీ గ్రామాలకు సౌకర్యాలను విస్తరించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కోవ లక్ష్మి వెల్లడించారు. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థను బలోపేతం చేసి మరిన్ని నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు కోరారు. వేడుకల్లో కలెక్టర్, ఎస్పీ గిరిజనుల సంప్రదాయ వేషధారణ ధరించి, మహిళలతో కలిసి దింసా నృత్యం చేశారు. జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, డిసిసి ప్రతినిధి ఆత్రం సుగుణ, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యం

### ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆదివారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాలేజ్ రోడ్డులో పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు టిఫిన్, మధ్యాహ్న భోజనం అందించేందుకు హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ట్రస్టు (ఇస్కాన్ సంస్థ) ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణ పనులను పరిశీలించారు. కేంద్రీకృత వంశాల నిర్మాణ త్వరగా నాణ్యతతో కూడిన పనులతో నిర్మించాలని దీని వల్ల మంచిర్యాల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనం రుచికరంతో పాటు నాణ్యతతో కూడినవి అందజేయవచ్చని అన్నారు. వంటశాల నిర్మాణ పురోగతితో పాటు ఆహార తయారీ విధానం, పరిశుభ్రత ప్రమాణాలు, ఆహార నిల్వ, ప్యాకింగ్ పంపిణీ వ్యవస్థలపై అధికారులతో పాటు సంస్థ ప్రతినిధులను అడిగి ఎమ్మెల్యే తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, టిపిసిసి ఉపాధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్య , బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, ఆత్మ కమిటి ఛైర్మన్ సింగతి మురళి, ఓబిసి జిల్లా అధ్యక్షుడు ఒడ్ల రాజమౌళి, జిల్లా నాయకులు దొంతుల ముఖేష్, పూర్ణచందర్‌రావు, రాజేశ్వర్‌రావు, సంజీవరావు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఉత్కంఠకు తెర.. అదృశ్యమైన విద్యార్థులు క్షేమం


### తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



**ప్రజాపక్షం/రామాయంపేట:** గత నాలుగు రోజుల క్రితం ఇంటి నుండి అదృశ్యమైన విద్యార్థులను గుర్తించిన పోలీసులు ఆదివారం తల్లిదండ్రులకు అప్పగించారు. రామాయంపేట పట్టణంలోని కేసీఆర్ కాలనీలో నివాసం ఉండే దనుష్ (13), మనోజ్ (13), షేక్ సమీర్ (13) ముగ్గురు విద్యార్థులు గురువారం రాత్రి నుండి కనిపించకుండా పోయారు. విద్యార్థుల తలిదండ్రుల పిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. తప్పిపోయిన ముగ్గురు విద్యార్థులు కామారెడ్డిలో ఉన్నట్లు సమాచారం అందడంతో వారిని రామాయంపేటకు తరలించి తల్లిదండ్రులకు అప్పగించారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, వారి కదలికలను గమనిస్తూ ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గత నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన విద్యార్థుల ఆచూకి లబించడంతో ఉత్కంఠకు తెరపడింది. ఎస్ఐలు బాలరాజ్, నరేష్‌లు ఉన్నారు.

## ఆదివాసీ వేడుకల్లో కలెక్టర్, ఎస్‌పి

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ రూరల్ :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కలెక్టర్ కె. హరిత, జిల్లా ఎస్పి నితికా పంత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వారిద్దరూ స్వయంగా ఆదివాసీ సంప్రదాయ దుస్తులు, ఆభరణాలు ధరించి వేడుకలకు హాజరై అలరించారు. అధికారులకు గిరిజన పెద్దలు, మహిళలు సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనల్లో కలెక్టర్, ఎస్‌పి ఉత్సాహంగా పాల్గొన్నారు.కళాకారులతో కలిసి అడుగులు వేస్తూ, రేలా పాటలకు డ్యాన్స్ చేసి ఆదివాసీల్లో ఉత్సాహాన్ని నింపారు.



## రైతులు ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచండి

### జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్

**ప్రజా పక్షం/దిలావర్ పూర్ :** వ్యవసాయ,ఉద్యానవన, నీటిపారుదల పంచాయతీరాజ్ శాఖల సంయుక్తంగా నిర్వహిస్తున్న న్యూ లోలం గ్రామసభలకు జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. సర్పంచ్ సూర లలిత సాయన్న ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి జరిగింది. ఖచ్చితమైనటువంటి నీటి వనరులు ఉంటే తప్ప వరి తక్కువ చేసుకోవాలని ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు విత్తుకోవాలని,సూపర్ ఎల్లినో ప్రభావంతో ఆగస్టు 15 తేదీ నుండి ఆశించినటు వంటి వర్షాలు లేవని ఐఎండి శాఖ తెలియజేయడం జరిగిందని తెలిపారు.ఆయిల్ పామ్ పంట యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ పంట విస్తీర్ణాన్ని రెట్టింపు చేయాలని అలాగేఈనెల 13వ తారీకు నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించబోతున్న ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్ పైన రైతులకు అవగాహన కల్పించడం జరిగింది.ఆదివారం రోజున పలు గ్రామాలలో గ్రామ సభలు సాంగ్వి కంజర్ గుండంపల్లీ, సముద్రపల్లి, నిర్వహించడం జరిగిన తెలిపారు.సర్పంచులు,మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ రెడ్డి,వ్యవసాయ విస్తరణ అధికారులు జైపాల్ శ్రీనివాస్ గౌడ్, గ్రామ పంచాయతీ సెక్రటరీలు,రైతులు హాజరు కావడం జరిగింది.



## వర్షాకాలంలో వాహన దారులు అప్రమత్తంగా ఉండాలి

### ఎస్ఐ రంజిత్ కుమార్

**ప్రజాపక్షం/నర్సాపూర్ :** భారీ వర్షాల సమయంలో ప్రజలు లోతట్టు ప్రాంతాలు, వాగులు, కాలువలు, చెరువులు మరియు నీటితో నిండిన కల్వర్టుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలి. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని సూచించారు.పొలాల్లో విద్యుత్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మరియు విద్యుత్ తీగల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. తెగిపడిన విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకకూడదు. వర్షపు నీటితో నిండిన వాగులు, కాలువలు, కుంటలు దాటే ప్రయత్నం చేయకూడదు. పంటలు, వ్యవసాయ పరికరాలు ఎరువులను సురక్షితమైన ప్రదేశాల్లో భద్రపరచుకోవాలి. భారీ వర్షాల సమయంలో అత్యవసరమైతే తప్ప పొలాలకు వెళ్లకపోవడం మంచిది. వాహనాల వేగాన్ని తగ్గించి జాగ్రత్తగా ప్రయాణించాలి. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి.పిల్లలను చెరువులు, కుంటలు, వాగులు నీటితో నిండిన ప్రాంతాల వద్దకు ఒం టరిగా వెళ్లనివ్వకూడదు. పరిస్థితుల్లో పోలీస్ సహాయం కోసం డయల్ 112కు కాల్ చేయాలి. వర్షాకాలంలో అప్రమత్తతే ప్రాణ రక్షణకు మొదటి అడుగు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించి సురక్షితంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు.



## ఘనంగా మహాంకాళీ బోనాలు

### అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/రామాయంపేట:** శ్రీమహాంకాళీ అమ్మవారి బోనాల ఉత్సవాలు రామాయంపేట పట్టణంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఉదయం నుండి రాత్రి వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణంలో దుర్గమ్మ యూత్, ముత్యాలమ్మ దేవాలయం, బీసీ కాలనీ ఎల్లమ్మ ఆలయం, కోటమ్మ ఆలయం, ముదిరాజ్ యూత్ కమిటి, మహిళా మండలి సమీపంలో నిర్వహించిన ఫలహార బండి ఉత్సవాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. బోనాల ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుకు ఆలయ కమిటి అద్వర్యంలో వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈసందర్బంగా ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే వర్షాలతో రాష్ట్రం సుబిక్షంగా ఉండాలని, ప్రజలందరు అమ్మవారి కరుణ కటాక్షాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం పట్టణంలోని పలు దేవాయలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల ఉత్సవాల్లో బాగంగా నిర్వహించిన ఫలహారం బండి కార్యక్రమంలో పాల్గొన్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, బీజేపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు బోనాల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టి ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నట్లు వారు తెలిపారు. కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, దేవుని రంజిత్, రవినాయక్, మాజీ మున్సిపల్ చైర్మెన్ పల్లె జితెందర్‌గౌడ్, ఫ్యాక్స్ చైర్మెన్ బాదె చంద్రం, మార్కెట్ కమిటి మాజీ చైర్మెన్ సరాపు యాదగిరి, కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
సోమవారం
10-08-2026
www.prajapaksham.in

కేంద్రంలో ప్రధాని మోదీ కార్పొరేట్లకు అండగా ఉంటూ, దేశ ప్రజలపై ధరల భారం మోపుతున్నారని సిపిఐ నాయకులు ఆరోపించారు. సామాన్యులపై ధరల భారం వేస్తున్న బిజెపి పాలనకు రానున్న రోజుల్లో చమర గీతం పాడాలని వారు పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 4 రోజులుగా నిర్వహిస్తున్న సిపిఐ ప్రచార జాతాలలో సిపిఐ నాయకులు పాల్గొన్నారు.





కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలో...


వరంగల్‌లో...


ఖమ్మం జిల్లా మధిరలో...

# కార్పొరేట్లకు ప్రధాని మోదీ అండ...


మహబూబాబాద్ జిల్లా గార్లలో...


హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో...

**ప్రజాపక్షం / విలేకరుల బృందం**

కేంద్రంలో ప్రధాని మోదీ కార్పొరేట్లకు అండగా ఉంటూ, దేశ ప్రజలపై ధరల భారం మోపుతున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి ఆరోపించారు. సామాన్యులపై ధరల భారం వేస్తున్న బిజెపి పాలనకు రానున్న రోజుల్లో చమర గీతం పాడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 4 రోజులుగా నిర్వహిస్తున్న సిపిఐ ప్రచార జాతా ఆదివారం కరీంనగర్ జిల్లా చిగిరుమామిడి మండలంలోని రేకొండ, చిగురుమామిడి, పీచుపల్లి, ముల్కనూర్, సీతారాంపూర్, లంబాడిపల్లి, ఇందుర్తి, గాగిరెడ్డిపల్లి, ఓగులాపూర్, ముదిమాణిక్యం, రామంచ గ్రామాల్లో పర్యటించింది. కార్యక్రమాలకు మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి అధ్యక్షత వహించారు. పాదయాత్రకు ముఖ్య అతిథిగా హాజరై చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా వ్యతరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేందుకు దేశవ్యాప్తంగా పాదయాత్రలు చేస్తున్నామని, సెప్టెంబర్ 1న ఛలో ఢిల్లీ కార్యక్రమం పిలుపునిచ్చామని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. జాతాలో సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ జాగిరి సత్యనారాయణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, పొనుగంటి కేదారి, కోఆర్డినేటర్లు గూడెం లక్ష్మి, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, బోయిని అశోక్, చాడ శ్రీధర్ రెడ్డి, అందె చిన్నస్వామి, బోయిని వల్లభాయ్ పటేల్, కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, తేరాల సత్యనారాయణ, ముద్రకోల రాజయ్య, మావురపు రాజు, బూడిద సదాశివ, బీర్ల పద్మ, కొట్టె అంజలి, ఎఐవైఎఫ్ కార్యదర్శి బామండ్లపెల్లి యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటమే కమ్యూనిస్టుల ధ్యేయం : తక్కళ్లపల్లి

ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటమే కమ్యూనిస్టుల ధ్యేయమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం సిపిఐ వరంగల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ నుండి ప్రారంభమైన సిపిఐ పాదయాత్రను రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ పాదయాత్ర ఎల్బీ నగర్, గొర్రెకుంట, ధర్మారం మీదుగా గీసుకొండకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తిని క్రమబద్ధంగా దెబ్బతీస్తుందని, ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందని, సాధారణ పౌరులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. రైతాంగాన్ని పూర్తిగా విస్మరించారని, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వడంలో విఫలమయ్యారన్నారు. వీటిపై దేశ వ్యాప్తంగా సిపిఐ పాదయాత్రలు చేపట్టి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతున్నదన్నారు. కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, పంజాల రమేష్, సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి, సీనియర్ నాయకులు టి.వెంకట్రాములు, జిల్లా సహాయ కార్యదర్శులు దండు లక్ష్మణ్, పనాస ప్రసాద్, గన్నారపు రమేష్, అక్కపెల్లి రమేష్, కందిక చెన్న కేశవులు, సంగి ఎలేందర్, గుండె బద్రి, వీరగోని శంకరయ్య, తాళ్లపల్లి రహేలా, ఓర్సు రాజు, ఎండి అక్బర్, రమేశ్, సువర్ణ పాల్గొన్నారు.

## జంతర్ మంతర్‌లో మోదీకి షాక్ ఇచ్చిన యువత : బాగం

జంతర్ మంతర్‌లో యువత సాగించిన పోరాటం మోదీకి షాక్ ఇవ్వడమే కాక భవిష్యత్తు పోరాటాలకు స్ఫూర్తినిచ్చిందని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. తాము ఏం చేసినా చెల్లుబాటు అవుతుందిలే అన్న నిరంకుశ ధోరణిలో వ్యవహరిస్తున్న మోదీ ఇప్పటికైనా యువతను వేధించడం మానుకోవాలన్నారు. సిపిఐ జనచైతన్య యాత్రలో భాగంగా ఆదివారం ఖమ్మం జిల్లా మధిర మండల పరిధిలోని మల్లవరం, మధిర, మడుపల్లి గ్రామాల్లో యాత్ర నిర్వహించారు. పలుచోట్ల అరుణ పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన పలు సభల్లో హేమంతరావు మాటాడారు. మల్లవరం, మడిపల్లి గ్రామాల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. అమరులు ఊట్ల సాంబయ్య, మందడపు నాగేశ్వరరావు, మచ్చా హనుమంతరావు స్మారక స్థూపాల వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు ఎర్రబాబు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నరసింహారావు, బెజవాడ రవి, సిహెచ్.సీతా మహాలక్ష్మి, మిడికంటి వెంకటరెడ్డి, ఏనుగు గాంధీ, ఎంఏ రహీం, యంగల ఆనందరావు, ప్రజా సంఘాల బాధ్యులు బత్తినేని నీరజ, ఇటికాల రామకృష్ణ, మడుపల్లి లక్ష్మణ్, పగిళ్ల వీరభద్రం, తాటి నిర్మల, శ్రావణ్ పాల్గొన్నారు.

## యువత తిరుగబడితే ప్రభుత్వాలే కూలుతాయి : బాలనరసింహ

బిజెపి ప్రభుత్వం దేశంలోని ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ వారికి అప్పనంగా అమ్మేస్తూ దేశ యువతను నిరుద్యోగులుగా మార్చి కుల, మత ప్రాంతాలుగా విభజన రేఖలు గీస్తూ యువతను దగా చేస్తున్నారని యువత తలుచుకుంటే ప్రభుత్వమే కూలిపోతాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల్ నరసింహ అన్నారు. సిపిఐ జాతీయ పార్టీ పిలుపు మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం సిపిఐ పార్టీ పాదయాత్ర నాలుగో రోజు పెద్ద కొత్తపల్లి మండలంలోని మారేడు మాన్ దీన్నే, సాతాపూర్, నారాయణపల్లి, గంట్రావుపల్లి, మహాసముద్రం, చెన్నప్పరావు పల్లి చేపట్టారు. పాదయాత్రలకు ముఖ్య అతిథిగా ఎం.బాల్‌నరసింహ, సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కన్నీరు నరసింహ, నాయకులు తుమ్మల శివుడు, బండి లక్ష్మీ పతి, కురుమయ్య, కిరణ్‌కుమార్, కందూరు వెంకటమ్మ, జిల్లా చందు, రామకృష్ణ, వెంకటస్వామి, సాయిలు, బండి కృష్ణయ్య, బాలపీరు, పుట్టకురుమయ్య, రమణ, బొందయ్య, ప్రకాశ్, గాలెన్న తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగాలు ఇవ్వాలి : నెల్లికంటి

చౌటుప్పల్ ప్రాంతంలోని పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలని ఎమ్మెల్సీ,సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాచైతన్య యాత్ర ఆదివారం చౌటుప్పల్ పట్టణానికి చేరుకుంది. చౌటుప్పల్ పట్టణంలో సిపిఐ కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. యాత్రకు చౌటుప్పల్ సిపిఐ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వందలాది ఎకరాల వ్యవసాయ భూములను, గ్రామాలను కలుషితం చేస్తూ ఇక్కడి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. కంపేనీల యాజమాన్యాలు కనీస ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా పరిశ్రమలు నిర్వహిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. బడా పరిశ్రమలు అయిన దివిస్ లాంటి పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్న కూడా బయటకు రాకుండా లోలోపల ప్రమాదాలను దాచి రాయబారం నడుపుతూ అనేక మంది కార్మికుల కుటుంబాలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. స్థానిక పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకనోతు పోరుబాటకు భారత కమ్యూనిస్టు పార్టీ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్‌రెడ్డి, బచ్చగోని గాలయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్దె శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు దుబ్బాక భాస్కర్, కలకొండ సంజీవ, చిలివేరు అంజయ్య, సుర్వి నర్సింహ్మ, కోండూరి వెంకటేష్, బుడిగపాక జగన్, నాయకులు చలం పాండురంగారావు, ముత్యాల అంజయ్య, పిల్లి శంకరయ్య, మునిసిపాలిటీ సభాయ కార్యదర్శి ఉడుత రామలింగం, బద్దుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మోదీ పాలనలో సంక్షోభంలో సాగు : సురేష్

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడిందని జన చైతన్య యాత్రలో సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ విమర్శించారు. రైతులు, కార్మికులను కార్పొరేట్ పెట్టుబడిదారులకు బానిసలుగా మార్చే విధంగా కేంద్ర ప్రభుత్వం విధానాలు రూపొందిస్తోందని ఆరోపించారు. సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన జన చైతన్య యాత్ర ఆదివారం మండలంలోని మోటమర్రి, రాయన్నపేట, కలకోట, బ్రాహ్మణపల్లి, రాపల్లి గ్రామాల మీదుగా కొనసాగింది. రాయన్నపేట తూము ప్రకాశరావు భవన్‌లోని ప్రకాశరావు కాంస్య విగ్రహానికి, కలకోటలోని ప్రకాశరావు స్మారక స్థూపాలకు సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మోటమర్రి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో సిపిఎం నాయకులు ప్రజా చైతన్యయాత్రకు సంఘీభావం బంధం శ్రీనివాసరావు, తెల్లాకుల శ్రీనివాసరావులు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, సింగు నరసింహారావు, సిహెచ్ సీతామహాలక్ష్మి ,ఏనుగు గాంధీ, తోట రామాంజనేయులు, మండల కార్యదర్శి యంగల ఆనందరావు, తూము రోషన్‌కుమార్, బత్తినేని నీరజ, బుర్రి నాగేశ్వరావు, ఏలూరి పూర్ణచంద్రరావు, గుడిద కృష్ణ, ఏనుగు కృష్ణయ్య, రైతు సంఘం నాయకులు పారుపల్లి నరసింహరావు, కొంగర భాస్కరరావు పాల్గొన్నారు.

## హామీల అమలులో విఫలం : లక్ష్మణ్

కేంద్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచడంలో పూర్తిగా విఫలమైందని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, కంట్రోల్ మిషన్ కార్యదర్శి మిట్టపల్లి వెంకటస్వామి విమర్శించారు. మంచిర్యాల జిల్లా సోమగూడెంలో సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా పోరుయాత్రను ఆదివారం వారు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సిపిఐ బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, గట్టు సర్వేషం, బొంతల లక్ష్మీ నారాయణ, మేకల రాజేశం, రత్నం రాజం, కొండు బానేష్, బొంకూరి రామచందర్, దాసరి తిరుపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అధిక ధరలతో ప్రజల నడ్డి విరుస్తున్న మోదీ : యానాల

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికధరలతో ప్రజల నడ్డి విరుస్తుందని సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ సిపిఐ జాతీయ కమిటీ పిలుపు మేరకు ఆదివారం యాదాద్రి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలో సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చెడే చంద్రయ్య, మోత్కూర్ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, మండల సహాయ కార్యదర్శి, గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు చాపల అంజయ్య, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బుష్పాక నరసింహ, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మొగల శేఖర్‌రెడ్డి, నాయకులు పోచం కన్నయ్య, పట్టణ సహాయ కార్యదర్శి గొలుసుల యాదగిరి, తాడూరు లక్ష్మీ నరసయ్య, తాపీ సంఘం పట్టణ కార్యదర్శి ఎండి పాషా, ఎఐటియుసి మండల కార్యదర్శి జంగా నరసయ్య, జంగ లింగం, కడమంచి సాయి, పెండెం వెంకటేశ్వర్లు, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. మున్సిపట్ల, పాలడుగు, దత్తప్ప గూడెం, అనాసపురం, పాటిమట్టల గ్రామాలలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు.

## సాగుదారులపై దాడులు ప్రతిఘటిద్దాం : సాబీర్‌పాషా

ఏజెన్సీ గ్రామాలతో మిళితమైన ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గిరిజన గిరిజనేతర పోడు సాగు దారులు సాగుచేసుకుంటున్న భూములపై తక్షణమే హక్కులు కల్పించాలని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా డిమాండ్ చేశారు. సాగుదారులపై దాడులను ప్రతిఘటిద్దామని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా చేపట్టిన ప్రజాచైతన్య యాత్ర నాలుగో రోజైనా ఆదివారం భద్రాద్రి జిల్లా లక్ష్మీ దేవిపల్లి మండలం అనిశెట్టిపల్లిలో ప్రారంభమైంది. సంపత్‌నగర్ ఆళ్లపల్లి గుండాల మీదుగా మండల కేంద్రం వరకు యాత్ర ఉత్సాహభరితంగా సాగింది. ఈసందర్భంగా ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మోటార్ సైకిల్ ర్యాలీలు నిర్వహించి నాయకులకు పూలమాలలు వేసి హారతులు పట్టి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, సరెడ్డి పుల్లారెడ్డి, నరాటి ప్రసాద్, చంద్రగిరి శ్రీనివాసరావు, కె.సారయ్య, విపూర్ణ చంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, దేవరకొండ శంకర్, మండల కార్యదర్శులు ధీటి లక్ష్మీ పతి, కొమరం హన్మంతరావు, బొప్పిశెట్టి సత్యనారాయణ, వాగబోయిన రమేష్, నరెడ్ల రాంబాబు, వజ్జా పగడయ్య, షేక్ రహీమ్, ఉమారాణి, మల్లేష్, సహదేవ్, సురేందర్, నరేష్, వెంకటేష్, సతీష్ రాజేష్ సూర్యనారాయణ బాయమ్మ బచ్చలి రామయ్య ఎస్‌కే షాహేద్ లక్ష్మయ్య సమీర్ సంధ్యారాణి నాగమణి ఎర్రమ్మ నాజీర్ షబ్బీర్ పవన్ రవి వర్మ వంశీ వరుణ్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ వర్గాలకు ఊడిగం చేస్తున్న మోదీ : విజయసారథి

కార్పొరేట్ వర్గాలకు కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కార్ ఊడిగం చేస్తూ ప్రజా సమస్యలను గాలి కొదిలేసిందని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథిరెడ్డి ఆరోపించారు. ఆదివారం సిపిఐ మహబుబాబాద్ జిల్లా గార్ల మండల సమితి ఆధ్వర్యంలో మండలంలోని మద్దివంచ గ్రామంలో ప్రారంభమైన సిపిఐ పాదయాత్ర రాంపురం, ముల్కనూరు, గుంపెళ్ళగూడెం మీదుగా సీతంపేట, శేరిపురం, మర్రిగూడెం, పినిరెడ్డి గూడెం, గోపాలపురం చేరుకుంది. పాదయాత్రను సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్ పారంభించారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న సహాయకార్యదర్శి రాగం రమేష్, కృష్ణమూర్తి, దూపాటి జగన్నాదం, మేదరమెట్ల గిరిప్రసాద్, భూక్యహరి నాయక్, మండల కార్యదర్శి సారిక శ్రీనివాస్, సింగు రమేష్, మాగం లోకేష్, బోగెల్లి కోటేశ్వరి పాల్గొన్నారు.

## దళిత, గిరిజన, ఆదివాసీలపై దాడులు : భిక్షపతి

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం హయాంలో దేశంలో దళిత, గిరిజన, ఆదివాసీలపై దాడులు పెరిగాయని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార పాదయాత్ర కమలాపూర్ మండలంలో పంగిడిపల్లి, వంగపల్లి, శనిగరం గ్రామాల్లో కొనసాగింది. వంగపల్లిలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మండల కార్యదర్శి నకీర్త ఓదెలు, సదాలక్ష్మి, తోట బిక్షపతి, జక్కురాజ్ గౌడ్, ఊట్కూరు రాములు, అశోక్, స్టాలిన్, రవి, రామ్మూర్తి పాల్గొన్నారు.


యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో...


ఖమ్మం జిల్లా బోనకల్‌లో...


భద్రాద్రి జిల్లా అనిశెట్టిపల్లిలో...


నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లపూర్‌లో..


మంచిర్యాల జిల్లా సోమగూడెంలో..


యాదాద్రి జిల్లా మోత్కూర్‌లో..

## బతుకలేని స్థితి

**(మొదటి పేజీ తరువాయి)**

పాల్గొన్నారు. నల్లగొండ జిల్లా డిండి మండలంలోని ఖానాపూర్ గ్రామంలో నిర్వహించిన సిపిఐ ప్రజా చైతన్య యాత్రలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధనాలు అవలంబిస్తున్న బిజెపిని గద్దె దించాల్సిందేనన్నారు. ర్యాలీ డప్పు చప్పుళ్లతో, కళాకారుల పాటల మధ్య గ్రామ పుర వీధుల గుండార్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన సభలో పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ విపరీతంగా ధరలను పెంచి సామాన్యులు బతకలేని పరిస్థితిని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిందని పెట్రోల్, డిజిల్, వంట గ్యాస్ ధరల పెంపు అడ్డు అదుపు లేకుండా పెంచుతున్నారని ప్రజలపై ఏ మాత్రం ప్రధాని మోదీకి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. కనీస వేతనాలు అందుకోలేని కార్మిక వర్గం శ్రమ దోపిడీకి గురవుతున్నదని, మరోపక్క ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వచ్చిన తర్వాత లక్షలాదిమంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోతున్న తరుణంలో మరంత నిరుద్యోగాన్ని పెంచే విధంగా బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూల విధానాలు చేస్తున్నదన్నారు. అనంతరం ప్రజా చైతన్య యాత్ర బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. మండలంలోని కందుకూరు, ఎర్రగుంటపల్లి, బ్రాహ్మణపల్లి, రామంతాపూర్, సింగరాజు పల్లి, తవక్లాపూర్, శేషాయికుంట, చెరుకుపల్లి, ఎర్రారం, కే. గౌరారం, గోనబోయినపల్లి, బోగ్గులదోన, జేత్యతండా, గోనకోల్,డిండి వరకు యాత్ర సాగింది. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహా, జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దిన్, డిండి, దేవరకొండ, చందంపేట, నేరేడుగొమ్ము మండల పార్టీ కార్యదర్శులు కనకాచారి, సుదర్శన్‌రెడ్డి, వెంకటయ్య, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాసమస్యలు గాలికి : తక్కళ్లపల్లి ...**కార్పొరేట్ వర్గాలకు కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ ఊడిగం చేస్తూ ప్రజా సమస్యలను గాలికొదిలే సిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ప్రచార జాత పాదయాత్ర ఆదివారం పరకాల పుర వీధుల మీదగా అంబేద్కర్ విగ్రహం వరకు ఉత్సాహపూరితంగా సాగింది. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ సీనియర్ నాయకులు తాటిపాముల వెంకట్రాములు తో కలిసి అంబేద్కర్ విగ్రహంకు పూలమాల వేసి నివాళులర్పించారు.అలాగే పరకాల అమరధామం వద్ద తెలంగాణ సాయుధ పోరాట యోధులకు నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ లో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మండ సదాలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ రాష్ట్ర సహాయ తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తుందని ఆరోపించారు. చిత్తశుద్ధి ఉంటే ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని హితవు పలికారు. నిరంతరం పేదల, బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడే కమ్యూనిస్టులుగా తాము ప్రజాసమస్యలపై ఉద్యమిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు తాటికపాముల వెంకట్రాములు, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి , జిల్లా సహాయకార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా, మండల నాయకులు, డి.హెచ్.పి.ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల మనోహర్, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు గడ్డం రాజనర్సు, రోంటాల శ్యామ్, తాటికంటి మమత, మాలోత్ మంగ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి: పశ్య పద్మ** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల కార్మికులు, రైతులు, మహిళలు, సామాన్య ప్రజల తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ తీవ్రంగా విమర్శించారు. ప్రజా సమస్యలపై ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని కార్మిక, కర్షక వర్గాలకు పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పద్మ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కార్మికులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర లభించేలా చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల ఆదాయం, వ్యవసాయ రంగం అభివృద్ధిపై కేంద్రం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని కోరారు. మహిళలకు కల్పించిన రిజర్వేషన్‌ను జాప్యం చేయకుండా తక్షణమే అమలు చేయాలన్నారు. విద్య వైద్యంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ ఇన్చార్జ్ దుబాస్ రాములు, కన్వీనర్ శంకర్, గంగాధర్, కార్మికులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com